ప్రజా వాయిస్
PRAJA VOICE
ఇది ప్రజల గొంతుక
/ PRAJA VOICE
సంపుటి: 02 | సంచిక: 32 | ఎడిటర్: మేనం శ్యామ్ | బుధవారం 19-08-2026 | పేజీలు: 10




## సిరా చుక్క

సోషల్ మీడియా గర్జన 'బిగ్ బాస్' బాగోతం..
తెరవెనుక నడిచే మాయా జగత్తులో,
తెలుగు నేలపై సాగే వికృత నాటకం!
సామాన్యుడి గొంతుకను గాలికొదిలేసి,
'బిగ్ బాస్' షో చేసే ఈ ప్రహసనం!
ఎంపికల పేరుతో ఏటవాలు ధోరణులు,
సామాన్యుల మనోభావాలను గాయపరచుట!
న్యాయమూర్తులెవరో, తీర్పులెవరికో,
'బిగ్ బాస్' అగ్నిపరీక్షలంటూ
ఆడుకునే నాటకాలు!
సోషల్ మీడియా వేదికల సాక్షిగా,
జనం గుండెల్లో రగులుతున్న ఆగ్రహ జ్వాలలు!
నిర్వాకుల తీరుపై, తీర్పుల జోరుపై,'
బిగ్ బాస్' పై నిప్పులు చెరుగుతూ
విరుచుకుపడుతోంది లోకం!
సమాజానికి ఈ షో ద్వార
ఏం సందేశం ఇస్తున్నారు...
చెడును పెంచి పోషించే
ఈ సంస్కృతి ఏమిటి?
వ్యాపార సూత్రాల వెనుక ఉన్న మర్మం
మానవ విలువలను మంట కలపడం,
బూతుల మోత,'బిగ్ బాస్' తీరును చూసి
వీధులకెక్కి నేడు నిలదీస్తోంది ప్రజాకోటి!...

– నరసింహ జర్నలిస్ట్....,
కోట్ పల్లి వికారాబాద్ ....




# కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్.. నాది సోషల్ జస్టిస్

## సీఎం రేవంత్

- కేసీఆర్‌ను సీఎం చేస్తే కేటీఆర్ మంత్రి.. నన్ను సీఎం చేస్తే పొన్నం ప్రభాకర్ మంత్రి అయ్యారు
- ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇళ్లు నిర్మిస్తున్నాం
- గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఏటా రూ.75 వేల కోట్లు చెల్లిస్తున్నాం
- కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి వస్తే 117 సీట్లు గెలుస్తుంది





**ప్రజా వాయిస్, హైదరాబాద్:** కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్ అయితే తనది సోషల్ జస్టిస్ అని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. కేసీఆర్‌ను ముఖ్యమంత్రిని చేస్తే ఆయన కుమారుడు కేటీఆర్ మంత్రి అయ్యారని, తనను ముఖ్యమంత్రిని చేస్తే బీసీ బిడ్డ పొన్నం ప్రభాకర్ మంత్రి అయ్యారని పేర్కొన్నారు. కేసీఆర్‌ది దొరల న్యాయం అయితే.. తనది సామాజిక న్యాయమని సీఎం వ్యాఖ్యానించారు.

**పేదల కోసం ఇళ్లు కడుతున్నాం..**

కేసీఆర్ వెయ్యి ఎకరాల్లో ఫామ్‌హౌస్ కట్టుకున్నారని సీఎం రేవంత్ విమర్శించారు. తాను మాత్రం పేద ప్రజల కోసం ప్రతి నియోజకవర్గంలో 3,500 ఇళ్లు నిర్మిస్తున్నానని చెప్పారు. పేదల ఇంటిపై కేసీఆర్‌కు ఎలాంటి ధ్యాస లేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో అందెశ్రీ రాసిన పాటను పదేళ్ల పాటు గడీల్లో బంధించారని ఆరోపించారు.

**రూ.75 వేల కోట్ల అప్పులు చెల్లిస్తున్నాం..**

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో పదేళ్లలో చేసిన అప్పులే తమ ప్రభుత్వానికి భారంగా మారాయని సీఎం రేవంత్ అన్నారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఏటా రూ.75 వేల కోట్లు చెల్లించాల్సి వస్తోందని తెలిపారు. అప్పులు చెల్లించిన తర్వాత మిగిలిన నిధులతోనే సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ పాలన సరిగా లేకపోవడం వల్లే కేసీఆర్ గత ఎన్నికల్లో ఓడిపోయారని వ్యాఖ్యానించారు.

**ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం..**

బహుజన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి సందర్భంగా మంగళవారం హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఆయన విగ్రహాన్ని సీఎం రేవంత్ రెడ్డి ఆవిష్కరించారు. తొలుత వేరే ప్రాంతంలో విగ్రహం ఏర్పాటు చేయాలని భావించినప్పటికీ.. నగరం నడిబొడ్డున ట్యాంక్‌బండ్‌పై సర్వాయి పాపన్న విగ్రహం ఉండాలని తానే సూచించినట్లు తెలిపారు.ట్యాంక్‌బండ్‌కు వచ్చే ప్రతి ఒక్కరూ సర్వాయి పాపన్న విగ్రహాన్ని చూసి ఆయన చరిత్ర తెలుసుకోవాలని ఆకాంక్షించారు. బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన గొప్ప వీరుడు సర్వాయి పాపన్న అని కొనియాడారు. పాపన్న విగ్రహం కోసం గతంలో ఎన్నో డిమాండ్లు వచ్చినా బీఆర్ఎస్ ప్రభుత్వం బహుజనుల ఆకాంక్షలను పట్టించుకోలేదని విమర్శించారు.

**ఇది బహుజనుల తెలంగాణ..**

బహుజనుల కోరిక మేరకే కాంగ్రెస్ ప్రభుత్వం

మిగతా 2లో

# ఢిల్లీ విద్యార్థుల నిరసనలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

- జంతర్ మంతర్ నిరసనలపై స్వతంత్ర విచారణకు కమిటీ ఏర్పాటు
- మాజీ సీబీఐ డైరెక్టర్, మాజీ న్యాయమూర్తితో కమిటీ
- విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంపైనా విచారణ
- నిరసనల్లో నమోదైన కేసుల వివరాలు ఇవ్వాలని కేంద్రానికి ఆదేశం




**ప్రజా వాయిస్, న్యూఢిల్లీ:** నీట్ పరీక్షలో అక్రమాల నేపథ్యంలో ఢిల్లీలో విద్యార్థులు చేపట్టిన నిరసనలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం తీసుకుంది. జంతర్ మంతర్ సహా ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళనలు, పోలీసుల బలప్రయోగంపై స్వతంత్ర విచారణ జరిపించాలని నిర్ణయించింది. ఈ మేరకు మాజీ సీబీఐ డైరెక్టర్, మాజీ న్యాయమూర్తితో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

**నిరసనలపై స్వతంత్ర విచారణ..**

నీట్ అక్రమాలకు బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని కోరుతూ కాక్రోచ్ జనతా పార్టీ ఆధ్వర్యంలో జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు నిరసనలు చేపట్టారు. అనంతరం పార్లమెంట్ మార్చ్‌కు కూడా పిలుపునిచ్చారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విద్యార్థులు ఢిల్లీకి చేరుకుని ఆందోళనల్లో పాల్గొన్నారు.ఈ సందర్భంగా పోలీసులు విద్యార్థులను అడ్డుకునేందుకు బలప్రయోగం చేశారనే ఆరోపణలు వచ్చాయి. దీనిపై దాఖలైన పలు పిటిషన్లను విచారించిన సుప్రీంకోర్టు.. నిరసనలకు సంబంధించిన అంశాలపై స్వతంత్రంగా పరిశీలన జరపాలని నిర్ణయించింది.

**మాజీ సీబీఐ డైరెక్టర్, మాజీ న్యాయమూర్తితో కమిటీ..**

జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల నిరసనల వల్ల తలెత్తిన సమస్యలు, ఆరోపణలను పరిశీలించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేయనున్నట్లు

మిగతా 2లో

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కేసులో సంచలన ట్విస్ట్

- విద్యార్థులే నిందితులా..?



ప్రజా వాయిస్,కొండమల్లేపల్లి: నల్గొండ జిల్లా కొండమల్లేపల్లి మండల కేంద్రంలోని జేబీ కాలనీలో నాగార్జున పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్ కల్లు రూపారెడ్డి దారుణ హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించినట్లు సమాచారం. ఈ కేసులో నాగార్జున పాఠశాలలో పదో తరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థుల పాత్ర ఉన్నట్లు పోలీసుల దర్యాప్తులో గుర్తించినట్లు తెలుస్తోంది. వంశీ, అనిల్‌గా చెబుతున్న ఇద్దరు విద్యార్థులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. ఒకరు పిల్యా తండాకు, మరొకరు పుల్‌సింగ్ తండాకు చెందినవారిగా గుర్తించినట్లు తెలుస్తోంది.ఈ ఘటన ఆగస్టు 12న కొండమల్లేపల్లి

మిగతా 2లో

# హైదరాబాద్‌లో కల్తీ నెయ్యి మాఫియాపై ఉక్కుపాదం

- నగరవ్యాప్తంగా 130 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు
- 39 కల్తీ నెయ్యి తయారీ కేంద్రాలు.. 91 విక్రయ దుకాణాలపై దాడులు
- రసాయనాలు, అనధికారిక నూనెలతో సింథటిక్ నెయ్యి తయారీ
- 'ప్యూర్ దేశీ నెయ్యి' పేరుతో కల్తీ ఉత్పత్తుల విక్రయం



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న కల్తీ కేటుగాళ్లపై హైదరాబాద్ నగర పోలీసులు ఉక్కుపాదం మోపారు. కల్తీ ఆహార పదార్థాల తయారీ, విక్రయాలను అరికట్టేందుకు ఏర్పాటు చేసిన హైదరాబాద్ ఫుడ్ అడల్టరేషన్ సర్వైలెన్స్ టీమ్ (హెచ్-ఫాస్ట్), ఫుడ్ సేఫ్టీ డిపార్ట్‌మెంట్ అధికారులతో కలిసి భారీ ఆపరేషన్ చేపట్టింది. కచ్చితమైన నిఘా సమాచారం, ప్రజల నుంచి అందిన ఫిర్యాదుల ఆధారంగా నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏకకాలంలో విస్తృత తనిఖీలు నిర్వహించారు.

**130 ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు..**

ఈ భారీ ఆపరేషన్‌లో భాగంగా నగరవ్యాప్తంగా మొత్తం 130 ప్రాంతాల్లో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఇందులో 39 కల్తీ నెయ్యి తయారీ కేంద్రాలు, 91 కల్తీ నెయ్యి విక్రయించే దుకాణాలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తనిఖీల సందర్భంగా కల్తీ మాఫియా సాగిస్తున్న అక్రమ వ్యవహారాలు

మిగతా 2లో

# గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

- బండి సంజయ్ కీలక ప్రకటన
- కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని గణేష్ మండపాలకు ఫ్రీ కరెంట్
- విద్యుత్ బిల్లులను కార్పొరేషనే భరిస్తుందని వెల్లడి
- నగరంలో ఏటా 2 వేల గణేష్ మండపాల ఏర్పాటు
- కరీంనగర్ అభివృద్ధికి ఇప్పటివరకు రూ.22 వేల కోట్ల నిధులు తెచ్చాం

2లో



# పేదల కోసం 'భూలక్ష్మి' పథకం..

- అర్హులైన కుటుంబాలకు ఎకరం భూమి: కవిత
- అధికారంలోకి వస్తే భూలక్ష్మి పథకం అమలు చేస్తామని ప్రకటన
- అర్హులైన ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తామని హామీ
- సామాజిక న్యాయం కోసం మళ్లీ భూ పంపిణీ జరగాలని వ్యాఖ్య
- 22ఏ పేరుతో పేదల భూములను లాక్కుంటే ఊరుకోబోమని హెచ్చరిక



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) చీఫ్ కల్వకుంట్ల కవిత సంచలన ప్రకటన చేశారు. వచ్చే ఎన్నికల్లో తమ పార్టీ అధికారంలోకి వస్తే పేదల కోసం 'భూలక్ష్మి' పథకాన్ని తీసుకొస్తామని ప్రకటించారు. రాష్ట్రంలో నిజమైన సామాజిక న్యాయం జరగాలంటే మళ్లీ భూ పంపిణీ జరగాల్సిన అవసరం ఉందని అన్నారు. అర్హులైన ఒక్కో కుటుంబానికి ఎకరం భూమి పంపిణీ చేస్తామని హామీ ఇచ్చారు.

**22ఏ పేరుతో భూ దొంగతనం..**

రాష్ట్రంలో రేవంత్ రాక్షస రాజ్యం నడుస్తోందని కవిత తీవ్రంగా విమర్శించారు. 22ఏ జాబితా పేరుతో ప్రభుత్వం భూ దొంగతనానికి రాచబాట

మిగతా 2లో

# 22ఏ భూములపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

- 22ఏ నిషేధిత భూములపై మరో రెండు రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలన
- ప్రైవేటు భూమిగా తేలితే వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆదేశం
- అన్ని జిల్లాల కలెక్టర్లు 22ఏ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలి
- భూ యజమానులకు ఇబ్బందులు రానివ్వబోమని సీఎం స్పష్టీకరణ



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణలో 22ఏ నిషేధిత భూముల జాబితా వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారు. తన నివాసంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించిన సీఎం.. 22ఏ జాబితాలో ఉన్న భూముల వాస్తవ పరిస్థితిని పరిశీలించి, అర్హులైన ప్రైవేటు భూ యజమానులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ప్రైవేటు భూముల యజమానులకు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇబ్బందులు రానివ్వబోమని స్పష్టం చేశారు.

**మరో రెండు రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలన..**

22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములపై రెవెన్యూ అధికారులు మరో రెండు రోజుల్లో క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించనున్నట్లు సీఎం రేవంత్ తెలిపారు. భూమి వాస్తవంగా ప్రైవేటు వ్యక్తికి చెందినదిగా నిర్ధారణ అయితే రిజిస్ట్రేషన్ ప్రక్రియను వెంటనే పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. దీంతో 22ఏ జాబితాలో పేరు ఉండటంతో రిజిస్ట్రేషన్ నిలిచిపోయిన భూ యజమానులకు ఊరట లభించే అవకాశం ఉంది.

**కలెక్టర్లు సమగ్రంగా పరిశీలించాలి..**

రాష్ట్రంలోని అన్ని జిల్లాల కలెక్టర్లు

మిగతా 2లో

# హైదరాబాద్‌లో కల్తీ నెయ్యి మాఫియాపై ఉక్కుపాదం

**మొదటి పేజీ తరువాయి**

వెలుగులోకి వచ్చినట్లు తెలిపారు.

**రసాయనాలతో సింథటిక్ నెయ్యి తయారీ..**

కల్తీ నెయ్యి తయారీకి ఎలాంటి పాల పదార్థాలను ఉపయోగించకుండా.. ప్రమాదకరమైన రసాయనాలు, అనధికారిక నూనెలతో సింథటిక్ నెయ్యిని తయారు చేస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అనంతరం ఈ కల్తీ మిశ్రమాన్ని ఆకర్షణీయమైన ప్యాకింగ్‌లో 'ప్యూర్ దేశీ నెయ్యి' పేరుతో మార్కెట్లోకి విడుదల చేస్తున్నట్లు వెల్లడించారు.

**ఆరోగ్యానికి తీవ్ర ముప్పు..**

పాల ఉత్పత్తులకు సంబంధం లేకుండా రసాయనాలు, అనధికారిక నూనెలతో తయారు చేస్తున్న సింథటిక్ నెయ్యి వినియోగదారుల ఆరోగ్యానికి తీవ్ర ముప్పు కలిగించే అవకాశం ఉందని పోలీసు ఉన్నతాధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ప్రజలకు కల్తీ ఆహార పదార్థాలను విక్రయించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.కల్తీ ఆహార పదార్థాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద ఉత్పత్తులు లేదా తయారీ కేంద్రాలపై సమాచారం ఉంటే అధికారులకు తెలియజేయాలని సూచించారు.

# విద్యార్థినులపై అసభ్య ప్రవర్తన ఆరోపణలు.. లెక్చరర్‌కు దేహశుద్ధి

- దేవరకొండ ప్రభుత్వ బాలికల కళాశాలలో కలకలం
- తెలుగు లెక్చరర్‌పై విద్యార్థినుల వేధింపుల ఆరోపణలు
- కళాశాల గేటు ముందు విద్యార్థినుల ఆందోళన
- లెక్చరర్‌ను అడ్డుకుని నిరసనకారుల దాడి.. పోలీసుల జోక్యం



లెక్చరర్‌పై దాడి.. పోలీసుల జోక్యం

**ప్రజా వాయిస్, నల్లగొండ:** విద్యార్థులకు విద్యాబుద్ధులు నేర్పించి ఉన్నత మార్గంలో నడిపించాల్సిన ఓ ఉపాధ్యాయుడిపై విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధింపులకు పాల్పడుతున్నారనే ఆరోపణలు తీవ్ర కలకలం రేపాయి. నల్లగొండ జిల్లా దేవరకొండలోని ప్రభుత్వ జూనియర్ బాలికల కళాశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. తెలుగు బోధిస్తున్న భాస్కర్ అనే లెక్చరర్ కొంతకాలంగా విద్యార్థినుల పట్ల అనుచితంగా ప్రవర్తిస్తున్నారంటూ ఆరోపణలు రావడంతో విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**కళాశాల గేటు ముందు విద్యార్థినుల ఆందోళన..**

లెక్చరర్ భాస్కర్ వేధింపులు తాళలేక విద్యార్థినులు కళాశాల గేటు ముందు బైఠాయించి ఆందోళనకు దిగారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న ఉపాధ్యాయుడిపై వెంటనే కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న వివిధ విద్యార్థి సంఘాల నాయకులు కూడా అక్కడికి చేరుకుని విద్యార్థినులకు మద్దతు తెలిపారు.

ఆందోళన జరుగుతున్న సమయంలో లెక్చరర్ భాస్కర్ అక్కడికి రావడంతో విద్యార్థినులు, విద్యార్థి సంఘాల నాయకులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయనను అడ్డుకుని నిలదీశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కొందరు నిరసనకారులు భాస్కర్‌పై దాడి చేసినట్లు సమాచారం.సమాచారం అందుకున్న స్థానిక పోలీసులు వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్నారు. ఆందోళనకారులను అదుపులోకి తీసుకుని పరిస్థితిని చక్కదిద్దారు. లెక్చరర్ భాస్కర్‌ను రక్షణగా అక్కడి నుంచి తరలించారు.

**ఫిర్యాదు ఆధారంగా విచారణ..**

ఘటనపై పోలీసులు స్పందిస్తూ కళాశాలలో శాంతిభద్రతలను పునరుద్ధరించారు. బాధితుల నుంచి ఫిర్యాదు స్వీకరించి, లెక్చరర్‌పై సమగ్ర విచారణ చేపడతామని తెలిపారు. ఆరోపణలు నిజమని తేలితే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.విద్యార్థినుల భద్రతకు ఎలాంటి భంగం కలగకుండా చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో విద్యార్థులు ఆందోళన విరమించారు. మరోవైపు ఈ వ్యవహారంపై విద్యాశాఖ అధికారులు కూడా శాఖాపరమైన విచారణకు ఆదేశించినట్లు సమాచారం. విచారణ పూర్తయిన తర్వాత పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.

# ఢిల్లీ విద్యార్థుల నిరసనలపై సుప్రీంకోర్టు కీలక నిర్ణయం

**మొదటి పేజీ తరువాయి**

సుప్రీంకోర్టు వెల్లడించింది. తమవైపు నుంచి మాజీ సీబీఐ డైరెక్టర్ ఒకరిని, మాజీ న్యాయమూర్తి ఒకరిని కమిటీలో చేర్చినట్లు తెలిపింది.కమిటీలో మరికొందరిని చేర్చే అంశంపై సంబంధిత వర్గాలు, పిటిషనర్ల సూచనలను పరిగణనలోకి తీసుకున్న తర్వాత తుది ఉత్తర్వులు జారీ చేస్తామని కోర్టు పేర్కొంది.

**సీసీటీవీ ఫుటేజీ పరిశీలన..**

విద్యార్థుల నిరసన ప్రదర్శనలు, పోలీసుల చర్యలకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజీని కమిటీకి సమర్పించాలని సుప్రీంకోర్టు తెలిపింది. ఢిల్లీతో పాటు ఇతర ప్రాంతాల్లో జరిగిన నిరసనల సందర్భంగా మహిళా నిరసనకారులను లక్ష్యంగా చేసుకుని చర్యలు తీసుకున్నారనే ఫిర్యాదులు, ఆరోపణలను కూడా కమిటీ పరిశీలించనుంది.

**విద్యార్థులపై కేసుల వివరాలు ఇవ్వాలి..**

నిరసనల్లో పాల్గొన్న విద్యార్థులపై నమోదైన కేసుల వివరాలను సమర్పించాలని సుప్రీంకోర్టు కేంద్రాన్ని ఆదేశించింది. మూసివేయాల్సిన కేసుల వివరాలను కూడా కోర్టుకు అందించాలని సూచించింది. దీంతో విద్యార్థులపై నమోదైన కేసుల విషయంలో తదుపరి పరిణామాలపై ఉత్కంఠ నెలకొంది.ఇప్పటికే కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతో వివాదం సద్దుమణిగిందని భావించిన సమయంలో సుప్రీంకోర్టు స్వతంత్ర విచారణకు ఆదేశించడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# కేసీఆర్‌ది ఫ్యామిలీ జస్టిస్.. నాది సోషల్ జస్టిస్

**మొదటి పేజీ తరువాయి**

సర్వాయి పాపన్న విగ్రహాన్ని ఏర్పాటు చేసిందని సీఎం తెలిపారు. ఇది బహుజనుల తెలంగాణ అని పేర్కొన్నారు. ఇందిరమ్మ పాలనలో సామాజిక న్యాయం, సమాన అవకాశాలు కల్పిస్తామని స్పష్టం చేశారు.వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని రేవంత్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. 117 సీట్లలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందని అంచనా వేశారు. కాంగ్రెస్ తిరిగి అధికారంలోకి రావాలంటే గౌడ కులస్తుల సహకారం అవసరమని కోరారు.

**మన పిల్లలు రాజ్యాలు ఏలాలంటే చదువు ఒక్కటే మార్గం..**

గత ప్రభుత్వం పేదలకు బర్రెలు, గొర్రెలు ఇచ్చిందని సీఎం రేవంత్ విమర్శించారు. గొర్రెలు, బర్రెలు మనకు ఇచ్చి.. వారి పిల్లలు మాత్రం రాజ్యాలు ఏలాలా అని ప్రశ్నించారు. పేదరికం చదువుకు అడ్డంకిగా మారుతున్నప్పటికీ కులవృత్తులు చేసుకుంటూనే తమ పిల్లలను చదివించాలని పేదలు ప్రయత్నిస్తున్నారని అన్నారు.పిల్లలకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత తనదేనని సీఎం చెప్పారు. ఎల్‌కేజీ నుంచి పీజీ వరకు చదివించే బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని తెలిపారు. పిల్లలు బాగుపడాలంటే చదువు ఒక్కటే పరిష్కారమని స్పష్టం చేశారు. కష్టమైనా, నష్టమైనా పిల్లలను ప్రభుత్వ పాఠశాలలకు పంపించాలని తల్లిదండ్రులకు సూచించారు.

# గీత, చేనేత కార్మికులందరికీ కొత్త పింఛన్లు

- అర్హులైన గీత, చేనేత కార్మికులకు సంతృప్త స్థాయిలో పింఛన్లు
- గౌడలకు 50 వేల కాటమయ్య కిట్ల పంపిణీ
- ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.5 లక్షల పరిహారం
- ట్యాంక్‌బండ్‌పై సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహం ఆవిష్కరణ



**ప్రజా వాయిస్, హైదరాబాద్:** తెలంగాణలో అర్హులైన గీత, చేనేత కార్మికులందరికీ సంతృప్త స్థాయిలో కొత్త పింఛన్లు మంజూరు చేస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. హైదరాబాద్ ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేసిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహాన్ని సీఎం ఆవిష్కరించారు. గీత కార్మికుల వృత్తిని కాపాడే బాధ్యతను తమ ప్రభుత్వం తీసుకుంటుందని స్పష్టం చేశారు. అర్హులైన నేత, గీత కార్మికులు ఎంతమంది ఉన్నా పింఛన్లు అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.

**గౌడలకు కాటమయ్య కిట్లు..**

గౌడ సోదరులకు ఇప్పటికే 50 వేల కాటమయ్య కిట్లను పంపిణీ చేసినట్లు సీఎం రేవంత్ తెలిపారు. ప్రమాదవశాత్తు గీత కార్మికులు మరణిస్తే వారి కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం అందిస్తున్నామని చెప్పారు. గీత కార్మికుల వృత్తిని కాపాడేందుకు నీటిపారుదల ప్రాజెక్టుల కాలువల గట్లపై ఈత, తాటి చెట్లను పెంచేలా చర్యలు తీసుకోవాలని నీటిపారుదల శాఖ మంత్రికి సూచించినట్లు వెల్లడించారు.

**సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తి ఆదర్శం..**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ ఒక కులానికి, కుటుంబానికి మాత్రమే చెందిన నాయకుడు కాదని సీఎం రేవంత్ అన్నారు. బహుజనుల నుంచి పుట్టుకొచ్చిన వీరుడిగా ఆయనను అభివర్ణించారు. బహుజనులతో కలిసి పోరాటం చేసి గోల్కొండ కోటపై జెండా ఎగురవేసిన సర్వాయి పాపన్న పోరాట స్ఫూర్తి తెలంగాణ ప్రజలకు ఎప్పటికీ ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు.

**పండుగ సాయన్న జయంతి అధికారికంగా..**

దొరలు, భూస్వాములు, పెత్తందార్లపై పోరాటం చేసిన పండుగ సాయన్న స్ఫూర్తి, పౌరుషం పాలమూరు జిల్లాలో అందరికీ తెలుసని సీఎం రేవంత్ అన్నారు. అక్టోబర్ 22న పండుగ సాయన్న జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందని ప్రకటించారు.

**పిల్లలను చదివించాలి..**

కులవృత్తులను కొనసాగిస్తూనే పిల్లలను మాత్రం తప్పనిసరిగా చదివించాలని సీఎం సూచించారు. పిల్లల భవిష్యత్తును మార్చే శక్తి విద్యలోనే ఉందని అన్నారు. విద్యార్థుల కోసం అవసరమైనన్ని నిధులు కేటాయిస్తామని, నాణ్యమైన విద్యతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తున్నామని చెప్పారు.ప్రభుత్వ పాఠశాలల్లో సన్నబియ్యంతో భోజనం, నాణ్యమైన అల్పాహారం, పాలు, రాగిజావ అందిస్తున్నామని తెలిపారు. పిల్లలను చదివించే బాధ్యత తమ ప్రభుత్వం తీసుకుంటుందని, వారు ఉన్నత స్థానాలకు చేరుకుని తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలని ఆకాంక్షించారు.

**సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం..**

ఏటీసీల్లో చేరే విద్యార్థులకు నెలకు రూ.2 వేల ఉపకార వేతనం అందిస్తున్నామని సీఎం రేవంత్ తెలిపారు. సామాజిక న్యాయం కోసం తమ ప్రభుత్వం పనిచేస్తోందని స్పష్టం చేశారు. రాష్ట్రంలో బీసీ కులగణన చేపట్టడంతో పాటు ఎస్సీ ఉపకులాల వర్గీకరణ కూడా చేశామని పేర్కొన్నారు. ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయం కోసం ప్రభుత్వం నిరంతరం పనిచేస్తోందని సీఎం రేవంత్ రెడ్డి వెల్లడించారు.

# గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్

**ప్రజా వాయిస్, కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఏర్పాటు చేసే గణేష్ మండపాలకు ఉచిత విద్యుత్ అందించనున్నట్లు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ప్రకటించారు. గణేష్ మండపాలకు సంబంధించిన విద్యుత్ బిల్లులను కరీంనగర్ కార్పొరేషన్ భరిస్తుందని తెలిపారు. నగరంలో ఏటా దాదాపు 2 వేల గణేష్ మండపాలను ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. భక్తియుత వాతావరణంలో గణేష్ ఉత్సవాలను నిర్వహించుకోవాలని నిర్వాహకులకు సూచించారు.

**మూడేళ్లుగా సొంత ఖర్చుతో విద్యుత్ బిల్లులు..**

గత మూడేళ్లుగా కరీంనగర్‌లోని గణేష్ మండపాలకు వినియోగిస్తున్న విద్యుత్‌కు సంబంధించిన ఛార్జీలను తానే వ్యక్తిగతంగా చెల్లిస్తున్నట్లు బండి సంజయ్ తెలిపారు. ఇకపై మండపాలకు అయ్యే విద్యుత్ ఖర్చును కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ భరిస్తుందని వెల్లడించారు.

**రూ.22 వేల కోట్లతో అభివృద్ధి పనులు..**

తనను గెలిపించిన కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధికి అహర్నిశలు పనిచేస్తున్నానని బండి సంజయ్ అన్నారు. ఇప్పటి వరకు రూ.22 వేల కోట్ల నిధులను తీసుకొచ్చి అనేక అభివృద్ధి పనులు చేపట్టినట్లు తెలిపారు. ఇందులో రూ.5 వేల కోట్లతో జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టినట్లు వెల్లడించారు. ప్రతి గ్రామానికి రూ.5 లక్షల చొప్పున నిధులు ఇచ్చానని, రాబోయే రోజుల్లో మరిన్ని భారీ నిధులు తీసుకొచ్చి గ్రామాలను అభివృద్ధి చేస్తానని చెప్పారు.

**100 రోజుల్లో రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులు..**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్‌ను బీజేపీకి అప్పగించిన ప్రజల రుణం తీర్చుకునేందుకు 100 రోజుల్లోనే రూ.840 కోట్ల యూసీఎఫ్ నిధులను తీసుకొచ్చినట్లు బండి సంజయ్ తెలిపారు. ఇప్పటికే స్మార్ట్ సిటీ పేరుతో రూ.940 కోట్ల నిధులు తీసుకొచ్చి కరీంనగర్ పట్టణాన్ని అభివృద్ధి చేసినట్లు వివరించారు.

**అభివృద్ధే లక్ష్యం..**

కరీంనగర్ పర్యటనలో భాగంగా 21వ డివిజన్ విద్యానగర్‌లోని శ్రీరాంనగర్ కాలనీలో రూ. కోటి మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు, డ్రెయిన్ నిర్మాణ పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ప్రస్తుతం అభివృద్ధే లక్ష్యంగా రాజకీయాలకు అతీతంగా కార్పొరేటర్లంతా కలిసికట్టుగా పనిచేయాలని బండి సంజయ్ కోరారు. కరీంనగర్ పట్టణాన్ని అభివృద్ధి, ఉత్సవాల నిర్వహణలో తెలుగు రాష్ట్రాల్లోనే అగ్రభాగంలో నిలిపేందుకు శాయశక్తులా కృషి చేస్తానని తెలిపారు.

# ప్రిన్సిపాల్ రూపారెడ్డి హత్య కేసులో సంచలన ట్విస్ట్

**మొదటి పేజీ తరువాయి**

జేబీ కాలనీలో వెలుగుచూసింది. నాగార్జున గ్రామర్ ఇంగ్లిష్ మీడియం పాఠశాల ప్రిన్సిపాల్, డైరెక్టర్‌గా పనిచేస్తున్న రూపారెడ్డి తన నివాసంలో దారుణ హత్యకు గురయ్యారు. ఆమె మృతదేహంపై సుమారు 27 కత్తిపోట్లు ఉన్నట్లు వైద్యులు నిర్ధారించినట్లు అప్పట్లో పోలీసులు వెల్లడించారు. ఇంట్లో నగదు, విలువైన వస్తువులు చోరీకి గురికాకపోవడంతో దొంగతనం కోణం కాదని, మృతురాలికి పరిచయం ఉన్నవారి ప్రమేయం ఉండొచ్చన్న కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు.భర్త రాజేందర్‌రెడ్డి హైదరాబాద్‌లో ఉండగా రూపారెడ్డి కొండమల్లేపల్లికి తిరిగి వచ్చి పాఠశాలకు హాజరయ్యారు. అనంతరం ఇంటికి వెళ్లారు. మరుసటి రోజు ఆమె ఫోన్ స్విచ్‌ఆఫ్ రావడంతో భర్త ఆందోళన చెంది సమీపంలోని వారికి సమాచారం అందించారు. ఇంటి వద్దకు వెళ్లిన వారు స్పందన లేకపోవడంతో పోలీసులకు సమాచారం ఇవ్వగా, పోలీసులు ఇంట్లోకి వెళ్లి రూపారెడ్డి రక్తపు మడుగులో మృతిచెందినట్లు గుర్తించారు.కేసును సవాల్‌గా తీసుకున్న పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీలు, ఫోన్ కాల్ డేటా, ఇతర ఆధారాలను పరిశీలిస్తూ దర్యాప్తు కొనసాగించారు. తాజాగా ఇద్దరు పదో తరగతి విద్యార్థులపై అనుమానం బలపడటంతో వారిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం.అయితే రూపారెడ్డిని హత్య చేయడానికి



అసలు కారణం ఏమిటివిద్యార్థులకు ఆమెతో ఉన్న సంబంధం ఏమిటి? హత్యకు ముందే పథకం రచించారా? మరెవరైనా ఈ ఘటన వెనుక ఉన్నారా? అనే అంశాలపై పోలీసులు లోతుగా విచారణ చేస్తున్నారు. నిందితుల విచారణ పూర్తయిన తర్వాతే హత్యకు దారితీసిన అసలు కారణాలు, హత్యకు ఉపయోగించిన ఆయుధం, ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు అధికారికంగా వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.ప్రిన్సిపాల్ హత్య కేసులో విద్యార్థుల ప్రమేయం ఉన్నట్లు వస్తున్న సమాచారం కొండమల్లేపల్లిలో తీవ్ర కలకలం రేపుతోంది. పోలీసుల అధికారిక ప్రకటనతో కేసులో మరిన్ని సంచలన విషయాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది.

# 22ఏ భూములపై సీఎం రేవంత్ కీలక ఆదేశాలు

22ఏ జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని సీఎం సూచించారు. నిషేధిత జాబితాలో ఉన్న ప్రతి భూమికి సంబంధించిన రికార్డులు, భూమి స్వభావం, యాజమాన్య హక్కులు, రెవెన్యూ రికార్డులను సమగ్రంగా పరిశీలించి వాస్తవాలను నిర్ధారించాలని ఆదేశించారు. కేవలం తాత్కాలికంగా సమస్యను పరిష్కరించడం కాకుండా 22ఏ భూముల వ్యవహారానికి శాశ్వత పరిష్కారం చూపాలని స్పష్టం చేశారు.

**దళారులను నమ్మొద్దు..**

భూముల రిజిస్ట్రేషన్ సమస్యలను పరిష్కరిస్తామని చెప్పే దళారులు, మధ్యవర్తులను నమ్మి డబ్బులు చెల్లించవద్దని సీఎం రేవంత్ ప్రజలకు సూచించారు. ప్రభుత్వ అధికారిక వ్యవస్థ ద్వారానే భూ సమస్యలను పరిష్కరించుకోవాలని కోరారు. 22ఏ భూముల విషయంలో సోషల్ మీడియా, ఇతర మాధ్యమాల్లో వస్తున్న వదంతులను నమ్మవద్దని సూచించారు.

**ఆస్తి హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉంది..**

నిజమైన ప్రైవేటు భూములకు ఎలాంటి అన్యాయం జరగకుండా చర్యలు తీసుకుంటామని సీఎం రేవంత్ రెడ్డి భరోసా ఇచ్చారు. భూ యజమానుల ఆస్తి హక్కులను పరిరక్షించేందుకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 22ఏ జాబితాలోని భూములపై భూ యజమానులు, రియల్ ఎస్టేట్ వర్గాల్లో ఆందోళనలు వ్యక్తమవుతున్న నేపథ్యంలో సీఎం నిర్వహించిన సమీక్షకు ప్రాధాన్యత ఏర్పడింది.

# పేదల కోసం 'భూలక్ష్మి' పథకం..

**మొదటి పేజీ తరువాయి**

వేస్తోందని ఆరోపించారు. పేదల భూములను పరిశ్రమల పేరుతో లాక్కుంటే చూస్తూ ఊరుకోబోమని, వారి కోసం తమ పార్టీ పోరాడుతుందని స్పష్టం చేశారు.

**'సామాజిక న్యాయం' మాటల్లోనే..**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సామాజిక న్యాయం గురించి మాట్లాడటం తమ ఒత్తిడి వల్లే ప్రారంభించారని కవిత అన్నారు. తమ 'సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ' తర్వాత ముఖ్యమంత్రి సామాజిక న్యాయం గురించి మాట్లాడాల్సిన పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. అయితే ముఖ్యమంత్రి చేస్తున్నది సామాజిక న్యాయం కాదని, సామాజిక అన్యాయమని విమర్శించారు.మంత్రివర్గంలో బీసీలకు తగిన ప్రాతినిధ్యం లేదని కవిత ఆరోపించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన వారికి అధిక ప్రాతినిధ్యం కల్పించకుండా సామాజిక న్యాయం గురించి మాట్లాడటం ఎలా సాధ్యమని ప్రశ్నించారు. తెలంగాణ ఉద్యమకారిణి విజయశాంతికి ఎమ్మెల్సీ పదవి ఇచ్చి పరిమితం చేశారని, ఆమెకు మంత్రి పదవి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు.

**పదవుల కేటాయింపులోనూ వివక్ష..**

ప్రభుత్వం ఇటీవల నియమించిన సలహాదారు పదవుల విషయంలోనూ వ్యత్యాసం కనిపిస్తోందని కవిత విమర్శించారు. వి.హెచ్.కు తక్కువ జీతం, తక్కువ హోదా ఇచ్చి.. శివధర్ రెడ్డికి అధిక వేతనం, హోదా కల్పించడంపై సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.సమాచార హక్కు కమిషనర్ల నియామకంలోనూ బీసీలకు ప్రాతినిధ్యం కల్పించలేదని ఆరోపించారు. చిత్రపురి కాలనీ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయడం లేదని విమర్శించారు. అన్ని వైపులా అగ్రవర్ణాలకు చెందిన వారికే పదవులు దక్కుతున్నాయని ఆరోపించారు.

**మాటల్లో కాదు.. చేతల్లో చూపాలి..**

ముఖ్యమంత్రి సామాజిక న్యాయం అంటున్నారని, కానీ ఆచరణలో మాత్రం అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారని కవిత ఎద్దేవా చేశారు. 'మేక వన్నె పులి' మాదిరిగా సామాజిక న్యాయం గురించి మాట్లాడుతున్నారని విమర్శించారు. అడవిలో బలమైన జంతువుదే రాజ్యమని, సమాజం మాత్రం అలా ఉండకూడదని అన్నారు.సామాజిక న్యాయం కేవలం మాటల్లో కాకుండా చేతల్లో కనిపించాలని కవిత స్పష్టం చేశారు. పేదలు, బడుగు, బలహీన వర్గాలకు భూమి, రాజకీయ అధికారంతో పాటు సమాన అవకాశాలు కల్పించినప్పుడే నిజమైన సామాజిక తెలంగాణ సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

# రూ.20 వేల లంచం తీసుకుంటూ జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ అరెస్ట్

- భవన నిర్మాణ అనుమతి కోసం లంచం డిమాండ్ చేసిన ప్రభావతి
- రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్న ఏసీబీ సిటీ రేంజ్ అధికారులు
- లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్న అధికారులు
- నాంపల్లి ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరు.. న్యాయ రిమాండ్

**ప్రజా వాయిస్, హైదరాబాద్:** హైదరాబాద్ నగరంలో మరో అవినీతి చేప ఏసీబీకి చిక్కింది. సంతోష్‌నగర్ సర్కిల్–25కు చెందిన జీహెచ్ఎంసీ టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్ సీహెచ్ ప్రభావతి రూ.20 వేల లంచం తీసుకుంటుండగా ఏసీబీ సిటీ రేంజ్–1 అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. భవన నిర్మాణ అనుమతి ఫైల్‌ను ప్రాసెస్ చేసి, బిల్డింగ్ పర్మిట్ ఆర్డర్, వర్క్ కమెన్స్‌మెంట్ లెటర్ జారీ చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీ అధికారులు తెలిపారు.

**భవన నిర్మాణ అనుమతికి లంచం డిమాండ్**

భవన నిర్మాణ అనుమతి కోసం ఓ వ్యక్తి ఇటీవల దరఖాస్తు చేసుకున్నాడు. సంబంధిత ఫైల్‌ను ప్రాసెస్ చేసి భవన నిర్మాణ అనుమతి ఉత్తర్వులతో పాటు పని ప్రారంభ లెటర్ జారీ చేయాల్సిన బాధ్యత టౌన్ ప్లానింగ్ విభాగానికి ఉంది. అయితే ఈ ప్రక్రియను పూర్తి చేసేందుకు ప్రభావతి సదరు వ్యక్తి నుంచి రూ.20 వేలు లంచం డిమాండ్ చేసినట్లు ఏసీబీకి ఫిర్యాదు అందింది.

**పక్కా స్కెచ్‌తో రెడ్‌హ్యాండెడ్‌గా..**

ఫిర్యాదు అందుకున్న ఏసీబీ అధికారులు పక్కా ప్రణాళికతో వల పన్నారు. భవన నిర్మాణ అనుమతి కోసం వచ్చిన వ్యక్తి నుంచి ప్రభావతి రూ.20 వేల లంచం తీసుకుంటుండగా అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఆమె వద్ద ఉన్న లంచం సొమ్మును స్వాధీనం చేసుకున్నారు.

**నాంపల్లి ఏసీబీ కోర్టులో హాజరు..**

అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు ప్రభావతిని నాంపల్లిలోని ఏసీబీ కేసుల అదనపు ప్రత్యేక న్యాయమూర్తి ఎదుట హాజరుపరిచారు. అనంతరం ఆమెను జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు.



# కంటి చూపును కాపాడుకోవాలి

- PACS చైర్మన్ అనంతరావు కులకర్ణి
- 200 మందికి కంటి ఆపరేషన్లు అవసరం
- ప్రముఖ కంటి వైద్య నిపుణులు డాక్టర్ రవీందర్ గౌడ్

**ప్రజా వాయిస్ సంగారెడ్డి :** కంటి చూపును ప్రతి ఒక్కరు కాపాడుకోవాలన్నది తమ ఉద్దేశమని పుల్కల్ సహకార సంఘం చైర్మన్ అనంతరావు కులకర్ణి అన్నారు.పుల్కల్ మండల కేంద్రంలోని సహకార సంఘం భవనం వద్ద మంగళవారం లయన్స్ క్లబ్ జోగిపేట, సంగారెడ్డి – ఆదర్శ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్, సరోజిని దేవి కంటి ఆసుపత్రి వైద్యులు డాక్టర్. రవీందర్ గౌడ్ మాట్లాడుతూ గతంలో కూడా పుల్కల్ మండలంలో పలుమార్లు ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహించామన్నారు. దీని ద్వారా చాలామంది వృద్ధులు ఆపరేషన్ చేయించుకుని ప్రపంచాన్ని చూడగలుగుతున్నారని ఆనందం వ్యక్తం చేశారు. పరీక్షల్లో అవసరమైన వారికి ఆపరేషన్లు ఉచితంగానే చేయిస్తామన్నారు. అవసరమైన వారికి అద్దాలను కూడా ఉచితంగానే పంపిణీ చేయడం జరిగిందన్నారు. ఈ శిబిరానికి గ్రామం మరియు చుట్టుపక్కల గ్రామాల నుండి సుమారు 200 మంది హాజరై కంటి పరీక్షలు చేయించుకున్నారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్.రవీందర్ గౌడ్ పరీక్షల్లో 20 మందిని కంటి ఆపరేషన్లకు గుర్తించారు. వారిని గురువారం ఉదయం 8 గంటలకు బోధన్ లయన్స్ ఐ హాస్పిటల్ కు తీసుకువెళ్లి, ఆపరేషన్ అనంతరం తిరిగి పుల్కల్ లో దింపడం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు ఈ ఉచిత కంటి వైద్య సేవలను సద్వినియోగం చేసుకున్నారని లయన్స్ క్లబ్ సభ్యులు అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ లావణ్య కృష్ణారెడ్డి, లయన్స్ క్లబ్ ప్రోగ్రాం చైర్మన్ రామప్ప, ప్రెసిడెంట్ విజయేందర్ రెడ్డి, సెక్రటరీ రాములు గౌడ్, ట్రెజరర్ అనంతరం, వెంకటేశం, హనుమంత్ గౌడ్, శ్రీనివాస్ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



# ఉద్యోగాలు భర్తీ చేయకపోతే ప్రభుత్వాలకు పతనం తప్పదు!

- రూ.11 వేల కోట్ల ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలను విడుదల చేయాలి
- ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వకుంటే ఉద్యమం తప్పదు: ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్

**ప్రజా వాయిస్ ఖమ్మం:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరుద్యోగ యువతకు ఇచ్చిన హామీలను అమలు చేసి, ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని ఆల్ ఇండియా యూత్ ఫెడరేషన్ (ఏఐవైఎఫ్) ఖమ్మం జిల్లా సహాయ కార్యదర్శి మల్లెబోయిన ఉపేందర్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రభుత్వాలకు పతనం తప్పదని హెచ్చరించారు. నేలకొండపల్లి మండల కేంద్రంలోని కర్నాటి కృష్ణయ్య భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రంలో ఏటా 2 కోట్ల ఉద్యోగాలు, రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం 2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి యువతను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. విద్యార్థులకు సంబంధించిన సుమారు రూ.11 వేల కోట్ల స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని కోరారు. ఆగస్టు 21న (శుక్రవారం) చింతకాని మండలం కోదుమూరు గ్రామంలో నిర్వహించనున్న ఏఐవైఎఫ్ ఖమ్మం జిల్లా 25వ మహాసభలను నిరుద్యోగులు, విద్యార్థులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో నాయకులు పాలపాటి అశోక్, బాలిన కృష్ణంరాజు, మూడు శ్రీనివాస్, పాలపాటి నవీన్, కొమ్ము అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై పశువులు వదిలితే కఠిన చర్యలు!

- ప్రమాదాల నివారణకు మున్సిపల్, పోలీసు అధికారుల సంయుక్త హెచ్చరిక
- ప్రధాన రహదారులపై అవాంఛిత పార్కింగ్, చిరు వ్యాపారాలపై నిషేధం

**ప్రజా వాయిస్/రామకృష్ణాపూర్** మంచిర్యాల జిల్లా కేంద్రంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ మరియు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. పట్టణంలోని గద్దె రాగడి సమీపంలోని అమ్మ గార్డెన్స్ కమాన్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్, మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి సంయుక్తంగా కీలక ఆదేశాలు జారీ చేశారు.రాష్ట్ర, జాతీయ రహదారులు అలాగే ముఖ్యమైన రోడ్లపై ఆవులు, గేదెలు, మూగపశువులు సంచరిస్తే ఉపేక్షించేది లేదు. యజమానులు వెంటనే తమ పశువులను ఇళ్లలోనే కట్టివేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే సీరియస్ చర్యలు తప్పవు.రోడ్లపై పశువుల సంచారం వల్ల అకారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎన్నో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రధాన రహదారులపై బైకులు, కార్లు మరియు ఇతర వాహనాలను ఎట్టి పరిస్థితులలోనూ పార్క్ చేయడానికి వీల్లేదు. నిబంధనలు మీరితే మున్సిపల్ మరియు పోలీసు చట్టాల ప్రకారం భారీ జరిమానాలతో పాటు కేసులు నమోదు చేయబడతాయి.రోడ్లపై ఎలాంటి చిరు దుకాణాలు పెట్టరాదు. అలాగే, దుకాణాల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు.నిర్లక్ష్యం వహించి నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని, పట్టణ ప్రజలు మరియు వ్యాపారులు అధికారులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# బీమా ఉందంటే..బిల్లు బాదుడేనా..?

- రోగాన్ని బట్టి కాదు బీమా పరిమితిని బట్టి వైద్యం.?
- కార్పొరేట్ ఆసుపత్రులకు ఇన్సూరెన్స్ కార్డులే ఏటీఎంలా మారాయన్న విమర్శలు
- అవసరం లేని పరీక్షలు.. అదనపు చికిత్సలతో బిల్లుల బాదుడు
- 'సేవ' ముసుగులో 'వ్యాపారం'.. వైద్య రంగంపై పెరుగుతున్న ఆందోళన

**ప్రజా వాయిస్, హుజూర్‌నగర్:** రోగి జేబును చూసే వైద్యమా.. రోగాన్ని చూసే వైద్యమా బీమా కార్డు చేతిలో ఉంటే చికిత్సకు హద్దులు ఉండవా ఇన్సూరెన్స్ కవరేజీ ఎంత ఉంటే.. అంత మేరకు వైద్య ఖర్చులు పెంచేస్తారా? సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఓ వ్యంగ్యచిత్రం ఈ ప్రశ్నలనే సంధిస్తోంది. చిత్రం కల్పిత వ్యంగ్యమే అయినా.. వైద్య రంగంలో పెరుగుతున్న వాణిజ్య ధోరణులపై సమాజంలో నెలకొన్న ఆందోళనకు అద్దం పడుతోంది.చిన్న గాయానికి సాధారణ చికిత్సతో సరిపెట్టాల్సిన పరిస్థితిలోనూ.. కార్పొరేట్ వైద్య వ్యవస్థలో వరుస పరీక్షలు, ఖరీదైన స్కానింగ్‌లు, అదనపు వైద్య విధానాలు, ఐసీయూ సేవల వరకు సూచిస్తున్నారన్న ఆరోపణలు తరచూ వినిపిస్తున్నాయి. ముఖ్యంగా రోగికి ఆరోగ్య బీమా ఉందని తెలిసిన తర్వాత చికిత్స వ్యయం పెరుగుతోందన్న ఫిర్యాదులు కూడా ఉన్నాయి.

**కార్డు ఉందని.. ఖర్చు పెంచేస్తారా.?**

అవసరమున్న పరీక్ష చేయడం వేరు.. బిల్లు పెంచేందుకు పరీక్షలు చేయడం వేరు. రోగికి ఏ చికిత్స అవసరం ఎంత ఖర్చవుతుంది




ప్రత్యామ్నాయ మార్గాలేమిటి అనే విషయాలను ముందుగానే స్పష్టంగా వివరించాల్సిన బాధ్యత ఆసుపత్రులపై ఉంది. అయితే కొన్ని చోట్ల రోగి బీమా కవరేజీని బట్టి చికిత్స ప్యాకేజీలు, పరీక్షలు, సేవలు పెంచుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.

**ఇన్సూరెన్స్.. రక్షణ కవచమా.? ఆదాయ వనరా.?**

ఆరోగ్య బీమా అసలు ఉద్దేశం అనారోగ్య సమయంలో కుటుంబంపై పడే ఆర్థిక భారాన్ని తగ్గించడం. కానీ బీమా సొమ్ము అందుబాటులో ఉందనే కారణంతో అవసరానికి మించి వైద్యం అందిస్తే.. అదే బీమా రోగికి రక్షణగా కాకుండా ఆసుపత్రికి ఆదాయ వనరుగా మారే ప్రమాదం ఉంది. దీంతో 'వైద్యం సేవ' అనే భావన క్రమంగా 'వైద్యం వ్యాపారం'గా మారుతోందన్న ఆందోళన వ్యక్తమవుతోంది.

**బిల్లు పెరిగే కొద్దీ.. బంధువుల్లో భయం**

ఆసుపత్రిలో చేరిన తర్వాత రోజుకో పరీక్ష.. కొత్తగా మరో ప్రక్రియ.. అదనపు వైద్య సేవ అంటూ బిల్లు పెరుగుతుంటే రోగి బంధువులు ఏం జరుగుతుందో అర్థం చేసుకోలేని పరిస్థితి. వైద్య పరిజ్ఞానం లేని సాధారణ కుటుంబాలు వైద్యుల నిర్ణయాలపై ఆధారపడాల్సి వస్తుంది. ఇలాంటి సమయంలో చికిత్స అవసరమా ఖర్చు తప్పనిసరిదా అనే ప్రశ్నలు అడిగే అవకాశం, సమయం కూడా లేకుండా పోతుంది.

**పారదర్శకతే పరిష్కారం**

రోగి ఆరోగ్యమే వైద్యానికి కేంద్రబిందువుగా ఉండాలి. బీమా ఎంత ఉందన్నది కాదు.. రోగానికి ఏ చికిత్స అవసరమన్నదే ప్రామాణికం కావాలి. అవసరమైన పరీక్షలు, చికిత్స విధానం, అంచనా వ్యయం, బీమా పరిధిలోకి వచ్చే అంశాలను ముందుగానే రోగికి, బంధువులకు వివరించేలా పారదర్శక విధానం ఉండాలన్న డిమాండ్ పెరుగుతోంది.వైరల్ అవుతున్న వ్యంగ్యచిత్రం ప్రతి ఆసుపత్రి వైద్య విధానానికి కొలమానం కాదు. వైద్యులు, ఆసుపత్రులందరినీ ఒకే గాటన కట్టలేం. కానీ ఇన్సూరెన్స్ ఉంది కదా.. ఖర్చు చేయొచ్చు అనే ధోరణి ఎక్కడైనా చోటుచేసుకుంటే మాత్రం అది వైద్య వృత్తి విశ్వసనీయతకే మచ్చ.రోగి ప్రాణానికి ధర ఎంత బీమా కార్డుపై ఉన్న పరిమితికేనా లేక నిజంగా అవసరమైన వైద్యానికేనా ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత వైద్య రంగంతో పాటు నియంత్రణ వ్యవస్థపైనా ఉంది.

# 50 వేల సామర్ధ్య కోళ్ల ఫారంపై గ్రామాల ఆందోళన

- భారీ టిప్పర్ల రాకపోకలతో చింతపల్లి అలుగు బ్రిడ్జి కూలిందని ఆరోపణ
- ఫారం నిర్మాణంపై ఐదారు గ్రామాల అభ్యంతరం
- అనుమతులపై అధికారులను ప్రశ్నిస్తున్న గ్రామస్తులు
- నీటి వనరులు, పంట పొలాలపై ప్రభావంపై రైతుల ఆందోళన
- బ్రిడ్జి పునరుద్ధరణ, సమగ్ర విచారణకు డిమాండ్

**ప్రజా వాయిస్ ప్రత్యేక కథనం, పెద్దవూర.** నాగార్జునసాగర్ నియోజకవర్గం పెద్దవూర మండలంలో 50 వేల కోళ్ల ఫారం ఏర్పాటుపై చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో ఆందోళన వ్యక్తమవుతోంది. ఫారం నిర్మాణానికి ఇసుక, కంకరను భారీ టిప్పర్ల ద్వారా తరలిస్తున్నారని, ఈ క్రమంలో చింతపల్లి అలుగు బ్రిడ్జి దెబ్బతిని కూలిపోయిందని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళల్లోనూ భారీ వాహనాల రాకపోకలు కొనసాగుతున్నాయని, బ్రిడ్జి కూలిపోవడంతో చింతపల్లి, చింతపల్లి తండా, అల్వాల, అల్వాల తండా ప్రాంతాల రైతులు, పశుపోషకులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని చెబుతున్నారు. వ్యవసాయ పొలాలకు ఎరువులు, యూరియా, ఇతర సామగ్రి తరలించడంతో పాటు ట్రాక్టర్లు, పశువుల రాకపోకలకు కూడా ఇబ్బందులు ఏర్పడ్డాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 50 వేల కోళ్ల ఫారం వల్ల భవిష్యత్తులో దుర్వాసన, ఈగలు, కోళ్ల వ్యర్థాలు, మురుగునీటి సమస్యలు తలెత్తే అవకాశం ఉందని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. ఫారం సమీపంలోని సాగునీటి వనరులు, లిఫ్ట్ కెనాల్, పంట పొలాలపై ప్రభావం పడకుండా వ్యర్థాల నిర్వహణకు ఎలాంటి చర్యలు తీసుకున్నారో అధికారులు స్పష్టం చేయాలని కోరుతున్నారు. ఫారం ఏర్పాటుకు అవసరమైన అనుమతులు, ఇసుక–కంకర నిల్వలు, భారీ వాహనాల రవాణాకు సంబంధించిన నిబంధనలపై సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. బ్రిడ్జి కూలిపోవడానికి అసలు కారణాన్ని సాంకేతికంగా నిర్ధారించి, తక్షణమే పునరుద్ధరించాలని, అప్పటివరకు భారీ టిప్పర్ల రాకపోకలను నియంత్రించాలని గ్రామస్తులు కోరుతున్నారు. సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి వాస్తవాలను వెల్లడించకపోతే దశలవారీగా ఆందోళనలు చేపడతామని వారు హెచ్చరిస్తున్నారు.







# ప్రజా వాయిస్ కథనాల దెబ్బకు దిగొచ్చిన యంత్రాంగం

- దుబ్బాకలో బెల్ట్ షాపులపై పోలీసుల ఉక్కుపాదం!

**ప్రజా వాయిస్ దుబ్బాక** దుబ్బాక మున్సిపాలిటీ పరిధిలోని నాలుగో వార్డు దుంపలపల్లిలో అక్రమంగా నిర్వహిస్తున్న బెల్ట్ షాపులపై 'ప్రజా వాయిస్' వరుస కథనాలు ప్రచురించడంతో స్థానిక అధికార యంత్రాంగం కదిలివచ్చింది. పత్రిక కథనాల తీవ్రతను గుర్తించిన పోలీసులు త్వరితగతిన స్పందించి మెరుపు దాడులకు ఉపక్రమించారు.సిద్ది పేట జిల్లా పోలీసు కమిషనర్ రష్మీ పెరుమల్ ఆదేశాల మేరకు దుబ్బాక సీఐ రాజేష్, ఎస్ఐలు కీర్తి రాజు, సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో పోలీసు బృందం సోమవారం రాత్రి దుంపలపల్లిలోని బెల్ట్ షాపులపై ఆకస్మిక దాడి నిర్వహించింది. ఎలాంటి అనుమతులు లేకుండా ఇళ్లలోనే అక్రమంగా మద్యం విక్రయాలు సాగిస్తున్న రెండు కేంద్రాలపై దాడులు చేసి, మొత్తం 10.75 లీటర్ల మద్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.ఈ దాడుల్లో భాగంగా దుంపలపల్లికి చెందిన కోల రాజు ఇంట్లో నిల్వ ఉంచిన 8.25 లీటర్ల మద్యం, అలాగే ఉప్పునూతల రవి ఇంట్లో ఉన్న 2.5 లీటర్ల మద్యం సీసాలను పోలీసులు సీజ్ చేశారు. అనుమతులు లేకుండా అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వీరిద్దరిపై కేసులు నమోదు చేసినట్లు సీఐ రాజేష్ వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులు నిర్వహిస్తే ఎంతటివారైనా ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు.

# ములుగు క్రికెట్‌పై రాజకీయ మచ్చ వేయొద్దు !

- యువత'లో సూర్యకు పెరుగుతున్న ఆదరణను చూసి రాజకీయ విమర్శలు చేయడం సరికాదు
- బాను ప్రసాద్. ములుగు క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు

**.ప్రజా వాయిస్ ములుగు జిల్లా:/** ములుగు ప్రీమియర్ లీగ్ పేరుతో బెట్టింగ్ దందా జరుగుతోందని, మంత్రి సీతక్క కుమారుడు ధనసరి సూర్య దీనికి సహకరిస్తున్నారంటూ బీఆర్ఎస్ నేత వై. సతీష్ రెడ్డి చేసిన ఆరోపణలపై ములుగు క్రికెట్ ప్రీమియర్ లీగ్ నిర్వాహకులు తీవ్రంగా స్పందించారు. ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం రాజకీయ విమర్శ కాదు. ములుగు యువత క్రీడా భవిష్యత్తుపై మచ్చ వేసే ప్రయత్నం అని మండిపడ్డారు. ములుగులో క్రికెట్‌పై ఆసక్తి ఉన్న యువతకు ప్రోత్సాహం అందిస్తూ, క్రీడా మైదానాల అభివృద్ధికి సహకరిస్తున్న ధనసరి సూర్యపై నిరాధార ఆరోపణలు చేయడం తగదని నిర్వాహకులు స్పష్టం చేశారు. ఆదివాసీ బిడ్డగా ములుగు ప్రాంత యువతతో మమేకమై, క్రీడాకారులకు అండగా నిలుస్తున్న సూర్యకు యువతలో లభిస్తున్న ఆదరణను చూసి ఓర్వలేకే రాజకీయ విమర్శలు చేస్తున్నారనే భావన ప్రజల్లో వ్యక్తమవుతోందని వారు పేర్కొన్నారు. సూర్య రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి కావచ్చు, కానీ క్రీడా కార్యక్రమాలకు సహకరించడం, యువతను ప్రోత్సహించడం వంటి అంశాలను రాజకీయ విమర్శలకు ఉపయోగించుకోవడం సరైన పద్ధతి కాదన్నారు. ములుగు యువతకు అవకాశాలు కల్పించేందుకు ఎవరు ముందుకొచ్చినా వారిని ప్రోత్సహించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందన్నారు. "సతీష్ రెడ్డి బెట్టింగ్ జరుగుతోందని ఆరోపణలు చేస్తున్నారు. మీ వద్ద ఆధారాలు ఉంటే వెంటనే ప్రజల ముందు పెట్టండి. అధికారుల ముందు పెట్టండి. మేము కూడా చర్చకు సిద్ధంగా



ఉన్నాం. కానీ ఆధారాలు లేకుండా పదేపదే ఆరోపణలు చేస్తూ ములుగు క్రికెట్‌కు, క్రీడాకారులకు చెడ్డపేరు తీసుకురావాలని ప్రయత్నిస్తే మాత్రం చూస్తు ఊరుకోమని నిర్వాహకులు హెచ్చరించారు. ములుగు ప్రీమియర్ లీగ్ అనేది కేవలం ఒక క్రికెట్ టోర్నమెంట్ కాదని, స్థానిక ప్రతిభను వెలికితీసే వేదిక అని నిర్వాహకులు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల నుంచి వచ్చిన ఎంతోమంది యువ క్రీడాకారులకు తమ ప్రతిభను చాటుకునే అవకాశం లభిస్తోందన్నారు. క్రికెట్‌ను అభివృద్ధి చేయాల్సిన సమయంలో రాజకీయ ఆరోపణలతో క్రీడా వాతావరణాన్ని దెబ్బతీయడం మానుకోవాలని వై. సతీష్ రెడ్డికి సూచించారు. రాజకీయ విమర్శలు చేయాలంటే రాజకీయ అంశాలపై చేయాలని, యువత భవిష్యత్తుతో ముడిపడిన క్రీడలను రాజకీయ వివాదాల్లోకి లాగవద్దని హితవు పలికారు."ములుగు యువత చూస్తుంది ఎవరు క్రీడాకారులకు అండగా నిలుస్తున్నారు, ఎవరు కేవలం ఆరోపణలతో ముందుకు వస్తున్నారు అన్నది యువతకు తెలుసు. క్రీడలను కాపాడేందుకు, క్రీడాకారుల ఆత్మవిశ్వాసాన్ని నిలబెట్టేందుకు మేము ఎప్పుడూ ముందుంటాం, ఆధారాలు లేకుండా ఆరోపణలు చేస్తే ఇకపై ప్రతి ఆరోపణకు ఆధారాలతోనే సమాధానం చెబుతాం" అని ములుగు క్రికెట్ ప్రీమియర్ లీగ్ సభ్యులు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బాను ప్రసాద్, పైడిమల్ల సందీప్, కిరణ్, క్రీడాకారులు, తదితరులు పాల్గొన్నారు.

# డంపింగ్ యార్డ్ తో కరీంనగర్ ప్రజల ఆరోగ్యం తీవ్ర ముప్పులో ఉంది

- కరీంనగర్ నగర ప్రజలకు సమస్యగా మారిన డంప్‌యార్డ్‌ను వెంటనే ఎత్తివేయాలి
- నగరంలో పేరుకుపోతున్న చెత్తతో అస్తవ్యస్తంగా మారిన డంపింగ్ యార్డ్ ను జనావాసాలకు దూరంగా పెట్టాలి
- డంపింగ్ యార్డ్ తరలింపులో రాష్ట్ర ప్రభుత్వం తీవ్రంగా విఫలమైంది
- స్మార్ట్ డంపింగ్ యార్డ్ గా మారుస్తామన్న కేంద్ర మంత్రి బండి సంజయ్ మాటలు బూటకమని తేలి పోయినాయి
- డంపింగ్ యార్డ్ నుండి వస్తున్న కలుషితమైన దుర్వాసనతో చుట్టుపక్కల కాలనీల ప్రజలు రోగుల బారిన పడుతున్నారు
- గుంజపడుగు హరిప్రసాద్ జిల్లా బాధ్యుడు తెలంగాణ రక్షణ సేన




**కరీంనగర్, ప్రజా వాయిస్ :** కరీంనగర్ నగర ప్రజల ఆరోగ్యం, మరియు పర్యావరణ పరిరక్షణను దృష్టిలో పెట్టుకుని బైపాస్ రోడ్డులో ఉన్న డంప్‌యార్డ్‌ను అక్కడి నుండి ఎత్తివేసి నగరానికి దూరంగా తరలించాలని, అక్కడ కూడ శాస్త్రీయ పద్ధతులతో వ్యర్థాల నిర్వహణ చేపట్టాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేశారు. కరీంనగర్ నియోజకవర్గ ఇంచార్జ్ అంకం శివరాణి ఆద్వర్యంలో ప్రజలకు ఇబ్బందికరంగా మారినా డంపింగ్ యార్డ్ బైపాస్ రోడ్డ్ నుండి కరీంనగర్ నగరానికి దూరంగా తరలించాలని డంపింగ్ యార్డ్ వద్ద ధర్నా చేయడం జరిగింది.ఈ సందర్భంగా తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ మాట్లాడుతూ కరీంనగర్ నగరంలో ఉన్న డంప్‌యార్డ్‌లో సంవత్సరాలుగా పేరుకుపోయిన చెత్త కారణంగా దుర్వాసన, పొగ, దుమ్ము మరియు ఇతర పర్యావరణ సమస్యలు ఏర్పడుతున్నాయని. కోతిరాంపూర్, లక్ష్మి నగర్, కట్ట రాంపూర్, కొత్త యాస్వడ, కమాన్ ప్రాంతం, బస్టాండ్, అంబేద్కర్ స్టేడియం ఇలా సగం నగరం అంతా పోగతో దుమ్ముతో కరీంనగర్ ప్రజలు తీవ్రమైన అరోగ్య ఇబ్బందులు పడుతున్నారని గుంజపడుగు హరిప్రసాద్ ఆవేదన వ్యక్తం చేశారు.కరీంనగర్ నగరంలో నివాస ప్రాంతాలకు సమీపంలో పెద్దఎత్తున వ్యర్థాలతో పేరుకుపోవడం ద్వారా ప్రజల జీవన ప్రమాణాలపై తీవ్రమైన ప్రభావం చూపుతుందని.ప్రభుత్వం ఇప్పటికే డంప్‌యార్డ్‌ను తరలించే అంశంపై సాక్షాత్తూ కేంద్ర మంత్రులు మనోహర్ లాల్ కట్టర్, బండి సంజయ్, కరీంనగర్ మేయర్ అందరూ డంపింగ్ యార్డ్ సమస్యను తిర్చుతామని మాట ఇచ్చి తప్పరని వారు అన్నారు. స్మార్ట్ సిటీలో భాగంగా డంపింగ్ యార్డ్ ను స్మార్ట్ డంప్ యార్డ్ గా మారుస్తామని చెప్పిన నగర పాలక సంస్థ పాలకుల మాటలు బూటాకం అని తేలిపోయింది.ప్రభుత్వం కరీంనగర్ ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఇప్పటికైన యుద్ద ప్రాతిపాదికన నగరానికి దూరంగా తరలించి బయోమైనింగ్ ద్వారా చెత్తను పూర్తిగా తొలగించాలనిఅలాగే భవిష్యత్తులో నగరంలో చెత్త పేరుకుపోకుండా తడి, పొడి వ్యర్థాలను వార్డ్ స్థాయిలోనే వేరు చేసి, శాస్త్రీయంగా ప్రాసెసింగ్ చేసే శాశ్వత వ్యవస్థను ఏర్పాటు చేయాలని తెలంగాణ రక్షణ సేన జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ డిమాండ్ చేసినారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మ్యాకల తిరుపతి, జిల్లా అదివాసి విభాగం అధ్యక్షుడు కుతాడి శ్రీనివాస్, బిసి విభాగం జిల్లా అధ్యక్షుడు శ్రీరాముల రమేష్, జిల్లా సీనియర్ రంగరవేణి లక్ష్మణ్, బుడిగె పర్శారం గౌడ్, నూతి చరణ్, బాసవేణి రాజేందర్, యండి రజీ, పుసాల పవన్, కొత్తూరి రఘు, యండి హుస్సేన్, మడిపల్లి వినీత్, అభిరామ్, గర్షకుర్తి విద్యాసాగర్, గుంజపడుగు పవన్, సుత్తాల రాజన్నా, మహిళ విభాగం నాయకురాలు యండి సల్మా, దాసరి అంజలి, దీటి శిరీష రమేష్, కొరిమి పద్మ, కొలిపాక గౌతమి, కాంతాల రోజా రెడ్డి, కుతాడి రజిత, వరుణ్ యదవ్, గడ్డం రవికుమార్, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామపంచాయతీ కార్మికులకు రూ.26 వేల వేతనం చెల్లించాలి

- సిఐటియు మండల కార్యదర్శి మద్దెల అంజయ్య డిమాండ్

**ప్రజా వాయిస్, మిరుదొడ్డి:** గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్యం, వీధుల పరిశుభ్రత, తాగునీటి సరఫరా వంటి అత్యవసర సేవలు అందిస్తున్న కార్మికులకు ప్రతి నెలా రూ.26,000 కనీస వేతనం చెల్లించాలని సిఐటియు మండల కార్యదర్శి మద్దెల అంజయ్య ప్రభుత్వాన్ని తీవ్రంగా డిమాండ్ చేశారు. మిరుదొడ్డిలో గ్రామపంచాయతీ కార్మికులతో నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు.గ్రామాల్లో ప్రజలకు నిరంతరం సేవలందిస్తున్న పంచాయతీ కార్మికుల వేతనాల విషయంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని అంజయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికే పెండింగ్‌లో ఉన్న వేతనాలను వెంటనే విడుదల చేయడంతో పాటు కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు. అలాగే విధి నిర్వహణలో ప్రమాదవశాత్తు కార్మికుడు మరణిస్తే వారి కుటుంబానికి రూ.26 లక్షల నష్టపరిహారం చెల్లించాలని, ఇతర ప్రభుత్వ ఉద్యోగుల తరహాలోనే ప్రతి సంవత్సరం బోనస్ అందించాలని స్పష్టం చేశారు. పని ప్రదేశాల్లో కార్మికులకు అవసరమైన రక్షణ సామాగ్రి, భద్రతా పరికరాలు, కనీస వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మికుల న్యాయమైన హక్కులు సాధించే వరకు సిఐటియు ఆధ్వర్యంలో పోరాటాలు కొనసాగుతాయని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్మికులు సురేష్, ముత్తమ్మ, పరశురాములు తదితరులు పాల్గొన్నారు.



# అర్హులకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు

- మంత్రి జూపల్లి కృష్ణారావు

**ప్రజా వాయిస్ ఆసిఫాబాద్** కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ భవన సమావేశ మందిరంలో 2వ విడత ఇందిరమ్మ ఇండ్ల మంజూరి పత్రాల పంపిణీ, మైనారిటీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమం మంగళవారం జరిగింది. రాష్ట్ర ఆబ్కారీ మద్యనిషేధ, పర్యాటక, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి, జిల్లా ఇన్చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావుతో పాటు శాసనమండలి సభ్యులు దండే విఠల్, జిల్లా కలెక్టర్ కె.హరిత, జిల్లా అదనపు కలెక్టర్లు యువరాజ్ మర్మాట్, ఎం.డేవిడ్, ఆసిఫాబాద్ శాసనసభ్యురాలు కోవ లక్ష్మి , సిర్పూర్ శాసనసభ్యులు పాల్వాయి హరీష్ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కామ్దే అనిల్, మున్సిపల్ చైర్మన్లు ఆకాష్, సహీన్ సుల్తానా, మార్కెట్ కమిటీ చైర్మన్లు మంగ, దేవయ్య పాల్గొన్నారు.అర్హులైన నిరుపేద లబ్ధిదారులకు మాత్రమే ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందిస్తామని జూపల్లి కృష్ణారావు వివరించారు. 2వ విడత ఇందిరమ్మ ఇండ్లు సిర్పూర్, కాగజ్‌నగర్ నియోజకవర్గాలకు సమానంగా కేటాయించామని, గుడిసెలలో నివసిస్తున్న నిరుపేదలకు ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. మైనారిటీ మహిళలకు ఆర్థిక తోడ్పాటు కోసం కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్నామని పేర్కొన్నారు. సిర్పూర్, ఆసిఫాబాద్ నియోజకవర్గాల్లో పర్యాటకరంగ అభివృద్ధికి ఒక్కో నియోజకవర్గానికి 10 కోట్ల రూపాయల చొప్పున నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. లోటు వర్షపాతం నేపథ్యంలో వట్టివాగు ప్రాజెక్టు నుంచి రైతులకు సాగునీరు అందిస్తామని వివరించారు. ఇందిరమ్మ ఇండ్ల ఎంపికలో రాజకీయ ప్రమేయం లేకుండా పారదర్శకత పాటిస్తామని, అనర్హులకు ఇల్లు మంజూరైతే వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకురావాలని సూచించారు.





# గుంతలమయంగా మారిన దామరకుంట బస్ స్టాప్

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు, గ్రామస్థులు
- గుంతలో ఇరుక్కుపోయిన స్కూల్ బస్సు
- అధికారులు స్పందించి మరమ్మత్తులు చేపట్టాలని విజ్ఞప్తి

**ప్రజా వాయిస్ కాటారం** మంథని నియోజకవర్గ పరిధిలోని కాటారం మండలం దామరకుంట బస్ స్టాప్ సమీపంలో రహదారి తీవ్రంగా దెబ్బతిని గుంతలమయంగా మారింది. ప్రధాన రహదారిపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడటంతో ఆ మార్గంలో వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు నిత్యం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం ఉదయం విద్యార్థులతో వెళ్తున్న ఒక స్కూల్ బస్సు రహదారిపై ఉన్న పెద్ద గుంతలో ఇరుక్కుపోయింది. దీంతో బస్సులో ఉన్న పాఠశాల పిల్లలు, వాహనదారులు తీవ్ర అవస్థలు పడ్డారు. సమయానికి పాఠశాలలకు చేరుకోవాల్సిన విద్యార్థులకు తీవ్ర అంతరాయం కలిగింది. రోడ్డుపై ఏర్పడిన గుంతల వల్ల నిత్యం ఏదో ఒక ప్రమాదం జరుగుతూనే ఉందని, రాత్రి వేళల్లో వాహనదారులు మరింత భయాందోళన నడుమ ప్రయాణించాల్సి వస్తోందని స్థానిక గ్రామస్థులు వాపోతున్నారు. పలుమార్లు సమస్యను దృష్టికి తీసుకెళ్లినా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే స్పందించి, రోడ్డుకు మరమ్మత్తులు చేపట్టి ప్రమాదాలను నివారించాలని దామరకుంట గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# స్వర్ణగిరిలో నృత్య ప్రదర్శన అలరించిన చిన్నారి మహోన్నత

**ప్రజా వాయిస్, మిర్యాలగూడ.** మిర్యాలగూడ పట్టణానికి చెందిన సిరిసిరిమువ్వ నాట్యాలయ గురువు కల కొండ రాము ఆధ్వర్యంలో చిన్నారులు ఆదివారం యాదాద్రి భువనగిరి జిల్లాలోని స్వర్ణగిరి శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయంలోని కళా భారతిలో జరిగిన నృత్య ప్రదర్శనలో ప్రతిభ కనభరిచిన మిర్యాలగూడ పట్టణానికి చెందిన రాగిరెడ్డి నవీన్ రెడ్డి సరితల కుమార్తె మహోన్నతకు మెమొంటో ను ఆలయ కమిటీ వారు అందజేశారు. కమిటీ వారి ద్వారా నృత్య ప్రదర్శన చేసిన చిన్నారులు వచ్చిన భక్తులను ఆకర్షించుకున్నారు.



# పాల్వంచ పోలీస్ స్టేషను ఆకస్మికంగా సందర్శించిన జిల్లా ఎస్పీ

- ప్రాపర్టీ, దొంగతనం కేసుల దర్యాప్తును వేగవంతం చేయాలి
- భద్రాద్రి జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపిఎస్

**ప్రజా వాయిస్ పాల్వంచ** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణ పోలీస్ స్టేషన్‌ను మంగళవారం నాడు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్,ఆకస్మికంగా సందర్శించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించిన అనంతరం అధికారులు, సిబ్బందితో స్టేషన్‌లోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన ప్రాపర్టీ కేసులు, దొంగతనం కేసుల వివరాలను అడిగి తెలుసుకొని,పెండింగ్ కేసులను సత్వరమే పరిష్కరించడంతో పాటు దొంగతనాలకు పాల్పడుతున్న నిందితులను గుర్తించి,చోరీకి గురైన ఆస్తి రికవరీ దర్యాప్తును వేగవంతం చేయాలని సూచించారు. ఎన్డీపీఎస్ కేసులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను గుర్తించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాలను వినియోగించే వారిని గుర్తించి వారికి డీ–అడిక్షన్ కేంద్రాల ద్వారా పునరావాసం కల్పించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. స్టేషన్ పరిధిలోని సస్పెక్ట్ షీట్లు, రౌడీ షీట్లను నిరంతరం సమీక్షిస్తూ సంబంధిత వ్యక్తుల కదలికలు, కార్యకలాపాలపై నిఘా కొనసాగించాలని సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.సీసీటీఎన్ఎస్ 2.0 వ్యవస్థను సమర్థవంతంగా వినియోగిస్తూ పోలీసు సేవలను మరింత వేగవంతంగా, పారదర్శకంగా అందించాలని సూచించారు. సీఈఐఆర్ పోర్టల్‌తో పాటు నాట్ గ్రిడ్, గాండీవ వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థలను సమర్థవంతంగా వినియోగించుకోవాలని తెలిపారు. సైబర్ నేరాల ఫిర్యాదులపై వేగంగా స్పందించి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెట్రోలింగ్, బ్లూ కోల్ట్స్ వాహనాలతో నిరంతరం సంచరిస్తూ ప్రజలకు అందుబాటులో ఉండాలని, డయల్–112కు ఫోన్ వచ్చిన వెంటనే సంఘటనా స్థలానికి చేరుకొని బాధితులకు అండగా నిలవాలని సూచించారు.పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న అధికారులు, సిబ్బంది సమస్యలను అడిగి తెలుసుకొని వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాల్వంచ డిఎస్పి ఆర్ సతీష్ కుమార్, సీఐ సతీష్, ఎస్సైలు నాగరాజు, సాయి కిషోర్ రెడ్డి, విజయ మరియు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.





# చట్టాల అమలులో రాజీ పడొద్దు

- సిపి అంబర్ కిశోర్ ఝా

**ప్రజా వాయిస్ గోదావరిఖని** శాంతిభద్రతల పరిరక్షణ, చట్టాల అమలులో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడొద్దని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిశోర్ ఝా అధికారులను ఆదేశించారు. మంగళవారం గోదావరిఖని ఏసీపీ కార్యాలయాన్ని వార్షిక తనిఖీ చేసిన ఆయన, రికార్డులు పరిశీలించి పెండింగ్ కేసుల పురోగతిపై సమీక్ష నిర్వహించారు. రౌడీషీటర్లు, హిస్టరీ షీటర్లపై నిరంతరం ప్రత్యేక నిఘా ఉంచాలి. సివిల్, భూవివాదాల్లో పోలీసులు అనవసరంగా జోక్యం చేసుకోకూడదు.కేసులను నిష్పక్షపాతంగా దర్యాప్తు చేసి బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలి. అంతకుముందు సీపీకి డీసీపీ బి.రామ్ రెడ్డి, ఏసీపీ ఎం.రమేష్ స్వాగతం పలికి గౌరవ వందనం సమర్పించారు. తనిఖీ అనంతరం సీపీ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పలువురు సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.



# గాజుల రామలింగం నివాసంలో బిఆర్ఎస్ నేతల పరామర్శ

- చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

**ప్రజా వాయిస్ సుల్తానాబాద్** పట్టణానికి చెందిన గాజుల రామలింగం ఇటీవల మరణించగా, ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన చిత్రపటానికి బిఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు, రామగుండం నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామలింగం కుటుంబ సభ్యులను పరామర్శించి, తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు ధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో సుల్తానాబాద్ మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ గాజుల రాజమల్లు, బిఆర్ఎస్ పార్టీ ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు మరియు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# నకిలీ ఖోవాపై అధికారుల కొరడా

- అక్రమ రవాణా గుట్టురట్టు.. వ్యక్తి అరెస్ట్
- 174 కిలోల కల్తీ ఆహార పదార్థాలు స్వాధీనం

**ప్రజావాయిస్/వికారాబాద్ జిల్లా బ్యూరో:** నకిలీ ఖోవాపై అధికారులు కొరడా ఝులిపించారు.వికారాబాద్ జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అన్వర్ పాషా టీమ్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడిలో కల్తీ ఖోవాను అక్రమంగా తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు.విశ్వసనీయ సమాచారం మేరకు నిర్వహించిన రైడ్‌లో రాజస్థాన్ రాష్ట్రం నాగౌర్ జిల్లా మక్రానా మండలం ఉంచెరియా గ్రామానికి చెందిన రుపారామ్ (36), ప్రస్తుతం జహీరాబాద్ పట్టణంలోని పాష్తాపూర్ కాలనీలో నివాసం ఉంటున్న వ్యక్తి తన అతను ఆటోలో కల్తీ ఖోవాను అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. అతని వద్ద నుంచి 160 కిలోల కల్తీ ఖోవా, 14 కిలోల కలకన్, మొత్తం 174 కిలోల ఆహార పదార్థాలను, సుమారు రూ.34,800 విలువైనవి స్వాధీనం చేసుకున్నారు.ప్రజల ఆరోగ్యానికి హానికరమైన కల్తీ ఆహార పదార్థాలను తయారు చేయడం, రవాణా చేయడం లేదా విక్రయించడం వంటి చర్యలకు పాల్పడే వారిపై కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ప్రజలు కూడా అనుమానాస్పదంగా కల్తీ ఆహార పదార్థాల రవాణా లేదా విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని టాస్క్ ఫోర్స్ ఇన్స్పెక్టర్ తెలిపారు.స్వాధీనం చేసుకున్న కల్తీ ఆహార పదార్థాలు, ఆటో మరియు నిందితుడిని తదుపరి చట్టపరమైన చర్యల నిమిత్తం తాండూర్ పోలీస్ స్టేషన్‌కు అప్పగించారు.



## డ్రగ్స్ దందాకు చెక్.. జిల్లాలో ఉక్కుపాదం

- మాదకద్రవ్యాల సరఫరా వినియోగాన్ని పూర్తిగా అరికట్టాలి
- సరఫరా ప్రాంతాలపై ప్రత్యేక నిఘా
- పాన్ షాపులు, మెడికల్ షాపుల్లో విస్తృత తనిఖీలు
- ప్రతి పాఠశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ విద్యార్థులపై ప్రత్యేక దృష్టి
- అధికారులంతా సమష్టి బాధ్యతతో పనిచేయాలి
- రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ ..

**ప్రజా వాయిస్, నల్గొండ** నల్గొండ జిల్లాలో మాదకద్రవ్యాల సరఫరా, వినియోగానికి పూర్తిగా అడ్డుకట్ట వేయాలని రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ అధికారులను ఆదేశించారు. డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి శాఖ తన పరిధిలో ప్రత్యేక బాధ్యత తీసుకుని పనిచేయాలని స్పష్టం చేశారు. మాదకద్రవ్యాల సరఫరా జరిగే ప్రాంతాలపై నిరంతరం నిఘా పెట్టి, తరచూ తనిఖీలు నిర్వహించాలని సూచించారు.నషా ముక్త్ భారత్ అభియాన్, డ్రగ్ ఫ్రీ ఇండియా క్యాంపెయిన్‌లో భాగంగా మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో అదనపు కలెక్టర్ మాట్లాడారు.జిల్లాలో డ్రగ్స్ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. యువత, విద్యార్థులను మాదకద్రవ్యాలకు దూరంగా ఉంచేందుకు పాఠశాలలు, కళాశాలలు, మెడికల్ కాలేజీల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రతి పాఠశాలలో యాంటీ డ్రగ్స్ కమిటీ ఏర్పాటు చేసి, ముఖ్యంగా హైస్కూల్ విద్యార్థులకు డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. పాఠశాలల పరిసరాల్లో పాన్ షాపులు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రభుత్వ హాస్టళ్లలో వార్డెన్లు ప్రత్యేక బాధ్యత తీసుకోవాలని, విద్యార్థులకు క్రమం తప్పకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించడంతోపాటు వారి ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనించాలని ఆదేశించారు. డ్రగ్స్ సరఫరా ఎక్కువగా జరిగే ప్రాంతాలను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ అధికారులు కిరాణా దుకాణాలు, పాన్ షాపుల్లో తనిఖీలు నిర్వహించాలని, డ్రగ్స్ నియంత్రణ అధికారులు మెడికల్ షాపులను తనిఖీ చేయాలని చెప్పారు.బహిరంగ ప్రదేశాల్లో పొగతాగకుండా చర్యలు తీసుకోవాలని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం జరిమానాలు విధించాలని ఆదేశించారు. డ్రగ్స్ నిర్మూలనలో నిర్లక్ష్యానికి తావులేకుండా సమన్వయంతో పనిచేసి జిల్లాలో మాదకద్రవ్యాల జాడ లేకుండా చేయాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు..



# రైతులపై రవాణా బాదుడు!




- యూరియా పై అదనపు వసూళ్లు
- బస్తాకు రూ.266.. రవాణా పేరుతో మరో రూ.33.50
- గతంలో ప్రభుత్వమే భరించేదని రైతుల వాదన
- ఇప్పుడు తమపై భారం మోపుతున్నారని ఆవేదన
- వెన్నంపల్లి సింగిల్ విండో తీరుపై విమర్శలు.

**ప్రజా వాయిస్ సైదాపూర్ :**–రైతులకు అందుబాటులో ఉండాల్సిన ఎరువులపై అదనపు భారం పడుతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కరీంనగర్ జిల్లా సైదాపూర్ మండలం వెన్నంపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) లో యూరియా బస్తాకు రవాణా ఛార్జీ పేరుతో అదనంగా వసూలు చేస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. ఒక్క యూరియా బస్తాకు రూ.266 ధరతో పాటు రూ.33.50 రవాణా ఛార్జీ వసూలు చేస్తున్నారని చెబుతున్నారు. గతంలో ఈ రవాణా భారాన్ని ప్రభుత్వమే భరించేదని.. ఇప్పుడు రైతుల నుంచే వసూలు చేస్తున్నారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**- అదనంగా రూ.33.50**

ఎరువుల కోసం సింగిల్ విండోను ఆశ్రయించే రైతులకు యూరియా బస్తా ధరతోపాటు రవాణా ఛార్జీ పేరుతో అదనపు మొత్తం చెల్లించాల్సి వస్తోందని రైతులు అంటున్నారు. రూ.266 విలువైన ఒక్క బస్తాపై రూ.33.50 అదనంగా చెల్లించాల్సి వస్తే.. రైతుకు ఎరువు ధరపై అదనపు భారం పడుతున్నట్టేనని వారు చెబుతున్నారు. సాగు ఖర్చులు ఇప్పటికే పెరిగిపోయిన సమయంలో ఇలా ఒక్కో బస్తాపై అదనపు వసూళ్లు చేయడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**- గతంలో ప్రభుత్వమే..**

గతంలో ఎరువుల రవాణా ఛార్జీలను ప్రభుత్వమే భరించేదని రైతులు పేర్కొంటున్నారు. ప్రస్తుతం ఆ భారాన్ని రైతులపైనే మోపుతున్నారని ఆరోపిస్తున్నారు. ప్రభుత్వం భరించాల్సిన రవాణా వ్యయం రైతుల నుంచి వసూలు చేయడానికి నిబంధనలు ఏమిటి? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. రవాణా ఛార్జీ వసూలుకు సంబంధించి స్పష్టమైన ఆదేశాలు ఉన్నాయా? ఉంటే వాటిని రైతులకు ఎందుకు తెలియజేయడం లేదన్న సందేహాలు వ్యక్తమవుతున్నాయి.

**- ఎరువుల కొరత.. ఆపై అదనపు భారం..**

సీజన్‌లో రైతులకు యూరియా అవసరం ఎక్కువగా ఉంటుంది. ఈ సమయంలో ఎరువుల కోసం రైతులు సింగిల్ విండోలను ఆశ్రయిస్తారు. ఇప్పటికే యూరియా కోసం ఇబ్బందులు పడుతున్న రైతులకు అదనంగా రవాణా ఛార్జీ భారం పడితే పరిస్థితి మరింత ఇబ్బందికరంగా మారుతుంది. ఎరువు అందించాల్సిన సహకార సంఘమే అదనపు వసూళ్లతో రైతులపై భారం మోపుతోందని రైతులు మండిపడుతున్నారు.

**- బస్తాకు రూ.33.50.. లెక్కెంత?**

ఒక్క బస్తాకు రూ.33.50 చొప్పున వసూలు చేస్తే పెద్ద మొత్తంలో ఎరువులు తీసుకునే రైతులపై భారం గణనీయంగా పెరుగుతుంది. పది బస్తాలకు రూ.335, ఇరవై బస్తాలకు రూ.670 అదనంగా చెల్లించాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. సాగు విస్తీర్ణం ఎక్కువగా ఉన్న రైతులు మరింత మొత్తాన్ని భరించాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.'రూ.266కే యూరియా బస్తా' అని చెప్పి.. చేతికి వచ్చేసరికి మరో రూ.33.50 ఎందుకు? అన్నదే రైతుల ప్రశ్న. అదనపు మొత్తానికి సరైన రశీదు, ప్రభుత్వ అనుమతి, నిబంధనల వివరాలు స్పష్టంగా తెలియజేయాలని వారు కోరుతున్నారు.

**రైతు సహకార సంఘమా.. అదనపు భారాల కేంద్రమా?**

ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల ప్రధాన ఉద్దేశం రైతులకు అండగా నిలవడం. ఎరువులు, విత్తనాలు వంటి వ్యవసాయ అవసరాలను అందుబాటులోకి తీసుకురావడమే వాటి లక్ష్యం. అలాంటి సింగిల్ విండోలోనే రైతుల నుంచి అదనపు మొత్తాలు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు రావడం చర్చనీయాంశంగా మారింది.రైతుకు మేలు చేయాల్సిన వ్యవస్థే రైతుపై అదనపు భారం మోపుతోందన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రవాణా ఛార్జీ వసూలుకు ప్రభుత్వ ఉత్తర్వులు ఉంటే వాటిని బహిరంగంగా ప్రదర్శించాలని.. లేకుంటే అదనపు వసూళ్లను నిలిపివేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

**- అధికారులు స్పందించేనా?**

వెన్నంపల్లి సింగిల్ విండోలో యూరియాపై రవాణా ఛార్జీ పేరుతో వసూలు చేస్తున్న రూ.33.50కు సంబంధించి పూర్తి వివరాలను అధికారులు వెల్లడించాల్సిన అవసరం ఉంది. ఈ వసూళ్లకు ఏ నిబంధన ఆధారం? ప్రభుత్వం నుంచి ఏమైనా ఆదేశాలు ఉన్నాయా? రవాణా ఖర్చు వాస్తవంగా ఎంత అవుతోంది? రైతుల నుంచి వసూలు చేస్తున్న మొత్తానికి రశీదులు ఇస్తున్నారా? అనే అంశాలపై సంబంధిత వ్యవసాయ, సహకార శాఖ అధికారులు స్పష్టత ఇవ్వాలని రైతులు కోరుతున్నారు.

**- ఎరువుల ధరలే భారంగా మారుతున్న వేళ..**

రవాణా పేరుతో మరో బాదుడు ఎందుకని రైతులు ప్రశ్నిస్తున్నారు. రైతుల ఆరోపణలపై అధికారులు విచారణ జరిపి వాస్తవాలను వెల్లడించడంతోపాటు, నిబంధనలకు విరుద్ధంగా వసూళ్లు జరుగుతున్నట్లయితే తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## భూమి నాకు ఇప్పించి న్యాయం చేయండి

- హుస్నాబాద్ ఆర్డీవోను వేడుకున్న వృద్ధురాలు
- పెద్ద కుమారుడు, కోడలిపై విలేకరుల ముందు కన్నీటి పర్యంతం

**ప్రజా వాయిస్ హుస్నాబాద్** అక్కన్నపేట మండలం చౌటపల్లి గ్రామానికి చెందిన వృద్ధురాలు జూపల్లి భారతమ్మ తనకు న్యాయం చేయాలంటూ హుస్నాబాద్ ఆర్డీవోను ఆశ్రయించారు. తన భర్త పేరు మీద ఉన్న భూమిని పెద్ద కుమారుడు జూపల్లి రాజేశ్వరరావు అక్రమంగా తన పేరిట పట్టా చేయించుకుని, ఆ తర్వాత తన భార్య జూపల్లి అంజలీదేవి పేరిట విరాసత్ చేయించాడని ఆమె ఆరోపించారు. తనకు ఇద్దరు కుమారులు ఉండగా, చిన్న కుమారుడైన జూపల్లి చంద్రశేఖరరావుకు ఎలాంటి వాటా దక్కకుండా మొత్తం భూమిని పెద్ద కుమారుడే అనుభవిస్తున్నాడని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.

**ఇండస్ట్రియల్ పార్కులో భూమి సేకరణ:**

ఇటీవల ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటులో భాగంగా తమకు చెందిన రెండు ఎకరాల 10 గుంటల భూమిని ప్రభుత్వం సేకరించగా, ఎకరానికి 18 లక్షల రూపాయల చొప్పున భారీగా నష్టపరిహారం అందింది. అయితే ఈ పరిహారాన్ని పూర్తిగా పెద్ద కుమారుడి భార్యే అనుభవిస్తోందని, అందులో తమకు కూడా న్యాయబద్ధమైన వాటా ఉందని బాధితురాలు పేర్కొన్నారు.

**ఆదరిస్తున్న చిన్న కుమారుడు:**

వృద్ధాప్యంలో తన బాగోగులను పెద్ద కుమారుడు ఏమాత్రం పట్టించుకోవడం లేదని, కేవలం చిన్న కుమారుడు చంద్రశేఖరరావు మాత్రమే మానవతా దృక్పథంతో చూసుకుంటున్నాడని ఆమె విలేకరుల ముందు బోరున విలపించారు. ఆస్తి మొత్తం ఒక్కరి చేతిలోనే ఉండిపోవడంతో తాను తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నానని వాపోయారు.



**విచారణ జరిపి పరిహారం ఇప్పించాలి:**

తనకు తెలియకుండా అన్యాయంగా జరిగిన రిజిస్ట్రేషన్‌పై అధికారులు పూర్తిస్థాయి విచారణ జరిపించాలని బాధితురాలు కోరారు. ఆ భూమికి లేదా దానికి సంబంధించిన నష్టపరిహారానికి అర్హమైన వాటాను తనకు గానీ, లేదా తనను ఆదుకుంటున్న చిన్న కుమారుడికి గానీ బదిలీ చేసి న్యాయం చేయాలని ఆమె ఆర్డీవోకు ఇచ్చిన ఫిర్యాదులో విజ్ఞప్తి చేశారు.

## నల్గొండకు మహర్దశ.. రాష్ట్రంలోనే నంబర్ వన్‌గా తీర్చిదిద్దుతా

- సీసీ రోడ్లు డ్రైన్లు సెంట్రల్ లైటింగ్ తాగునీరు పార్కులు
- రూ.23.85 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి



**ప్రజా వాయిస్,నల్గొండ** నల్గొండ పట్టణ రూపురేఖలు మార్చే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. పట్టణంలో మౌలిక వసతులను పూర్తి స్థాయిలో మెరుగుపరిచి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నల్గొండను తెలంగాణలోనే నంబర్ వన్ మున్సిపల్ కార్పొరేషన్‌గా తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.మంగళవారం నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని వివిధ డివిజన్లలో రూ.23.85 కోట్ల వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపనలు, భూమిపూజలు నిర్వహించారు. పట్టణంలో రహదారులు, డ్రైనేజీ, సెంట్రల్ లైటింగ్, తాగునీరు, విద్యుత్, పార్కులు తదితర మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యం ఇస్తామని ఆయన తెలిపారు.3వ డివిజన్‌లో షెడ్యూల్డ్ తెగల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో చేపట్టనున్న పనులకు మంత్రి తొలుత శంకుస్థాపన చేశారు. ఎస్టీ కాలనీ నుంచి శేషమ్మగూడెం మీదుగా అద్దంకి రహదారి వరకు రూ.9.40 కోట్లతో హై లెవల్ బ్రిడ్జి, రహదారి నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ పనులు పూర్తయితే ఆయా ప్రాంతాల ప్రజలకు రాకపోకలు మరింత సులభతరం కానున్నాయి. అనంతరం పానగల్ సమీపంలోని బీఎస్ఎన్ఎల్ కార్యాలయం నుంచి జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయం వరకు సుమారు మూడు కిలోమీటర్ల మేర రూ.14.45 కోట్లతో చేపట్టనున్న వన్‌టైమ్ ఇంప్రూవ్‌మెంట్ రహదారి పనులకు మంత్రి భూమిపూజ చేశారు.నల్గొండ పట్టణాన్ని కేవలం రహదారుల అభివృద్ధికే పరిమితం చేయకుండా, ప్రజల రోజువారీ అవసరాలకు అనుగుణంగా సమగ్ర మౌలిక వసతులతో ఆదర్శ పట్టణంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. పట్టణంలోని ప్రధాన సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ ప్రజలకు మెరుగైన సౌకర్యాలు అందుబాటులోకి తీసుకొస్తామని తెలిపారు.

## ఎల్‌నినో ప్రభావంపై రైతులకు అవగాహన

- వర్షాభావ పరిస్థితుల్లో మెట్ట పంటలకు ప్రాధాన్యత
- నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ఎంపిక స్వల్పకాలిక పంటల సాగుతో నష్టాలను తగ్గించుకోవాలి

**ప్రజా వాయిస్ / తుర్కపల్లి;** యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలం దత్తాయిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలో మంగళవారం ఎల్‌నినో వాతావరణ పరిస్థితులపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వ్యవసాయ విస్తరణ అధికారి ఉమారాణి మాట్లాడుతూ.. ఎల్‌నినో ప్రభావంతో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉన్నందున రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని మెట్ట (వర్షాధార) పంటల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అధిక నీటి అవసరం ఉన్న పంటలకు బదులుగా స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుకూలమైన వర్షాధార పంటలను ఎంపిక చేసుకోవడం ద్వారా పంట నష్టాలను తగ్గించుకోవచ్చని తెలిపారు.వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని స్వల్పకాలిక పంటలైన ఉలవలు, పెసర్లు, మినుములు, నువ్వులు, జొన్నలు, అలాగే కూరగాయల సాగుకు రైతులు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. నీటి వినియోగాన్ని తగ్గించుకుని తక్కువ కాలంలో దిగుబడినిచ్చే పంటలను సాగు చేయడం ద్వారా వర్షాభావ ప్రభావాన్ని కొంతమేర తగ్గించుకోవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో దత్తాయిపల్లి సర్పంచ్ జెర్రిపోతుల కరుణాకర్, ఉపసర్పంచ్ జిట్టా బాలకృష్ణ, గ్రామ కారోబార్ ఎరుకల స్వామిగౌడ్, మల్లేశ్ , రైతులు , తదితరులు పాల్గొన్నారు.



# హామీల అమలులో కేంద్ర ప్రభుత్వం విఫలం

- ప్రభుత్వాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను సీపీఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుంది
- సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల జంగయ్య
- ఆగస్టు 21న భారీ బహిరంగ సభ

**ప్రజావాయిస్/చేవెళ్ల/మొయినాబాద్:** కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక ఉద్యోగ కార్మిక వ్యతిరేక విధానాలను సిపిఐ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని సిపిఐ జాతీయ సమితి సభ్యులు పాలమాకుల గంగయ్య అన్నారు సిపిఐ రంగారెడ్డి జిల్లా ప్రజా చైతన్య యాత్ర నేడు మొయినాబాద్ మండల కేంద్రానికి చేరుకుంది ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు ప్రభుత్వ విధానాల వల్ల తీవ్రంగా నష్టపోతున్నారని ఆర్థిక సామాజిక పరంగా ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో విఫలమైందని ఆయన విమర్శించారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తామని ఇచ్చిన హామీలు అమలు కాలేదని, వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోందని అన్నారు.సీపీఐ ప్రజల పక్షాన నిలబడుతుందని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాడుతుందని ఆయన తెలిపారు. రైతులు, యువత, విద్యార్థులు, కార్మికులు, పేదలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రజా ఉద్యమాలను మరింత విస్తృతం చేస్తామని అన్నారు.సీపీఐ జాతీయ పార్టీ పిలుపులో భాగంగా రంగారెడ్డి జిల్లాలో చేపట్టిన ఐదు రోజుల బస్సు యాత్రలో భాగంగా ప్రజా చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు జంగయ్య తెలిపారు. కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడంతో పాటు, ప్రజల సమస్యలపై అవగాహన కల్పించేందుకు ఈ యాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శివార్ల ప్రాంతాల నుంచి ప్రారంభమైన ఈ యాత్ర జిల్లాలోని



వివిధ మండలాలు, గ్రామాల మీదుగా కొనసాగుతుందని తెలిపారు.సీపీఐ రాష్ట్ర కమిటీ సభ్యులు, జిల్లా కార్యవర్గ సభ్యులు, మండల పార్టీ కార్యదర్శులు, ప్రజాసంఘాల నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని బస్సు యాత్రను విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.మతం, కులం పేరుతో విభజన రాజకీయాలు వద్దన్నారు.

**ఆగస్టు 21న భారీ బహిరంగ సభ**

ఆగస్టు 21న అబ్దుల్లాపూర్ మెట్టు భూపోరాట కేంద్రంలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను విజయవంతం చేయాలని పాలమాకుల జంగయ్య పిలుపునిచ్చారు. జిల్లా వ్యాప్తంగా సీపీఐ శ్రేణులు, ప్రజాసంఘాల నాయకులు, రైతులు, కార్మికులు, కర్షకులు, కూలీలు, విద్యార్థులు, యువత, పార్టీ సానుభూతిపరులు, అభిమానులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి సభను విజయవంతం చేయాలని కోరారు. ప్రజా చైతన్య బస్సు యాత్రలో సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందోజు రవీంద్ర చారి కంట్రోల్ కమిషన్ సభ్యులు పుస్తకాల నర్సింగ్ రావు సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు చేవెళ్ల నియోజకవర్గం ఇన్చార్జి కే రామస్వామి పానుగంటి పర్వతాలు బుద్ధుల జంగయ్య ఓరుగంటి యాదయ్య జిల్లా కార్యవర్గ సభ్యులు ఏం ప్రభు లింగం వడ్ల సత్యనారాయణ ఆర్ యాదగిరి పి శివ కుమార్ శ్రీదేవి దత్తు నాయక్ గార క్రాంతి వంశీ వర్ధన్ రెడ్డి సుధాకర్ హైదరాబాద్ మండల కార్యదర్శి కే శ్రీనివాస్ ఏఐటీయూసీ మండలాధ్యక్షుడు మల్లేష్ కార్యదర్శి సురేష్ తూర్పు నరసింహులు పాండు మోహన్ రెడ్డి అమృత బాలమణి జంగయ్య కిషయ్య కాశీం భాయ్ తదితరులు పాల్గొన్నారు

# ప్రభుత్వ ఆసుపత్రికి గ్రహణం పట్టిందా!?

- ఔట్సోర్సింగ్ సిబ్బందితో ప్రజలకు ఇక్కట్లా?
- శానిటేజీ ఉద్యోగస్తుల ఆధిపత్యం ఎనుక ఎవరి హస్తం ఉన్నట్లు?
- ఆవరణలో మీడియా అనుమతు లేదంటూ ప్రచారం ఎవరు! చేస్తున్నట్లు?
- సీసీ కెమెరాలు లేవు, రోగుల బాధ పట్టించుకోరు?
- ప్రజలకు విషయాలు తెలిసేది ఎట్లా!
- అధికార పార్టీ నాయకుల అండతో విధి నిర్వహణలో కొనసాగుతున్నాయా!
- కర్త క్రియ కర్మ నేనేనంటూ మీడియా ముసుగు వేసుకునేది ఎవరు!?
- గ్రహణం పట్టింది ఆసుపత్రిక ప్రజలకా అంటూ ఆగ్రహం!





**ప్రజా వాయిస్ అశ్వారావుపేట** అదొక ప్రభుత్వ వైద్యశాల నిరుపేదలకు దేవాలయం చిన్న అనారోగ్యమైన పరిగెత్తుకుంటూ వెళ్తే ఆప్యాయంగా పలకరించి వైద్యం అందించే ఆసుపత్రి ఇటువంటి ఆలయంలో సానిటరీ ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తుల వల్ల గ్రహణం పట్టినంత పనైందని భారీ స్థాయిలో ప్రచారం కొనసాగుతుంది. కొందరు మీడియా ముసుగులో ప్రాంగణాల్లో కెమెరాలు అనుమతించబడవని మీడియాకి అనుమతిలేదని చెబుతూనే మీడియా ముసుగులో కొందరు మరికొందరు అధికార పార్టీ నాయకులు అండతో విధినిర్వహణలు కొనసాగిస్తూ కర్త, క్రియ, కర్మ. నేనేనంటూ రాజమేలుతున్న పరిస్థితి కొనసాగుతుందని ప్రచారం లేకపోలేదు. సీసీ కెమెరాలు లేక ఆవరణలో జరుగుతున్న రోగుల ఇబ్బందులు ప్రజలకు తెలియక గ్రహణం అనేది ప్రజలక లేక వైద్యశాలకు అంటూ గ్రామస్తులు సైతం ఆగ్రహిస్తున్న ఘటనలు లేకపోలేదు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట పట్టణంలోని ప్రభుత్వ 30 పడకల వైద్యశాలలో కొందరు ప్రవేట్ శానిటరీ ఉద్యోగస్తుల వల్ల రోగస్థులకు అనక ఇక్కట్లు ఎదురవుతున్నాయని ప్రచారం జోరుగా కొనసాగుతుంది. అంతే కాకుండా మీడియా అనుమతులు లేకపోవడంతో ఆసుపత్రి నందు సిబ్బంది ప్రజల పట్ల చూపుతున్న ప్రవర్తన అనేక ఇబ్బందులు గురవుతున్నాయని వైద్యులు ఒంటి గంట దాటితే ఎవరూ ఉండే పరిస్థితి లేకపోవడం తదుపరి ఒక్కరు ఇద్దరూ స్టాఫ్ నర్సులు ఉండటంతో అత్యవసర కేసులు వచ్చినప్పుడు వెహికల్ ద్వారా జిల్లా వైద్యశాలకు తరలించడం వంటి కార్యక్రమాలు నిత్యం పునర్ధరణ కొనసాగుతుందని ప్రచారం లేకపోలేదు. అంతేకాకుండా సానిటరీ విషయంలో అనేక లోపాలు ఉన్నప్పటికీ వాటిని వెలుగులు తీసేందుకు మీడియా ప్రయత్నిస్తే వెంటనే యుద్ధ ప్రాథమిక చర్యలకు కొందరు ప్రభుత్వ ఉద్యోగస్తులు ప్రయత్నిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం.

### భోజనం వడ్డే విధానంలో మెనూ ఏంటో ఎవరికి తెలియదు.?

రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ప్రభుత్వ వైద్యశాల నందు వ్యాధిగ్రస్తులతో పాటు మరొకరికి ఉచితంగా భోజనాన్ని అందించే పథకాన్ని ప్రవేశపెట్టింది. ఇటువంటి పథకాన్ని సక్రమంగా అమలు చేసేందుకు ఓ మెనూ ఏర్పాటు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం దీనిపై కొందరు పర్యవేక్షక అధికారులను సైతం నియమించటం వారు సమక్షంలోనే వడ్డించడం వంటి కార్యక్రమాలు కొనసాగించాలి! కానీ కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న కొందరు బినామీ దారులు ప్రభుత్వ అధికారులకు ఒక రీతిలో భోజనాలను తయారు చేసే విధానం వ్యాధిగాస్తులకి మరియు తోటి వారికి వేరే విధంగా భోజనం తయారు చేసే వేరు వేరుగా ఆహారాన్ని వండించి మేలు రకం కొందరు ప్రవేట్ మరియు ప్రభుత్వం ఉద్యోగస్తులకు అందించి మెప్పు పొందటంలో మరొక మీడియా ముసుగులో ఉన్న వ్యక్తి పెత్తనం కొనసాగిస్తున్నారని మండలంలో భారీగా ప్రచారం సంచలనం సృష్టిస్తుంది. అంతే కాకుండా వ్యాధిగ్రస్తులు లేకుండానే వచ్చినట్లు నమోదు కార్యక్రమం జరిపించి ఎక్కువ మోతాదులో ప్రజాధనాన్ని దుందుకుంటున్నారని వాదనా లేకపోలేదు అంతేకాకుండా ఇటువంటి దందాకి వైద్యశాల సిబ్బంది సైతం సహకరిస్తున్నారని వారికి కూడా ఎంతో కొంత ముడుపులు చెల్లిస్తూ గత పదేళ్ల నుండి కాంట్రాక్ట్ పద్ధతిని కొనసాగిస్తున్నారని వేరే వారికి కాంట్రా క్ట్ వెళ్లనీయకుండా ఉండేందుకు జిల్లా అధికారులను సైతం మెప్పించి వ్యాధిగాస్తుల నోటు వద్ద కూడును దొంగలిస్తున్నారని భారీగా ప్రచారం లేకపోలేదు!?

### అంతా తామేనంటూ పెత్తనం చెలాయిస్తున్న ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులు!?

ప్రభుత్వ వైద్యశాల నందు శానిటరీ విధానాన్ని ప్రైవేటు వ్యక్తుల ద్వారా నిర్వహించి ప్రజలకు సేవలు అందించే పక్రియ ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఇటువంటి సందర్భంలో కాంట్రాక్టర్లు ఔట్సోర్సింగ్ ఉద్యోగాలను నియమించడంతో స్థానికులు కొందరు మీడియా సోదరులే అట్టి ఉద్యోగానికి ఎంపికయి రాజమేలుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో సానిటరీ విధానాన్ని బయటకు తెలియకుండా ఉండేందుకు సకల సౌకర్యాలను ఏర్పాటు చేసుకొని రాజ్యమేలుతున్నారన్న వాదన సోషల్ మీడియాలో సైతం చెక్కర్లు కొడుతుంది. అంతేకాకుండా వైద్యశాల ప్రాంగణంలోకి అనుమతులు లేవంటూ ఆంక్షలు పెట్టి రోజువారి కార్యక్రమాలను కొనసాగిస్తున్న రోగస్తులు ఇబ్బం దులు పడుతున్న సందర్భాలను సైతం బయటికి రానికుండా జాగ్రత్త పడటంలో మీడియా ముసుగులో ఉన్న వ్యక్తి కీలక పాత్ర వహిస్తున్నట్లు పట్టణంలో గట్టిగానే ప్రచారం వినిపిస్తున్నాయి.

### అధికార పార్టీ అండతో మరికొందరు రాజమేలుతున్నట్లు వాదన!

వైద్యశాల నందు పనిచేస్తున్న ప్రైవేటు వ్యక్తులు కొందరు అధికార పార్టీ ప్రధాన నాయకుడి కార్యక్రమం నిత్యం పాల్గొని ప్రతి కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్న అట్టివారికి ప్రభుత్వ నిబంధనలు వర్తించవని ప్రతిరోజు విధి నిర్వహణ బాయితిగా చేయవలసిన వారు చేయకుండా కేవలం నెలకి పది రోజులు మాత్రమే వచ్చినట్టు రిజిస్టర్లో నమోదు కార్యక్రమాలు జరుపుకొని యదేచ్ఛగా నెలవారి జీతభత్యాలు తీసుకుంటున్నారని ఆరోపణ లేకపోలేదు. ఇటువంటి కార్యక్రమం నెలవారిగా నడుస్తున్న ఏ ఒక్కటి బయటకు వచ్చి ప్రచురించే పరిస్థితి కనిపించదని ఇటువంటి తంతు నిర్ధారణ చేయాలంటే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలి! లేదంటే మీడియా అనుమతి అన్నా ఉండాలి! కొందరు జిల్లా అధికారులు ఇటువంటి పరిస్థితులు ప్రజలకు తెలిస్తే వైద్యశాలపై ఉన్న నమ్మకం పోతుందని భయంతో అధికారులు చేస్తున్న ఆగడాలను కప్పుపుచ్చేందుకు సీసీ కెమెరాలు సైతం ఏర్పాటు చేయకుండా కాలం గడుపుతూ ప్రశ్నిస్తున్న మీడియాపై యుద్ధ ప్రాథమిక చర్యలు చేపట్టేందుకు ఔట్సోర్సింగ్ ఉద్యోగస్తులను ఉసుగొలపడం వీరికి వెన్నతో పెట్టిన విద్యగా మారుతుందని గట్టిగానే పట్టణంలో వినిపిస్తుంది.

### ఆవరణలోని జాడ లేని సీసీ కెమెరాలు!

పేరుకు 30 పడకాల ఆస్పత్రి అయినప్పటికీ ఎంతమంది వైద్యులు విధి నిర్వహణలో కొనసాగిస్తున్నారు. ఔట్సోర్సింగ్ సిబ్బంది ఎంతమంది విధి నిర్వహణలో పాల్గొంటున్నారు. సానిటరీ సిబ్బంది ఎలా పనిచేస్తుంది? వంటి విధానాన్ని జిల్లా యంత్రాంగం ఎప్పటికప్పుడు మూడో నేత్రంతో చూసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకున్నప్పటికీ కొందరు జిల్లా అధికారులు వాటిని ఏర్పాటు చేస్తే డొల్లతనమంతా బయటపడే ప్రమాదం పొంచి ఉందని గ్రహించి వాటిని ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారని అంతేకాకుండా మీడియా సైతం అనుమతించకుండా ఉండేందుకు పక్కా ప్రణాళికలను ఏర్పాటు చేసి వాటి ద్వారా అమలయ్యేందుకు కొందరు ప్రైవేటు వ్యక్తులను అందుబాటులోకి ఉంచారని భారీగా ప్రచారం కొనసాగుతుంది. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ స్పందించి ప్రభుత్వ ఆసుపత్రి నందు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అదే విధంగా మీడియ సందర్శించేందుకు అనుమతి ఇవ్వాలని అశ్వారావుపేట మండల ప్రజలు కోరుకుంటున్నారు.



# ముఖ్యమంత్రి దోపిడీకి మంత్రుల వత్తాసు

- పథకాలను ఎత్తివేసేందుకు కాంగ్రెస్ కుట్రలు
- మంథని ఎమ్మెల్యే 420 హామీలకు సమాధానం చెప్పాలి
- ఆర్డీవో కార్యాలయం ఎదుట బీఆర్ఎస్ భారీ ధర్నా

**ప్రజా వాయిస్ మంథని** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన 420 హామీలను విస్మరించి, సంక్షేమ పథకాలను ఎత్తివేసేందుకు కుట్రలు చేస్తోందని మంథని మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత పుట్ట మధూకర్ మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దోపిడీకి మంత్రులు వత్తాసు పలకడం సిగ్గుచేటని, పథకాలను కొల్లగొడుతున్న సీఎంను కుర్చీ నుంచి దించేందుకు మంత్రులకు చిత్తశుద్ధి ఉండాలని డిమాండ్ చేశారు. కళ్యాణలక్ష్మి, ఇతర పథకాలపై కాంగ్రెస్ కుట్రలకు నిరసనగా కేసీఆర్, కేటీఆర్ పిలుపు మేరకు మంగళవారం మంథనిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించారు. రాజగృహ నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు చేపట్టిన ర్యాలీలో మహిళలు బతుకమ్మ ఆడి నిరసన తెలిపారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పుట్ట మధూకర్ మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం కోర్టుల ద్వారా పథకాలను నిలిపివేస్తూ ప్రజలను కొత్త తరహాలో మోసం చేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం కోర్టుల్లో సరైన కౌంటర్లు వేయకుండా కుట్ర పూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

### కమీషన్ల కోసమే కూల్చివేతలు

స్థానిక ఎమ్మెల్యే దుద్దిళ్ల శ్రీధర్‌బాబు 40 ఏండ్లుగా నియోజకవర్గ ప్రజలను వంచిస్తున్నారని ధ్వజమెత్తారు. కళ్యాణలక్ష్మితో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చి ఏమైందని ప్రశ్నించారు. నియోజకవర్గంలో అభివృద్ధిని పక్కనబెట్టి, కూల్చివేతల ద్వారా వచ్చే కమీషన్ల కోసమే ఎమ్మెల్యే కుటుంబం పనిచేస్తోందని ఆరోపించారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు అక్రమ కేసులు పెడుతున్నారని, ఇలాంటి బెదిరింపులకు బీఆర్ఎస్ భయపడదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల లెక్చరర్ భాస్కర్ పై చర్యలు తీసుకోవాలి సస్పెండ్ చేసి, ఆరోపణలపై సమగ్ర విచారణ జరపాలి

**-విద్యార్థి సంఘాల డిమాండ్** ప్రజా వాయిస్/దేవరకొండ దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు లెక్చరర్‌గా పనిచేస్తున్న భాస్కర్ బాలికల పట్ల అసభ్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు.మంగళవారం బిఆర్ఎస్వీ , ఏబీవీపీ ,ఎస్ఎఫ్ఐ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో దేవరకొండ ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి సంఘాల నాయకులు మాట్లాడుతూ..విద్యార్థినుల భద్రతకు భంగం కలిగించేలా వ్యవహరించారనే ఆరోపణలు ఎదుర్కొంటున్న లెక్చరర్ భాస్కర్‌ను వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు.ఆరోపణలపై సమగ్రంగా విచారణ జరిపి, వాస్తవాలు వెలుగులోకి తీసుకురావాలని, ఆరోపణలు నిజమని తేలితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే భాస్కర్‌పై సంబంధిత పోలీస్ కేసు నమోదు చేసి, విద్యార్థినులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.కళాశాలలో విద్యార్థినులకు సురక్షితమైన వాతావరణం కల్పించాల్సిన బాధ్యత విద్యాశాఖ అధికారులపై ఉందని, ఈ ఘటనపై అధికారులు నిర్లక్ష్యం వహించకుండా వెంటనే స్పందించాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షులు వేముల రాజు, బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ,ఏబీవీపీ నాయకులు గోపీచంద్,ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్షులు బుడిగ వెంకటేష్,ముదిగొండ హరిదాస్ తదితరులు ఉన్నారు.






# యూనియన్ బ్యాంక్ ముందు సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ధర్నా

- 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం అమలు చేయాలని డిమాండ్

**ప్రజా వాయిస్ - మంచిర్యాల** మంగళవారం రోజున మంచిర్యాల జిల్లా లోని రామకృష్ణాపూర్ యూనియన్ బ్యాంక్ కార్యాలయం ఎదుట మంచిర్యాల జిల్లా సింగరేణి విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో సింగరేణి లో విధులు నిర్వహించి పదవి విరమణ చేసిన యూనియన్ బ్యాంక్ లో ఖాతాలు కలిగి ఉన్న 70 సంవత్సరాల లోపు ఉద్యోగులకు 30 లక్షల ప్రమాద బీమా కల్పించనందుకు నిరసనగా నల్ల బ్యాడ్జీలు ధరించి యూనియన్ బ్యాంకు కార్యాలయం ముందు ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య మాట్లాడుతూ 2024 ఫిబ్రవరి 26 వ తేదీన సింగరేణి యాజమాన్యం తో యూనియన్ బ్యాంక్ చేసుకున్న ఒప్పందం మేరకు 30 లక్షల ప్రమాద బీమా అమలు చేయాల్సిన యూనియన్ బ్యాంక్ యాజమాన్యం గత 2 సంవత్సరాల నుండి విశ్రాంత ఉద్యోగులకు 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాల్సి ఉన్నప్పటికీ , యూనియన్ బ్యాంక్ యాజమాన్య నిర్లక్ష్యం వల్ల ఎంతో మంది విశ్రాంత కుటుంబాలు నష్టపోతున్నాయని పేర్కొన్నారు. సింగరేణి యాజమాన్యం తో యూనియన్ బ్యాంక్ యాజమాన్యం చేసుకున్న ఒప్పందం మేరకు సింగరేణి విశ్రాంత ఉద్యోగులకు వెంటనే 30 లక్షల ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేసారు. లేని ఎడల అన్ని యూనియన్ బ్యాంకుల కార్యాలయాల ముందు విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలతో పెద్ద ఎత్తున శాంతియుతంగా ఆందోళన కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఈ సందర్భంగా రామకృష్ణ పూర్ యూనియన్ బ్యాంక్ మేనేజర్ కి వినతి పత్రం అందజేయడం జరిగింది.ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు గజెల్లి వెంకటయ్య, సలహాదారులు ఎం అంజయ్య , ఆర్ రమేష్ , కుమ్మరి తదితరులు పాల్గొన్నారు.

# వెల్జాల్ ప్రభుత్వ పాఠశాలలకు ప్రత్యేక బస్సు

- విద్యార్థుల కోసం ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మార్క్ స్పందన వెంటనే పల్లెల్లోకి బస్సు
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి కి కృతజ్ఞతలు తెలుపుకున్న గ్రామాల ప్రజలు
- ఎన్నో ఏళ్ల కల నెరవేరిందని ఆనందం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు



**ప్రజా వాయిస్/తలకొండపల్లి :** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలం వెల్జాల్ ప్రభుత్వ పాఠశాలలకు వచ్చే విద్యార్థుల సుదీర్ఘ బస్సు రవాణా సౌకర్యం ఎట్టకేలకు పరిష్కారం దక్కింది. స్థానిక కల్వకుర్తి నియోజకవర్గ శాసనసభ్యులు కసిరెడ్డి నారాయణరెడ్డి ప్రత్యేక చొరవతో ఈ రూట్‌లో నూతన బస్సు సర్వీసు ప్రారంభమైంది.వెల్జాల్ ప్రభుత్వ పాఠశాలలకు పరిసర గ్రామాల నుండి వచ్చే విద్యార్థులు ఎదుర్కొంటున్న రవాణా ఇబ్బందులను స్థానిక కాంగ్రెస్ నాయకులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై తక్షణమే స్పందించిన ఎమ్మెల్యే.. కల్వకుర్తి డిపో మేనేజర్ (డీఎం) శాలినితో మాట్లాడి సమస్యను వివరించారు. విద్యార్థుల విద్యాభ్యాసానికి ఇబ్బంది కలగకుండా బస్సు సౌకర్యం కల్పించాలని ఆదేశించారు.ఎమ్మెల్యే ఆదేశాల మేరకు అధికారులు నూతన బస్సు సర్వీసును అందుబాటులోకి తెచ్చారు. ఈ బస్సు ప్రతిరోజు ఉదయం 8:00 గంటలకు మిడ్జిల్ నుండి బయలుదేరి..వాడియల్, వేముల,మసుగుండ్లపల్లి, చెన్నంపల్లి,వెంకటాపూర్, అంతారం గ్రామాల మీదుగా ఉదయం 9:00 గంటలకు వెల్జాల్ చేరుకుంటుంది.సకాలంలో పాఠశాలలకు చేరుకునేలా బస్సు సౌకర్యం కల్పించడంపై వెల్జాల్, పరిసర గ్రామాల ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులు ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.బస్సు ప్రారంభోత్సవ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ వానరాశి రాములమ్మ, ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మి విజయ్ కుమార్,మార్కెట్ కమిటీ డైరెక్టర్ చర్ల వెంకటరెడ్డి, నాయకులు ఏ. అంజయ్య గౌడ్,ఎం.అంబాజీ,పి.అశోక్ బాబు, ముజీబ్ రెహమాన్, బి.నర్సింలు, అజీజ్, ఏ. వెంకట్ రెడ్డి, వి. వెంకటేష్, సిహెచ్.విష్ణువర్ధన్ యాదవ్ పాల్గొన్నారు.ఎండి ఆరిఫ్, టి. కృష్ణయ్య గౌడ్, ఎస్. వి. రాజు, పులిజాల విష్ణు, ఏ. శ్రీనివాస్ గౌడ్, ఏ. శ్రీశైలం గౌడ్, గడ్డం విజయ్ యాదవ్, ఏ. ప్రసాద్ గౌడ్, టి. రాఘవేందర్ గౌడ్, ఎం. మోహన్ లాల్, వి. శాయి, దుబ్బ గణేష్, వార్డు సభ్యులు దూళ్ల శ్రీశైలం,సుభహాన్, లకుమల్ల చెన్నకేశవులు, పి. సుల్తాన్ ఆఫ్తాబ్, కె. యాదగిరి, ప్రైమరీ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లావణ్య, బస్సు డ్రైవర్, కండక్టర్,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పాత నేరస్తులు నేరాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు

- రౌడీషీటర్లకు మిర్యాలగూడ ఇన్చార్జి డీఎస్పీ రవి హెచ్చరిక



**ప్రజా వాయిస్ /నల్గొండ క్రైమ్:** హాలియా పాత నేరస్తులు తిరిగి నేరాలకు పాల్పడితే వారిపై పీడీ యాక్ట్ కింద కేసు నమోదు చేస్తామని మిర్యాలగూడ ఇన్‌చార్జి డీఎస్పీ జి. రవి హెచ్చరించారు. మంగళవారం హాలియా సర్కిల్ కార్యాలయంలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్ల ప్రవర్తన, గతంలో నమోదైన కేసులు, ప్రస్తుతం వారి కార్యకలాపాలపై ఆరా తీశారు. భవిష్యత్తులో ఎలాంటి నేరాలకు పాల్పడకుండా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు. సమాజంలో ప్రశాంత వాతావరణానికి భంగం కలిగించే విధంగా వ్యవహరించవద్దని రౌడీషీటర్లకు సూచించారు. గొడవలకు దిగడం, ఇతరులను బెదిరించడం, దౌర్జన్యాలకు పాల్పడటం, అక్రమ కార్యకలాపాలకు పాల్పడటం వంటి చర్యలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. గతంలో నేరాలకు పాల్పడినప్పటికీ ప్రస్తుతం చట్టబద్ధమైన జీవనం సాగిస్తూ, కుటుంబ సభ్యులతో ప్రశాంతంగా జీవించాలని సూచించారు.రౌడీషీటర్లు ఎవరైనా మళ్లీ నేర కార్యకలాపాలకు పాల్పడినా, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడినా పోలీసులు కఠినంగా వ్యవహరిస్తారని డీఎస్పీ హెచ్చరించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. నేరాలకు దూరంగా ఉండి సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా జీవించాలని సూచించారు.అలాగే అనుమానాస్పద వ్యక్తులతో కలిసి తిరగడం, వివాదాస్పద వ్యవహారాల్లో జోక్యం చేసుకోవడం, యువతను నేరాల వైపు ప్రోత్సహించడం వంటి చర్యలకు దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. చిన్నపాటి గొడవలు కూడా భవిష్యత్తులో పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉన్నందున సంయమనంతో వ్యవహరించాలని తెలిపారు. కుటుంబ సభ్యులు, తల్లిదండ్రులు, పిల్లల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని నేరాలకు పూర్తిగా దూరంగా ఉండాలని సూచించారు.ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా, ఎవరైనా చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు సమాచారం ఉన్నా పోలీసులకు తెలియజేయాలని అధికారులు కోరారు. నేరాల నియంత్రణలో భాగంగా రౌడీషీటర్ల కదలికలు, వారి ప్రవర్తనపై నిరంతరం నిఘా ఉంటుందని పేర్కొన్నారు.నేరాలకు దూరంగా ఉండి సాధారణ జీవితం గడపాలన్నదేనని అధికారులు తెలిపారు. ఇప్పటికే నేరాలకు దూరంగా ఉన్న వారు అదే విధానాన్ని కొనసాగించాలని, మళ్లీ నేర కార్యకలాపాల్లోకి వెళ్లకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. చట్టాన్ని గౌరవిస్తూ జీవించడం ద్వారా కుటుంబంతో పాటు సమాజంలో కూడా గౌరవప్రదమైన స్థానం పొందవచ్చని పోలీసులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో హాలియా,సాగర్ సీఐ లు ఎస్. రాఘవరావు, సీఐ శ్రీను నాయక్, ఎస్ఐలు బండి సాయి ప్రశాంత్, నరేష్, విజయ్‌కుమార్ తదితర పోలీసు అధికారులు పాల్గొన్నారు....

# తొలి తెలంగాణ పోరాట వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్:ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

**ఆయన పోరటస్ఫూర్తితో తెలంగాణ సాధించాం**

**పీడిత వర్గాల పక్షాన నిలిచిన యుద్ధవీరుడు పాపన్న గౌడ్**

**ప్రజా వాయిస్ నాగర్ కర్నూల్ ఆగస్ట్ 18**

నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల్లో లిఎమ్మెల్యే డాక్టర్ కూచుకుళ్ల రాజేష్ రెడ్డి పాల్గొని ఈ సందర్భంగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వీరుడు, ప్రజా నాయకుడు అని కొనియాడారు. సమాజంలో సమానత్వం, ఆత్మగౌరవం కోసం ఆయన చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారుప్రజల హక్కులు, సామాజిక న్యాయం కోసం పాపన్న గౌడ్ చూపిన ధైర్యసాహసాలు చిరస్మరణీయమని, ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఎమ్మెల్యే పేర్కొన్నారు నేటికీ కరీంనగర్ దగ్గర ఆయన పుట్టిన ఊరు పాపన్నపేటలో పెద్ద విగ్రహం, స్మారకం ఉందని. పాపన్నా గోల్కొండ కోట ఎక్కినోడా అనే జానపద గేయాలు ఇప్పటికీ తెలంగాణలో వినిపిస్తాయని. తెలంగాణ ప్రభుత్వం పాపన్న జయంతిని అధికారికంగా జరుపుతుందని.సర్వాయి పాపన్న గౌడ్ కేవలం 22 ఏళ్లకే తన ప్రాణాలు ఇచ్చాడు. కానీ అణచివేతకు వ్యతిరేకంగా పోరాడాలి అనే స్ఫూర్తిని లక్షల మందికి ఇచ్చాడని ఆయన పోరాటమే తర్వాత వచ్చిన రజాకార్ల వ్యతిరేక పోరాటానికి, తెలంగాణ ఉద్యమానికి పునాది అని చాలా మంది చరిత్రకారులు అంటారనినాయన



తెలియాజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు మరియు జిల్లా గౌడ సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు

# ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో బుక్.. కేంద్రంలో నో స్టాక్!

**రంగంపేట మన గ్రోమోర్ వద్ద రైతుల ఆందోళన**

**50 మంది రైతులు.. 200 బస్తాల యూరియా బుకింగ్.. అయినా దక్కని ఎరువు**

**సాంకేతిక లోపాలే కారణమంటున్న అధికారులు..**

**పొంతనలేని సమాధానాలపై రైతుల ఆగ్రహం**









**కొల్చారం, ఆగస్టు 18:**

యూరియా పంపిణీలో అక్రమాలను అరికట్టేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన ఎఫ్ఎఫ్ఎస్ యాప్ రైతులకు కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. యాప్‌లో యూరియా బుక్ చేసుకున్నా.. కొనుగోలు కేంద్రానికి వెళ్లేసరికి స్టాక్ లేదని తెలియడంతో రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రంగంపేటలోని మన గ్రోమోర్ సెంటర్ వద్ద సుమారు 50 మంది రైతులు ఆందోళనకు దిగారు.రంగంపేట, సంగారెడ్డి గ్రామాలకు చెందిన రైతులు సోమవారం ఉదయం 8.30 నుంచి 8.40 గంటల మధ్య ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో సుమారు 200 బస్తాల యూరియాను బుక్ చేసుకున్నారు. బుధవారం యూరియా అందజేస్తామని రైతుల మొబైల్ ఫోన్లకు సందేశాలు రావడంతో వారు నిర్ణీత సమయానికి మన గ్రోమోర్ సెంటర్‌కు చేరుకున్నారు. అయితే అక్కడ యూరియా స్టాక్ లేదని నిర్వాహకులు చెప్పడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**బుక్ చేసిన యూరియా ఏమైంది?**

సుమారు 50 మంది రైతులకు 200 బస్తాల వరకు యూరియా బుక్ అయినట్లు యాప్‌లో చూపించినప్పటికీ కేంద్రంలో స్టాక్ లేకపోవడంపై రైతులు నిర్వాహకులను నిలదీశారు. యూరియా ఎవరికి విక్రయించారని ప్రశ్నిస్తూ వాగ్వాదానికి దిగారు. స్టాక్ లేనప్పుడు యాప్‌లో యూరియా అందుబాటులో ఉన్నట్లు ఎలా చూపిస్తుందని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

**సాంకేతిక లోపమేనంటున్న అధికారులు**

నూతన ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లో సాంకేతిక సమస్యల కారణంగా గత నాలుగైదు రోజులుగా చేగుంట, చిన్న ఘనపూర్, కొంగోడు తదితర ప్రాంతాల్లోనూ ఇలాంటి సమస్యలు తలెత్తాయని వ్యవసాయ అధికారులు రైతులకు వివరించారు. ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివేదిక సమర్పించినట్లు తెలిపారు. అయితే స్టాక్ లేకుండానే యాప్‌లో బుకింగ్ ఎలా సాధ్యమవుతుందో చెప్పాలని రైతులు డిమాండ్ చేశారు.

**పొంతనలేని అధికారుల సమాధానాలు**

ఈ విషయమై కొల్చారం వ్యవసాయ అధికారి శ్వేతాకుమారి, జిల్లా వ్యవసాయ అధికారి దేవ్‌కుమార్‌లను వివరణ కోరగా.. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకున్న రైతులు యూరియా డెలివరీ అయిన తర్వాత యాప్‌లోకి వెళ్లి బుకింగ్‌ను క్యాన్సిల్ చేయడంతో స్టాక్ తిరిగి కనిపిస్తుందని, దీంతో అదనంగా బుకింగ్ అయినట్లు చూపించే అవకాశం ఉందని సమాధానం ఇచ్చారు.అయితే సోమవారం ఉదయం 8.30 నుంచి 8.40 గంటల వరకు కేవలం పది నిమిషాల వ్యవధిలోనే మన గ్రోమోర్ సెంటర్‌కు సంబంధించిన యూరియా బుకింగ్ జరిగినప్పుడు.. ఆ పది నిమిషాల్లోనే రైతు యూరియా కొనుగోలు చేసి, అనంతరం యాప్‌లోకి వెళ్లి బుకింగ్‌ను ఎలా క్యాన్సల్ చేస్తాడని రైతులు ప్రశ్నించారు. దీంతో అధికారుల సమాధానాలపై రైతులు అసంతృప్తి వ్యక్తం చేశారు.

**లోపాలు సరిచేసి.. రైతులకు ఊరట కల్పించాలి**

ఎఫ్ఎఫ్ఎస్ యాప్‌లోని సాంకేతిక లోపాలను తక్షణమే సరిచేయాలని రైతులు కోరుతున్నారు. స్టాక్ వివరాలు, బుకింగ్, కేటాయింపు ప్రక్రియలో పారదర్శకత ఉండేలా చర్యలు తీసుకుని.. రైతులకు సులభంగా యూరియా అందేలా వ్యవస్థను మెరుగుపరచాలని డిమాండ్ చేస్తున్నారు.

# నగల్ గిద్ద మండల సర్వసభ్య సమావేశం

**మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై విద్యుత్, విద్య, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ మౌలిక వసతుల సమస్యలపై అధికారులతో సమీక్షించారు.**

**ఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి**

**సబ్ కలెక్టర్ ఉమా హారతి**

**ప్రజా వాయిస్ నారాయణఖేడ్**

నాగల్‌గిద్ద మండల కేంద్రంలోని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశానికి నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ శ్రీమతి ఉమా హారతి హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మండలంలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలపై అధికారులను, గ్రామ సర్పంచులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ముఖ్యంగా విద్యుత్, విద్య, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం, డ్రైనేజీ తదితర మౌలిక వసతుల సమస్యలపై అధికారులతో సమీక్షించారు.గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే సూచించారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను వెంటనే గుర్తించి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.ప్రభుత్వ సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ చేరేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని, గ్రామాల్లో





అభివృద్ధి పనులను నాణ్యతతో, వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి సూచించారు.అలాగే మండలంలోని విద్యుత్ సమస్యలు, పాఠశాలల్లో మౌలిక వసతులు, తాగునీటి సరఫరా, రోడ్ల అభివృద్ధి తదితర అంశాలపై సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే చర్చించి, ప్రజలకు మెరుగైన సౌకర్యాలు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.ఈ సమావేశంలో మండల అధికారులు,ప్రజాప్రతినిధులు, గ్రామ సర్పంచులు, వివిధ శాఖల అధికారులు,ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# రైతు బీమా కొనసాగించాలి

**రైతు కుటుంబాలకు రక్షణ కవచం**

**ప్రభుత్వం వెంటనే స్పష్టత ఇవ్వాలి**

**ఆర్ ఆర్ ఎస్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు**

**ప్రజా వాయిస్ హన్మకొండ /పరకాల**

రైతు బీమా పథకాన్ని ఎలాంటి అంతరాయం లేకుండా కొనసాగించాలని తెలంగాణ రైతు రక్షణ సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు కోరారు. మంగళవారం పరకాలలో జిల్లా వ్యవసాయ అధికారి విజయ్ చంద్రను కలిసి రైతుల ఆందోళనలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కిషన్ రావు మాట్లాడుతూ రైతు కుటుంబాలకు రైతు బీమా ఎంతో భరోసానిస్తుందని, కుటుంబానికి ఆధారమైన రైతుకు అనుకోకుండా ప్రమాదం జరిగితే బీమా లేకపోవడంతో ఆ కుటుంబం తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి ఉంటుందని తెలిపారు. అర్హులైన రైతులందరికీ బీమా రక్షణ కల్పించాలని, పెండింగ్ క్లెయిమ్‌లను త్వరగా పరిష్కరించాలని కోరారు.రైతు బీమా విషయంలో ప్రభుత్వం తక్షణమే స్పష్టత ఇవ్వాలని కిషన్‌రావు



డిమాండ్ చేశారు. రైతుల సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సానుకూల నిర్ణయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పరకాల ఏడిఏ అభిలాష్ వర్మ నడికూడ జైసింగ్, జిల్లా ఉపాధ్యక్షుడు చౌల రామారావు, నాగూర్ల రాజీరు తదితరులు పాల్గొన్నారు.

# అధైర్యపడొద్దు కుటుంబానికి అండగా ఉంటాం: జిల్లా ఉప సర్పంచ్ ల సంఘం అధ్యక్షుడు వారణాసి శ్రీనివాసులు



**ప్రజావాయిస్ వెల్దండా ఆగస్టు18**

నాగర్ కర్నూల్ జిల్లా వెల్దండ మండలం గుండాల గ్రామానికి చెందిన ఉపసర్పంచ్ కొమ్ము లింగం ఇటీవల బ్రెయిన్ స్ట్రోక్ తో మృతి చెందిన విషయాన్ని తెలుసుకున్న నాగర్ కర్నూల్ జిల్లా ఉప సర్పంచ్ సంఘం అధ్యక్షుడు వారణాసి శ్రీనివాసులు గ్రామానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరమార్శించి కుటుంబానికి అండగా ఉంటామని హామీ ఇచ్చి 20,000 నగదు ఆర్థిక సహాయాన్ని అందించారు అనంతరం ఆయన మాట్లాడుతూ కుటుంబానికి అండగా ఉంటామని అధైర్యపడోదని ధైర్యం చెప్పారు అనంతరం ఉపసర్పంచ్ ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు బొట్ల కార్తిక్ ఫోన్ లో పరామర్శించారని ఉపసర్పంచ్ ల సంఘం సభ్యులు తెలిపారు

# ప్రత్యేక అవగాహన సదస్సులు

**- ఏకేఆర్ స్టడీ సర్కిల్ డైరెక్టర్ బీవీ రమణ**

**- వరంగల్ కు చెందిన నిపుణులు శైలేందర్ రెడ్డి రానున్నట్లు వెల్లడి**




**ప్రజావాయిస్/వికారాబాద్:**

వికారాబాద్‌లోని ఏకేఆర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో కానిస్టేబుల్, ఎస్ఐ, ఎఫ్‌బీఓ అభ్యర్థుల కోసం ఆగస్టు 19, 20 తేదీల్లో ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు డైరెక్టర్ బీవీ రమణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.ఆగస్టు 19, బుధవారం రోజున అర్థమెటిక్, రీజనింగ్ అంశాలపై డైరెక్టర్ బీవీ రమణ ఆధ్వర్యంలో ఆగస్టు 20, గురువారం రోజున పాలిటి అంశంపై వరంగల్‌కు చెందిన నిపుణులు శైలేందర్ రెడ్డి ఆధ్వర్యంలో సదస్సులు నిర్వహించనున్నట్లు తెలిపారు.రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి నిష్ణాతులైన అధ్యాపకులు పాల్గొని ఉదయం నుంచి సాయంత్రం వరకు తరగతులు నిర్వహించడంతో పాటు, తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో 12 ప్రింటెడ్ స్టడీ మెటీరియల్ పుస్తకాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు.మరిన్ని వివరాలకు 9441022571 నంబర్‌ను సంప్రదించాలని డైరెక్టర్ బీవీ రమణ సూచించారు.

# అచ్చంపేటలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మీ-షాదీ ముబారక్ పథకాల పరిరక్షణకు మహా ధర్నాలి



**ప్రజా వాయిస్ ఆగస్టు 18 అచ్చంపేట**

మంగళవారం ఉదయం అచ్చంపేట టౌన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో కల్యాణలక్ష్మీ--షాదీ ముబారక్ పథకాలపై ప్రభుత్వ వైఖరికి నిరసనగా మహా ధర్నా నిర్వహించారు. ఈ పథకాలను నిరంతరాయంగా కొనసాగించాలని కోరుతూ బీఆర్ఎస్ నాయకులు ఆర్డీవో కి వినతిపత్రం అందజేశారు.అచ్చంపేట, బల్మూర్‌తో పాటు పరిసర మండలాల నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు భారీ ఎత్తున అంబేద్కర్ చౌరస్తా వద్దకు చేరుకొని ధర్నాను విజయవంతం చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు శ్రీకాంత్ భీమా, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు పోకల మనోహర్, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్ల నరసింహ గౌడ్, మాజీ చైర్మన్ తులసీరాం, మైనార్టీ నాయకులు అమీన్‌ఉద్దీన్, బల్మూర్ మండల మాజీ ఎంపీపీ కర్ణాకర్ రావు హాజరయ్యారు. వీరితో పాటు అచ్చంపేట టౌన్ మరియు పరిసర మండలాల బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.కల్యాణలక్ష్మీ-షాదీ ముబారక్ పథకాలను యథావిధిగా కొనసాగించి పేద కుటుంబాలకు న్యాయం చేయాలని నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

## నెక్కొండలో బిఆర్ఎస్ పార్టీ నేతలను అరెస్టు చేసిన పోలీసులు

**దివంగత మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహం తొలగింపు పై నిరసనలు చేయకుండా ముందస్తు అరెస్ట్..**

**బిఆర్ఎస్ నాయకుల అక్రమ అరెస్ట్ ఖండించిన ఎమ్మార్పీఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య**




**ప్రజా వాయిస్ వరంగల్ నెక్కొండ;**
నర్సంపేట పట్టణ కేంద్రంలో సోమవారం రాత్రి పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహ తొలగింపు తీవ్ర ఉద్రిక్తత కు దారితీసింది.తెలంగాణ సాధన కర్త మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ వెంట ఉండి అడుగులో అడుగైనటువంటి తెలంగాణ ఉద్యమకారుడు నర్సంపేట నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణం చెందినందున నర్సంపేట మెడికల్ కళాశాల ముందు ప్రైవేట్ స్థలంలో పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.ఐతే సోమవారం విగ్రహాన్ని అర్ధరాత్రి కూల్చివేయడం సిగ్గుచేటు అని ఎమ్మార్పీఎస్ తెలంగాణ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఈదునూరి యాకయ్య అన్నారు. అలాగే మంగళవారం నర్సంపేట శాసనసభ్యులు దొంతి మాధవ రెడ్డి పుట్టినరోజు వేడుకలు జరుపుకొనుటకు బి.అర్ ఎస్. నాయకులను ముందస్తు అరెస్ట్ చేయడం ఎంతవరకు సమంజసం అని, కాంగ్రెస్ పార్టీ నాయకులు టిఆర్ఎస్ పార్టీ నాయకులను అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులు పాల్గొన్నారు.

## ఆర్ ఎక్స్పర్ట్ ఆధ్వర్యంలో ఎల్లమ్మ ఆలయం వద్ద మెగా టెలిమెడిసిన్ ఉచిత వైద్య శిబిరం



**ఆగస్టు 18 (ప్రజా వాయిస్)చేగుంట**
చేగుంట మండల్ కర్నాల్ పల్లి గ్రామ ఎల్లమ్మ గుడి ప్రాంగణంలో ఆర్ఎక్స్ పర్ట్ ఆధ్వర్యంలో డిజిటల్ క్లినిక్స్ మెగా టెలిమెడిసిన్ ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యాన్ని చేరువ చేయాలనే సంకల్పంతో ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో స్థానికులకు ఉచితంగా బీపీ, డయాబెటిస్ (షుగర్) పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు, ఆరోగ్య సలహాలు సూచనలు తెలిపారు, దూరభారం, అధిక వైద్య ఖర్చుల భారం లేకుండా గ్రామంలోనే ఇలాంటి ఉచిత వైద్య సేవలు అందించడంపై స్థానిక మండల ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎక్స్ పర్ట్ వైద్య సిబంది యాదగిరి, రమేష్ గ్రామస్తులు ప్రజలు పాల్గొన్నారు.

## మిరుదొడ్డి యూవతి పీజీ ఎంట్రెన్స్ పరీక్షలో స్టేట్ లెవెల్ 5 ర్యాంక్

**ఎమ్మెస్సీ కంప్యూటర్ సైన్స్ లో సత్తా చాటిన జ్యోతి.**

**పేదరికం చదువుకు అడ్డు కాదు అని నిరూపించిన మిరుదొడ్డి యువతి**






**ప్రజా వాయిస్ మిరుదొడ్డి.**
సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల కేంద్రానికి చెందిన కొండ జ్యోతి సిద్దిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి రాష్ట్రంలో వివిధ యూనివర్సిటీల్లో పీజీ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించిన కామన్ పోస్ట్ గ్రాడ్యుయేషన్ ఎంట్రన్స్ టెస్ట్ లో మిరుదొడ్డి గ్రామానికి చెందిన కొండ జ్యోతి ఎంఎస్సీ కంప్యూటర్ సైన్సులో 5వ ర్యాంక్ సాధించి గ్రామానికి మండలానికి గర్వకారణంగా నిలిచింది. నిరుపేద కుటుంబంలో జన్మించిన జ్యోతి చదువుకు పేదరికం అడ్డు కాదు అని పీజీ ప్రవేశ పరీక్షలో సత్తా చాటి తల్లిదండ్రులకు అధ్యాపకులకు కళాశాలకు గర్వకారణంగా నిలిచింది. భవిష్యత్తులో మరిన్ని ఉన్నతమైన చదువులు చదివి గ్రామానికి మంచి పేరు తీసుకురావాలని గ్రామంలో మేధావి సంఘ నాయకులు గ్రామ పెద్దలు జ్యోతిని అభినందించారు .

## ఖేడ్ :ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా

**శక్తి పాలసీ వెనక్కి తీసుకొని జీవో నెంబర్ 97 ను రద్దు చేయాలి**

**పాలిటెక్నిక్ కోర్సులను పాత పద్ధతిలోని కొనసాగించాలి**

**డిప్లమా ని ఐటిఐ తో అనుసంధానం చేసే నిర్ణయాని మానుకోవాలి**

**ఎస్.ఎఫ్.ఐ. డివిజన్ కార్యదర్శి స్వరాజ్**

**ప్రజా వాయిస్ నారాయణఖేడ్**
రాష్ట్ర ప్రభుత్వం శక్తి పాలసీని వెనక్కి తీసుకొని,నాదీజు ని బలోపేతం చేయాలి.పాలిటెక్నిక్ కళాశాలను యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ లో కలుపుతూ పాలిటెక్నిక్ విద్యార్థులను కార్మికులుగా మార్చ వద్దు అని ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో కళాశాల ముందు నిరసన వేసి




అనంతరం నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేసి ఎమ్మార్వో కి వినతి పత్రం ఇవ్వడం జరిగింది ఈ సందర్భంగా ఎస్.ఎఫ్.ఐ. డివిజన్ కార్యదర్శి స్వరాజ్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పాలిటెక్నిక్ కళాశాలను ఐటిఐ, ఏటిసి లతో అనుసంధానం చేస్తూ క్రొత్తగా శక్తి పాలసీని తీసుకొస్తూ యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ లో కలుపుతున్న పరిస్థితి ఉంది. దీనితో పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులు డిప్లొమా పూర్తి చేసుకొని పై చదువులకు బి. టెక్ వెళ్ళి ఇంజనీరింగ్ అవ్వాల్సిన విద్యార్థులు ఐటిఐ ఏటిసి లతో అనుసంధానం చేయడం ద్వారా కార్మికులుగానే మిగిలి పోయే ప్రమాదం ఉంది. కాబట్టి అధికారులు స్పందించి శక్తి పాలసీని వెనక్కి తీసుకోనీ నాదీజు నీ బలోపేతం చేయాలని అన్నారు డిప్లమా కోర్సులను ఇంజనీరింగ్ కోర్సులుగా అప్ గ్రేడ్ చేయాల్సింది పోయి డి గ్రేట్ చేయడం సరైంది కాదని ఈ పద్ధతి రాష్ట్ర ప్రభుత్వం విరమించుకొని డిప్లమాను పాత పద్ధతిలోనే కొనసాగించాలని లేనియెడల ప్రభుత్వంపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని అన్నారు ఈ కార్యక్రమంలో కళాశాల విద్యార్థులు రంజిత్ అభిషేక్ హరి సాయిరాం సుప్రీత్ మనితేజ దత్తు విద్యార్థినిలుపాల్గొన్నారు

## అధిక సాంద్రత పత్తి సాగుపై రైతులకు అవగాహన

**రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన పెంచుకోవాలి.**

**జనగామ శాస్త్రవేత్త మరియు కోఆర్డినేటర్ డాక్టర్ బి రమ్య**

**ప్రజా వాయిస్ /జనగామ జిల్లా బ్యూరో చీఫ్ ఆగస్టు 18:**
అధిక సాంద్రత మొక్కల సాగు విధానం లో ప్రతి మొక్కల సంఖ్యను పెంచడం మాత్రమే కాకుండా, మొక్కల పెరుగుదలను నియంత్రించడం, సమతుల్య పోషక యాజమాన్యం, కలుపు నివారణ, రసం పీల్చే పురుగుల సమగ్ర యాజమాన్యం మరియు సకాలంలో పంటను ముగించడం ద్వారా హెచ్ డి పి ఎస్ ప్రతి సాగులో అధిక ఉత్పాదకతను సాధించవచ్చని తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం జనగామ శాస్త్రవేత్త మరియు కోఆర్డినేటర్ డా. వి. రమ్య అన్నారు.పంట 40-45 రోజుల వయస్సులో లేదా మొక్కలు అధికంగా ఏపుగా పెరుగుతున్నప్పుడు మేపిక్వాట్ క్లోరైడ్ 5% ూా ఏ 1 మి.లీ./లీటరు నీటికి పిచికారీ చేయవచ్చని, తదుపరి పిచికారీని పంట పెరుగుదల ఆధారంగా 15-20 రోజుల తరువాత చేపట్టాలని వివరించారు. ప్రస్తుత ఎల్ నినో పరిస్థితులు మరియు పంటలో అవసరాన్ని బట్టి ఆకుల ద్వారా పోషకాలు అందించడానికి 2% యూరియా అంటే 20 గ్రాములు/లీటరు నీటికి మరియు పుష్పించే మరియు కాయ ఏర్పడే దశల్లో పొటాష్ అవసరాన్ని దృష్టిలో ఉంచుకుని పొటాషియం నైట్రేట్



5-10 గ్రాములు/లీటరు నీటికి పిచికారీ చేయవచ్చు అని తెలిపారు.పంటలో పచ్చదోమ, తెల్లదోమ, పేనుబంక, తామరపురుగు మొదలగు రసంపీల్చే పురుగుల ఉధృతి ని బట్టి తక్కువ పురుగు ఉధృతి ఉన్నప్పుడు వేపనూనె 5 మి.లీ./లీటరు వంటి వృక్ష ఆధారిత ఉత్పత్తులను అవసరాన్ని బట్టి ఉపయోగించవచ్చని తెలిపారు. రసాయనిక పురుగు మందులు ఫ్లోనికేమిడ్ 0.3 గ్రా లేదా ఫిప్రోనిల్ 2 మి. లీ లేదా ఆసిటమిప్రిడ్ 0.3 గ్రా లేదా ఇమిడాక్లోప్రిడ్ 0.25 మి. లీ వంటి సిఫార్సు చేసిన మందులను ఉపయోగించవచ్చు . గులాబీ రంగు పురుగు సమస్యను నివారించడానికి పంటను ఎక్కువ కాలం పొలంలో ఉంచకుండా, సకాలంలో పంటను ముగించడం హెచ్ డి పి ఎస్ యొక్క ముఖ్యమైన లక్ష్యం కాబట్టి పంటలో ఈ పురుగుల ఉనికిని పర్యవేక్షించడానికి లింగాకర్షక బుట్టలను ఏర్పాటు చేసి, కాయలను పరిశీలిస్తూ అవసరమైనప్పుడు మాత్రమే నియంత్రణ చర్యలు చేపట్టాలని సూచించారు.ఈ సందర్భంగా రఘునాథపల్లి మండల వ్యవసాయ అధికారి ఎ. కర్ణాకర్ మాట్లాడుతూ, పత్తి సాగులో హెచ్ డి పి ఎస్విధానం ద్వారా రైతులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. అధిక సాంద్రత పద్ధతిలో ఎకరాకు మొక్కల సంఖ్య పెరగడం, పంటను తక్కువ వ్యవధిలో పూర్తి చేసుకునే అవకాశం, సాగు వనరులను సమర్థవంతంగా వినియోగించుకోవడం మరియు దిగుబడి సామర్థ్యాన్ని పెంచుకోవడం వంటి ప్రయోజనాలు ఉన్నాయని తెలిపారు. ఆర్ ఈ ఏ సి సభ్యులు శ్రీ ఎం. యాదగిరి మాట్లాడుతూ, రైతులు శాస్త్రీయ సాగు పద్ధతులపై అవగాహన పెంచుకుని, అధికారుల సూచనల మేరకు ఆధునిక పద్ధతులను అనుసరించడం ద్వారా పత్తి సాగులో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో డా. వి. రమ్య, శాస్త్రవేత్త మరియు సమన్వయకర్త, తెలంగాణ రైతు విజ్ఞాన కేంద్రం జనగామ ఎ. కర్ణాకర్, మండల వ్యవసాయ అధికారి, రఘునాథపల్లి. ఆర్ ఇ ఏ ఃసభ్యులు ఎం. యాదగిరి; వ్యవసాయ విస్తరణ అధికారులు బి. కల్పన, బి. కీర్తి, ఈ. అజయ్, శ్రీ కరుణాకర్ తదితరులు పాల్గొన్నారు. రఘునాథపల్లి, వెల్ది, ఖంజిపేట, రామన్నగూడెం, గోవర్ధనగిరి, వెల్లడి, కన్నాయపల్లి, ఇబ్రహీంపూర్ తదితర గ్రామాలకు చెందిన సుమారు 50 మంది రైతులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## వృద్ధాశ్రమంలో నాగరాజు జన్మదిన వేడుకలు.. ఘనంగా అన్నదానం

**అనాథలు, వృద్ధుల మధ్య పుట్టినరోజు వేడుకలు**

**సేవా కార్యక్రమంతో ఆదర్శంగా నిలిచిన ఏబీఏపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షులు**

**మేడ్చల్ జిల్లా, మూడు చింతలపల్లి / ప్రజా వాయిస్:**



జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా అనాథలు, వృద్ధుల మధ్య జరుపుకుంటూ మానవత్వాన్ని చాటుకున్నారు అఖిల భారతీయ అయ్యప్ప ధర్మప్రచార సభ (ఏబీఏపీ) మేడ్చల్ జిల్లా అధ్యక్షులు శ్రీపతి నాగరాజు. తన జన్మదినాన్ని పురస్కరించుకుని మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని జగన్‌గూడ గ్రామంలోని ది హోమ్ ఫర్ డిసేబుల్డ్ వృద్ధాశ్రమంలో ప్రత్యేకంగా అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు.సత్యం గురుస్వామి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాగరాజు జన్మదిన వేడుకలను వృద్ధాశ్రమంలోని వృద్ధులు, అనాథల సమక్షంలో ఘనంగా నిర్వహించారు. అనంతరం వృద్ధులకు స్వయంగా అన్నదానం వడ్డించి, వారితో కలిసి భోజనం చేశారు. నాగరాజు జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమంగా నిర్వహించడం పట్ల అయ్యప్ప భక్తులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు హర్షం వ్యక్తం చేశారు. ప్రతి అయ్యప్ప భక్తుడు సేవా కార్యక్రమాలకు ముందుకు రావాలి…ఈ సందర్భంగా సత్యం గురుస్వామి మాట్లాడుతూ.. అయ్యప్ప భక్తిలో సేవాభావానికి ప్రత్యేక స్థానం ఉందని, ప్రతి భక్తుడు తన జన్మదినం, శుభకార్యాలను అనాథలు, వృద్ధుల మధ్య జరుపుకోవడం ద్వారా సమాజానికి ఆదర్శంగా నిలవాలని అన్నారు. నాగరాజు తన జన్మదిన వేడుకలను వృద్ధాశ్రమంలో నిర్వహించి అన్నదానం చేయడం అభినందనీయమన్నారు.వృద్ధులకు స్వయంగా అన్నదానం వడ్డించే అవకాశం కల్పించిన నాగరాజుతో పాటు ఏబీఏపీ మేడ్చల్ జిల్లా టీమ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.జన్మదిన వేడుకలకు కొత్త అర్థం సాధారణంగా జన్మదిన వేడుకలు కేక్ కటింగ్, శుభాకాంక్షలకే పరిమితమవుతున్న సమయంలో…… నాగరాజు మాత్రం తన పుట్టినరోజును వృద్ధుల మధ్య నిర్వహించి, వారికి అన్నదానం చేయడం ద్వారా "మన సంతోషంలో నలుగురిని భాగస్వాములను చేయడమే నిజమైన వేడుక" అనే సందేశాన్ని చాటారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర ఏబీఏపీ ఉపాధ్యక్షులు జాప మల్లేష్, జోనల్ సెక్రెటరీ సామల బుచ్చిరెడ్డి, ఎలక్షన్ కమిషన్ మెంబర్ దుర్గాపతి మధు, మేడ్చల్ జిల్లా పీఆర్వో టేకుల మధుసూదన్ రెడ్డి, గురుస్వాములు గురువయ్య, తొర్రి మల్లేష్, కొల్తూరు అయ్యప్ప ధర్మప్రచార సభ అధ్యక్షులు రాజు, ఉద్దెమర్రి గ్రామ అయ్యప్ప ధర్మప్రచార సభ అధ్యక్షులు తుంకి భాస్కర్, అయ్యప్ప భక్తులు ప్రసాద్, శెట్టి మధు, సింగిరెడ్డి గణేష్ రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొని నాగరాజుకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. వృద్ధుల ఆశీర్వాదాల మధ్య సాగిన నాగరాజు జన్మదిన వేడుకలు.. సేవా స్ఫూర్తికి ప్రతీకగా నిలిచాయి.



## రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ, గజస్థంభం, కళ్యాణ మహోత్సవం

**భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించిన ఆలయ కార్యక్రమాలు**

**ముఖ్యతిథులుగా పాల్గొన్న మేడ్చల్ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి**

**మేడ్చల్, శామీర్ పేట / ప్రజా వాయిస్ :**
రేణుక ఎల్లమ్మ అమ్మవారి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ, గజస్థంభ ప్రతిష్ఠతో పాటు అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో అలియాబాద్ మున్సిపల్ లాల్ గాడి మలక్ పేట గ్రామ మాజీ వార్డు మెంబెర్ నేమురి నగేష్ ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మేడ్చల్ ఎమ్మెల్యే చామకురా మల్లారెడ్డి ముఖ్యతిధులు గా పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా మల్లారెడ్డి మాట్లాడతూ….అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేసి పూజలు నిర్వహించం అని అన్నారు. అనంతరం గజస్థంభ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని శాస్త్రోక్తంగా చేపట్టారు. అమ్మవారి కళ్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించగా, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ప్రాంగణం భక్తుల సందడితో కళకళలాడింది. అమ్మవారి ఆశీస్సులతో గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని నిర్వాహకులు ఆకాంక్షించారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ఆలయ కమిటీ సభ్యులు, నిర్వాహకులు, గ్రామ పెద్దలు, భక్తులు సహకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు రాజు గౌడ్, జగదీష్ గౌడ్, శంకర్ గౌడ్, బాలరాజు గౌడ్, అర్జున్ గౌడ్, మాజీ సర్పంచ్ వనజ శ్రీనివాస్ రెడ్డి, కౌన్సిలర్లు, నాయకులు, మాజీ ప్రజా ప్రతినిధులు, భక్తులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.





# ఆరుతడి పంటలపై రైతులు మొగ్గు చూపాలి

**తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం**
**మినుము, ఆయిల్ ఫామ్, వేరుశనగ, పంటలు వేయండి**
**వ్యవసాయ అధికారి డాకేశ్వర్ గౌడ్**



ప్రజా వాయిస్.. వనపర్తి
జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఆరుతడి పంటలు మాత్రమే వెయ్యాలని మంగళవారం సంపత్ రావు పల్లి వీపనగండ్ల మండలం కేంద్రంలో రైతులకు అవగాహన కల్పించారు. అరుతడిపంటలకు మాత్రమే జూరాల మరియు బీమా నీళ్లను మాత్రమే ఇవ్వడం జరుగుతుంది. కనుక రైతులు ఆరుతడి పంటలపై మొగ్గు చూపాలని వ్యవసాయ అధికారి ఏవో దాకేశ్వర్ గౌడ్ తెలిపారు. ఏలినోనాప్రభావం వల్ల తక్కువ వర్షపాతం నమోదు అవుతుంది కనుక రైతులు మినుము, వేరుశనగ, ఆయిల్ ఫామ్, టమాటా, మిరప, బెండకాయ, కూరగాయలకు సంబంధించిన పంటలను సాగు చేసుకోవాల్సిందిగా ఆయన రైతులను కోరారు. మినుములకు సంబంధించి వి బి ఎన్-8 రకం 70 నుంచి 80 రోజుల్లో పంట వస్తుంది. 7-9 క్వింటాళ్ల ఎకరాకు దిగుబడి వస్తుంది. వేరుశనగ సంబంధించి ఖ6 , వశిష్ట రకాలను సాగు చేయాలన్నారు. 110రోజుల్లో పంట చేతికి వస్తుంది. 10-14 క్వింటాలు ఎకరాకు దిగుబడి వస్తుంది. ఆయిల్ ఫామ్ సంబంధించి తక్కువ నీటితో ఎక్కువ ఆదాయం ఆయిల్ తయారీకి ముఖ్యమైన పంట25-30 సంవత్సరాలు వరకు ఆదాయం ఉంటుంది. ఉపాధి అవకాశాలు మెరుగవుతాయి అని ఆయన అన్నారు. తెలంగాణ ప్రభుత్వం నుంచి కూడా ఆయిల్ ఫామ్ కు సంబంధించి మంచి సబ్సిడీకి ఇచ్చి ప్రోత్సహించడం జరుగుతుంది. కూరగాయలు సంబంధించి మిరప, టమాట, బెండకాయలు కూరగాయలు సాగు చెయ్యాలి, అందులో భాగంగా తుంకుంట గ్రామంలో క్షేత్ర ప్రదర్శన కూడా చేయడం జరిగింది అని ఆయన అన్నారు. ఈకార్యక్రమంలో ఏవో డాకేశ్వర్ గౌడ్, ఏ ఈ ఓ నారియా నాయక్, ఆయిల్ ఫామ్ క్లస్టర్ ఆఫీసర్ మహేష్, రైతులు తదితరులు పాల్గొన్నారు.

# రోడ్లపై పశువులు వదిలితే కఠిన చర్యలు

**ప్రమాదాల నివారణకు మున్సిపల్, పోలీసు అధికారుల సంయుక్త హెచ్చరిక**
**ప్రధాన రహదారులపై అవాంఛిత పార్కింగ్, చిరు వ్యాపారాలపై నిషేధం**



ప్రజా వాయిస్/రామకృష్ణాపూర్
మంచిర్యాల జిల్లా కేంద్రంలోని క్యాతనపల్లి మున్సిపాలిటీ మరియు రామకృష్ణాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులపై రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు కఠిన చర్యలకు ఉపక్రమించారు. పట్టణంలోని గద్దె రాగడి సమీపంలోని అమ్మ గార్డెన్స్ కమాన్ వద్ద మంగళవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో క్యాతనపల్లి మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ, రామకృష్ణాపూర్ ఎస్ఐ శ్రీధర్, మున్సిపల్ చైర్ పర్సన్ సంధ్యారాణి సంయుక్తంగా కీలక ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్ర, జాతీయ రహదారులు అలాగే ముఖ్యమైన రోడ్లపై ఆవులు, గేదెలు, మూగపశువులు సంచరిస్తే ఉపేక్షించేది లేదు. యజమానులు వెంటనే తమ పశు వులను ఇళ్లలోనే కట్టివేయాలి. నిబంధనలు ఉల్లంఘిస్తే సీరియస్ చర్యలు తప్పవు. రోడ్లపై పశువుల సంచారం వల్ల అకారణంగా జరుగుతున్న రోడ్డు ప్రమాదాల్లో ఎన్నో నిండు ప్రాణాలు గాలిలో కలిసిపోతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు అధికారులు స్పష్టం చేశారు. ప్రధాన రహదారులపై బైకులు, కార్లు మరియు ఇతర వాహనాలను ఎట్టి పరిస్థితులలోనూ పార్క్ చేయడానికి వీల్లేదు. నిబంధనలు మీరితే మున్సిపల్ మరియు పోలీసు చట్టాల ప్రకారం భారీ జరిమానాలతో పాటు కేసులు నమోదు చేయబడతాయి. రోడ్లపై ఎలాంటి చిరు దుకాణాలు పెట్టరాదు. అలాగే, దుకాణాల యజమానులు తప్పనిసరిగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నిర్లక్ష్యం వహించి నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన కఠిన చర్యలు ఉంటాయని, పట్టణ ప్రజలు మరియు వ్యాపారులు అధికారులకు పూర్తిగా సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరుస తప్పిదాలతో విద్యార్థుల జీవితాలతో ఎన్టీఏ చెలగాటం

**ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు**



ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి
వరుస తప్పిదాలతో విద్యార్థుల జీవితాలతో ఎన్టీఏ చెలగాటం ఆడుతున్నదని ఏఐఎస్ఎఫ్ జాతీయ మాజీ అధ్యక్షులు తక్కళ్లపల్లి శ్రీనివాసరావు అన్నారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ హనుమకొండ జిల్లా సమితి ముఖ్య కార్యకర్తల సమావేశం జిల్లా కార్యదర్శి భాషబోయిన సంతోష్ అధ్యక్షతన బాలసముద్రం జిల్లా కార్యాలయంలో మంగళవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ జాతీయ అధ్యక్షులు తక్కలపల్లి శ్రీనివాసరావు హాజరై మాట్లాడుతూ జూన్ లో జరిగిన యుజిసి నెట్ ప్రవేశ పరీక్షలో తప్పులు,లోపాలు జరిగి, ఇంగ్లీష్, సోషియాలజీ, కామర్స్ పేపర్ లను రద్దు చేస్తున్నట్లు ఎన్టీఏ ప్రకటించడం అంటే విద్యార్థుల జీవితాలతో చెలగటమేనని, నీట్ పేపర్ లీక్,పరీక్షల్లో అవకతవకలు మొదలుకొని నేటి యుజిసి నెట్ ప్రశ్న పత్రాల తప్పులు,లోపల వరకు ఎన్టీఏ పరీక్షల నిర్వహణ పట్ల తీవ్ర నిర్లక్ష్యంగా వుందని,వరుస వైఫల్యాలతో చీూా లో జరుగుతున్న అక్రమాలపై జ్యుడీషియల్ ఎంక్వైరీ చేయాలని డిమాండ్ చేశారు. వరుస తప్పిదాలతో ఎన్టీఏ విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటుందని, దీంతో విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి లోనవుతున్నారని , ఎన్టీఏ అధికారులు చేస్తున్న తప్పులకు విద్యార్థులు బలి అవుతున్నారని, ఎన్టిఏ సంస్థ నిత్యం పరీక్షల నిర్వహణలో తప్పులు చేస్తూ అవకతవకలు, అక్రమాలు చేస్తూన్న కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం ఒక సంస్థను రద్దు చేయడానికి చర్యలు తీసుకోవడానికి ఎందుకు భయపడుతుందని ప్రశ్నించారు. బిజెపి ప్రభుత్వానికి ఒక ఎన్టిఏ సంస్థ ముఖ్యమా లేక దేశంలోని లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ముఖ్యమా ఆలోచించాలని, ప్రధాని మోదీ వెంటనే దీనిపై స్పందించాలని, కొన్ని పరీక్షల నిర్వహణ కేంద్ర ప్రభుత్వం తన ఆధీనంలో కాకుండా రాష్ట్రాలకు కూడా ఇవ్వాలని, వెంటనే కేంద్ర ప్రభుత్వం ఎన్టీఏని పూర్తి స్థాయిలో రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అఖిల భారత విద్యార్థి సమాఖ్య ఏఐఎస్ఎఫ్ 90 వసంతాల ప్రస్థానంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా సెప్టెంబర్ 28,29,30 తేదీలలో హనుమకొండ జిల్లా కేంద్రంలో రాష్ట్రస్థాయి వార్షికోత్సవాలను మూడు రోజులపాటు ఘనంగా నిర్వహించనున్నారని తెలిపారు. ఏఐఎస్ఎఫ్ విద్యార్థుల హక్కుల కోసం, సామాజిక న్యాయం కోసం, ప్రజాస్వామ్య విలువల కోసం, దేశ ఐక్యత, శాంతి కోసం నిరంతరం పోరాడిన చారిత్రక విద్యార్థి సంఘం అని, 1936లో ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు అనేక తరాల విద్యార్థులను ఉద్యమ బాటలో నడిపించిన ఘనమైన చరిత్ర ఏఐఎస్ఎఫ్‌కు ఉందని అన్నారు. విద్యార్థులకు విద్య అందుబాటులో ఉండాలి, పేద విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించాలి, ప్రభుత్వ విద్యా వ్యవస్థను బలోపేతం చేయాలి అనే లక్ష్యాలతో ఏఐఎస్ఎఫ్ అనేక పోరాటాలు నిర్వహించిందన్నారు. 90 సంవత్సరాల ఈ ప్రస్థానం సందర్భంగా గత పోరాటాలను స్మరించుకోవడం, ఆ పోరాటాల స్ఫూర్తిని నేటి తరానికి అందించడం, భవిష్యత్ విద్యార్థి ఉద్యమానికి దిశానిర్దేశం చేయడం ఈ వార్షికోత్సవాల ప్రధాన ఉద్దేశ్యం అన్నారు. ఈ సమావేశానికి హాజరైన ఏఐఎస్ఎఫ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కసిరెడ్డి మణికంఠ రెడ్డి, మాజీ ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర నాయకులు కర్రె బిక్షపతి మాట్లాడుతూ ప్రస్తుతం విద్యారంగం అనేక సవాళ్లను ఎదుర్కొంటోందని,పెరుగుతున్న విద్యా వ్యయం, పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్, నిరుద్యోగం, ప్రభుత్వ విద్యాసంస్థల సమస్యలు వంటి అంశాలపై విద్యార్థుల తరఫున మరింత బలమైన ఉద్యమాలను నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ నేపథ్యంలో హనుమకొండ జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 28, 29, 30 తేదీలలో నిర్వహించనున్న ఏఐఎస్ఎఫ్ 90 వసంతాల వార్షికోత్సవ రాష్ట్రస్థాయి కార్యక్రమాలను విజయవంతం చేయాలని విద్యార్థులు, యువత, మేధావులు, ప్రజాస్వామ్యవాదులు, ప్రజాసంఘాలు, ఉద్యమకారులు, పాత్రికేయ మిత్రులను కోరుతున్నామన్నారు. అందుకే ప్రతి విద్యార్థి, ప్రతి యువకుడు ఈ చారిత్రక కార్యక్రమంలో భాగస్వామి కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా అధ్యక్షులు ఊట్కూరి ప్రణీత గౌడ్, వరంగల్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దిడ్డి పార్థసారథి, యాదల్ల శరత్, జిల్లా ఉపాధ్యక్షులు జక్కుల భాను ప్రసాద్, శ్రీపతి వినయ్, వేల్పుల చరణ్, జిల్లా సహాయ కార్యదర్శి కొండ చరణ్, బన్నీ, చిర సాయి, జిల్లా సమితి సభ్యులు కందగట్ల అజయ్, మల్లబోయిన రామ్ చరణ్, గుండేల్లి అవినాష్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# పీ.ఏ మోడల్ స్కూల్ హాస్టల్‌ను తక్షణమే ప్రారంభించాలి

**-విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యంతో నేటికీ తెరుచుకోని మోడల్ స్కూల్ హాస్టల్**
**-విద్య సంవత్సరం ప్రారంభం అయి నేటికి మూడు నెలలు గడుస్తున్న తెరుచుకొని మోడల్ స్కూల్ హాస్టల్**
**-రెండు రోజుల్లో హాస్టల్ ప్రారంభించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతాం**
**-బిఆర్ఎస్వీ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ**

ప్రజా వాయిస్ /దేవరకొండ
పీఏ పల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌ను తక్షణమే ప్రారంభించాలని బిఆర్ఎస్వీ దేవరకొండ నియోజకవర్గ అధ్యక్షులు బొడ్డుపల్లి కృష్ణ విద్యాశాఖ అధికారులను డిమాండ్ చేశారు. మంగళవారం పీఏ పల్లిలో ఆయన మాట్లాడుతూ..హాస్టల్ ప్రారంభం కాకపోవడంతో మోడల్ స్కూల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. విద్యా సంవత్సరం ప్రారంభమై రోజులు గడుస్తున్నప్పటికీ విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం కారణంగా నేటికీ హాస్టల్ తెరుచుకోకపోవడం బాధాకరమన్నారు. హాస్టల్ సౌకర్యం లేక విద్యార్థులు, వారి తల్లిదండ్రులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, సంబంధిత అధికారులు వెంటనే స్పందించి హాస్టల్‌ను ప్రారంభించే చర్యలు చేపట్టాలని బొడ్డుపల్లి కృష్ణ డిమాండ్ చేశారు. రెండు రోజుల్లోగా పీఏ పల్లి మోడల్ స్కూల్ హాస్టల్‌ను ప్రారంభించకపోతే విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని ఆయన విద్యాశాఖ అధికారులను హెచ్చరించారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని అధికారులు ఇకనైనా నిర్లక్ష్యాన్ని వీడి తక్షణమే హాస్టల్‌ను ప్రారంభించాలని ఆయన కోరారు.



# ఉపాధ్యాయుల పి.ఆర్.సి ని ప్రభుత్వం వెంటనే ప్రకటించాలి




ప్రజా వాయిస్ కొత్త గూడ
డి టి ఎఫ్ కొత్తగూడ మండల శాఖ ఆధ్వర్యంలో మండలంలోని వివిధ పాఠశాలలో సభ్యత్వ నమోదు లో భాగంగా వివిధ పాఠశాలలను సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు నెల్లుట్ల భాస్కర్ మాట్లాడుతూ పి ఆర్ సి ని వెంటనే ప్రకటించాలని, పెండింగ్లో ఉన్న ఆరు డి ఏ లను విడుదల చేయాలని, కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపరిచి హామీ ఇచ్చిన విధంగా సిపిఎస్ ను రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని ప్రకటించాలని, గిరిజన ఆశ్రమ పాఠశాలలో పనిచేసే పండిత టీచర్లను అప్గ్రేడ్ చేయాలని, కస్తూర్బా గాంధీ విద్యాలయాల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని మినిమం టైం స్కేల్, ఆరోగ్య కార్డులను వెంటనే విడుదల చేసి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులలో వైద్యం చేయించాలని, అలాగే ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులకు పెండింగ్ బిల్లులను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆడిట్ కమిటీ సభ్యులు లక్కాకుల రమేష్ ,జిల్లా కౌన్సిలర్ వాసం ప్రభాకర్, మండల అధ్యక్షులు చాట్ల పొట్టయ్య, మండల ప్రధాన కార్యదర్శి జాటోత్ జిమ్మీ లాల్ ,మండల ఉపాధ్యక్షులు దుప్పటి సుధాకర్ ,మండల కార్యదర్శి భానోత్ వెంకన్న, తదితరులు పాల్గొన్నారు

# భద్రకాళి బండ్ పై సందర్శకులకు అందుబాటులోకి బ్యాటరీ వెహికల్

**వెహికల్ సేవలను ప్రారంభించిన వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే, జిల్లా కలెక్టర్**



ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి
భద్రకాళి బండ్ పై సందర్శకుల సౌకర్యార్థం బ్యాటరీ వెహికల్ సేవలు మంగళవారం అందుబాటులోకి వచ్చాయి. ఈ సేవలను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై బ్యాటరీ ఆపరేటెడ్ వెహికల్ ను ప్రారంభించారు. నూతనంగా అందుబాటులోకి వచ్చిన బ్యాటరీ వెహికల్ ను ప్రారంభించిన అనంతరం కుడా సిపిఓ అజిత్ రెడ్డి నడపగా ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ వెంకన్న, తదితరులు భద్రకాళి బండ్ పై ప్రయాణించారు. ఫాతిమ కెనరా బ్యాంక్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్ ఫండ్స్ కింద కొనుగోలు చేసిన బ్యాటరీ వెహికల్ ను కుడా కు అందజేశారు. కాగా ఈ వెహికల్ ను ఎమ్మెల్యే చేతులకు మీదుగా ప్రారంభించడంతో సందర్శకుల సౌకర్యార్థం ఈ సేవలు అందుబాటులోకి వచ్చాయి. ఈ సందర్భంగా కుడా ఈఈ భీమ్ రావు, కెనరా బ్యాంకు అధికారులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో భారీ ధర్నా

**కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్, రైతు బీమా పథకాలను అమలు చేయాలని డిమాండ్..**



ప్రజా వాయిస్ టేక్మాల్:
రాష్ట్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు భక్తుల వీరప్ప ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రభుత్వానికి, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ నిర్వహించి తమ నిరసన వ్యక్తం చేశారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలతో పాటు రైతు బీమా పథకాలను ప్రభుత్వం సక్రమంగా అమలు చేయాలని బిఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. అర్హులైన లబ్ధిదారులకు పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ధర్నా అనంతరం బిఆర్ఎస్ నాయకులు తహసీల్దార్ తులసిరామ్ ను కలిసి తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి ప్రజలు, రైతుల సమస్యలను పరిష్కరించాలని నాయకులు కోరారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

## అర్వణపల్లి పరిసరాల్లో పులి సంచారమా?

**-ప్రచారంతో గ్రామంలో కలకలం**

**-క్షేత్రస్థాయిలో పరిశీలించిన అటవీశాఖ అధికారులు**

**-అడవి పిల్లి అడుగులేమోనని అనుమానం**



**కేసముద్రం, ప్రజావాయిస్:** కేసముద్రం మండలం అర్వణపల్లి గ్రామ పరిసరాల్లో పులి సంచరిస్తోందంటూ ప్రచారం కావడంతో గ్రామంలో కలకలం నెలకొంది. పత్రికలు, సామాజిక మాధ్యమాల్లో వచ్చిన సమాచారంతో అప్రమత్తమైన అటవీశాఖ అధికారులు మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలన చేపట్టారు. పులి అడుగులుగా ప్రచారం జరుగుతున్న ప్రాంతాన్ని పరిశీలించి పాదముద్రల ఫొటోలు, ఇతర ఆధారాలను సేకరించారు. ప్రాథమికంగా అధికారుల పరిశీలనలో అక్కడ కనిపించిన పాదముద్రలు అడవి పిల్లి అడుగుజాడలను పోలి ఉన్నట్లు గుర్తించారు. అయితే పాదముద్రలను పరిశీలించడం ద్వారా మాత్రమే ఏ జంతువుకు సంబంధించినవో ఖచ్చితంగా నిర్ధారించలేమని అధికారులు తెలిపారు. సేకరించిన ఆధారాలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి శాస్త్రీయ, ప్రయోగశాల పరీక్షలు నిర్వహించిన అనంతరం పూర్తి వివరాలను వెల్లడిస్తామని స్పష్టం చేశారు.

## బహుజన ఆత్మగౌరవానికి ప్రతీక సర్దార్ సర్వాయి పాపన్న

**తిరుమలగిరిలో ఘనంగా జన్మదిన వేడుకలు**

**బహుజన రాజ్యం, హక్కుల కోసం పోరాడిన యోధుడిగా స్మరణ**



**ప్రజా వాయిస్-తిరుమలగిరి:**
బహుజనుల ఆత్మగౌరవం, హక్కులు, స్వపరిపాలన కోసం పోరాడిన యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని బహుజన సంఘాల నాయకులు కొనియాడారు. తిరుమలగిరి మండల కేంద్రంలో మంగళవారం సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జన్మదిన వేడుకలను బహుజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ చిత్రపటానికి నివాళులర్పించి ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. మొఘల్ పాలనకు వ్యతిరేకంగా పోరాడి గోల్కొండ కోటపై బహుజనుల జెండా ఎగురవేసిన వీరుడిగా పాపన్న గౌడ్ చరిత్రలో నిలిచిపోయారని పేర్కొన్నారు. అణగారిన వర్గాల హక్కులు, ఆత్మగౌరవం కోసం ఆయన సాగించిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు. పాపన్న ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు బహుజనులు ఐక్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బహుజన నాయకులు పిడిగం నాగయ్య ముదిరాజ్, జటావత్ లాలు నాయక్, నర్సింగు, వెంకన్న గౌడ్, వట్టాల శ్రీనివాస్ గౌడ్, మేకపోతుల కార్తీక్ గౌడ్, గుండెగొని రాజేష్ గౌడ్, వీరబోయిన మల్లికార్జున్, తిమ్మాయపాలెం సర్పంచ్ శౌరి నాయక్, కొర్ర శంకర్, రంగుండ్ల సర్పంచ్ గోపాల్ నాయక్, తునికినూతల సర్పంచ్ బోడకనాయక్, రమావత్ హనుము, వల్లవాయి అశోక్, కిషన్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## కళ్యాణ లక్ష్మిపై బీఆర్ఎస్ దుష్ప్రచారం మానుకోవాలి: శేర్ నర్సారెడ్డి

**ప్రజా వాయిస్, కోరుట్ల:**



కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలపై బీఆర్ఎస్ నాయకులు అబద్ధపు ప్రచారాలు చేస్తున్నారని టీపీసీసీ లీగల్ సెల్ రాష్ట్ర కన్వీనర్ శేర్ నర్సారెడ్డి మండిపడ్డారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ పథకాలకు చట్టబద్ధత కల్పించకుండా, లోపభూయిష్టమైన జీవోలు ఇవ్వడం వల్లే నేడు హైకోర్టులో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తాయని ఆయన స్పష్టం చేశారు.తమ తప్పులను కప్పిపుచ్చుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వం పథకాలను నిలిపివేస్తోందంటూతప్పుడు ప్రచారం చేయడం సిగ్గుచేటని విమర్శించారు. హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులపై రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే డివిజన్ బెంచ్‌లో అప్పీలు చేయనుందని తెలిపారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలను కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం యథావిధిగా కొనసాగిస్తుందని నర్సారెడ్డి పునరుద్ఘాటించారు.

# బహుజనులు రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలి

**-బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్**

**ప్రజా వాయిస్ /దేవరకొండ**
దేవరకొండ పట్టణంలో రిటైర్డ్ ఉద్యోగుల సంఘ భవనంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న 376 వ జయంతి వేడుకలు ఘనంగా జరిగిపారు.ఆయన చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ జయంతి ఉత్సవాల్లో బీసీ, ఎస్సి ,ఎస్టి ,మైనార్టీ సంఘం నాయకులు పెద్ద మొత్తంలో పాల్గొన్నారు. ఈ జయంతి ఉత్సవాల్లో వివిధ రంగాల్లో రానిచ్చినటువంటి సామాజిక కార్యకర్తలు ,మహిళలు ,మేధావులు, కార్మిక, కర్షకులను ఘనంగా సన్మానించినారు.ఈ సందర్భంగా సామాజికవేత్త, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ చింతపల్లి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ రాజ్యాధికారం కోసం పోరాడాలని, సర్దార్ సర్వాయి పాపన్న ఆశయ సాధన కోసం కృషి చేస్తూ, ఆయన



తాటి చెట్టుపై చేయి వేయడం కాదు కొడితే గోల్కొండ ఖిల్లా అనే కొట్టాలి అని పిలుపునిచ్చి భారత దేశ స్వాతంత్ర ఉద్యమంలో తొలి స్వాతంత్ర ఉద్యమకారుడుగా, తొలి బహుజన సామ్రాజ్యాన్ని స్థాపించిన గొప్ప నాయకుడని కొనియాడారు .గోల్కొండ తో పాటు 18 దుర్గాలకు రాజుగా పాలించిన బహుజన చక్రవర్తి అని కొనియాడారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ ,మైనార్టీలు ఏకమై బహుజన రాజ్యాధికారం కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్డి కోటేశ్వరరావు, పున్న వెంకటేష్ నేత , చొల్లేటిభాస్కరాచారి, డాక్టర్ ఏకుల రాజారావు, ఉప్పల శీను నేత, దబ్బీకార్ పెంటోజి,ఏరుకొండల రాము, మునగాల గణేష్,పున్న బిక్షమయ్య ,ముక్కామల బాలయ్య, శవ్వ నారాయణయాదవ్ ,పోతాం సహదేవ్, కుంభం బాలచందర్ గౌడ్ ,ఇంద్రకంటి ఈదయ్య గౌడ్, నాగిళ్ల క్రిష్టఫర్, బోయపల్లి చంద్రమౌళి ,ఏకుల సురేష్, ఎండి అబ్దుల్ సత్తార్, అబ్దుల్ కలాం, తోటపల్లి శీను, రాచమల్ల నాగయ్య, కానుగుల చంద్రశేఖర్, కాటం గోవర్ధన్ ,ఎరుకల వెంకటేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# వందల కిలోమీటర్ల దూరం నుండి గోదావరి నీళ్లను పాకాలకు తీసుకొచ్చిన భగీరథుడు పెద్ది

**.మండల కేంద్రంలో రాస్తారోకో ధర్నా**

**ప్రజా వాయిస్,కొత్త గూడ**
మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండల కేంద్రంలో ఉద్రిక్తత చోటుచేసుకుంది. నర్సంపేట మెడికల్ కాలేజీ ఆవరణలో ఏర్పాటు చేసిన మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి విగ్రహాన్ని రెవెన్యూ, మున్సిపల్ అధికారులు తొలగించడాన్ని నిరసిస్తూ బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు భగ్గుమన్నాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో గంటల తరబడి రాస్తారోకో, ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ తీరుకు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేయడంతో ప్రధాన రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి.నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి అకాల మరణంతో ఆయనపై ఉన్న అభిమానంతో ఏర్పాటు చేసిన విగ్రహాన్ని అధికారులు తొలగించడం తీవ్ర దుమారం రేపింది. ఈ చర్యను నిరసిస్తూ కొత్తగూడ మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు.ధర్నాలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రస్థాయిలో



విరుచుకుపడ్డారు.50 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ నర్సంపేటకు చేసిందేమీ లేదని, కేవలం ఐదేళ్ల కాలంలోనే పెద్ది సుదర్శన్ రెడ్డి వందల కిలోమీటర్ల దూరం నుంచి గోదావరి జలాలను మాదన్నపేట, పాకాల చెరువులకు తరలించి మూడు పంటలకు సాగునీరు అందించారని గుర్తుచేశారు.వందల కోట్లతో మెడికల్ కాలేజీని సాధించి నియోజకవర్గ ప్రజలకు మెరుగైన వైద్యం అందించిన నాయకుడి విగ్రహాన్ని తొలగించడం సిగ్గుచేటని మండిపడ్డారు.?విగ్రహాన్ని తొలగిస్తారేమో కానీ ఆయన చేసిన అభివృద్ధిని, పాకాలకు వచ్చే గోదావరి జలాలను ఆపగలరా? మెడికల్ కాలేజీని కూల్చగలరా? అంటూ ప్రభుత్వానికి సవాల్ విసిరారు. విగ్రహాన్ని తొలగించిన స్థానంలోనే ప్రభుత్వం అధికారిక లాంఛనాలతో తిరిగి విగ్రహాన్ని ప్రతిష్ఠించాలని బీఆర్ఎస్ శ్రేణులు డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చే వరకు పోరాటం ఆపేది లేదని హెచ్చరించాయి. ఈ కార్యక్రమంలో బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు కొమ్మన్నాబోయిన వేణు అధికార ప్రతినిధి బానోత్ నెహ్రూ సీనియర్ బి ఆర్ ఎస్ జిల్లా నాయకులు ఈసం స్వామి అలాగే సీనియర్ నాయకులు పశువుల గట్టయ్య సీనియర్ నాయకులు కాసర్ల సాంబయ్య పోగులపల్లి మాజీ సర్పంచ్ వీరన్న సోషల్ మీడియా ఇంచార్జి బండి రంజిత్ వేలుబెల్లి మాజీ ఎంపీటీసీ మోకాళ్ళ వెంకటేష్ దుర్గాం సర్పంచ్ పరమేష్ ఆవుల రమేష్ పల్లె శివ నక్క సాంబయ్య బొల్ల అనిల్ ఆగబోయిన రాజయ్య పెల్లి సదాయ్య పాస్తం ఎల్లయ్య మాదాసి అశోక్ బానోత్ శంకర్ రమేష్ కాసాని అయిలన్న ఇంకా తదితరులు పాల్గొన్నారు

# రోలు, రోకలితో భర్తను హతమార్చిన భార్య అరెస్ట్

**పాత కక్షలు.. ఆర్థిక ప్రయోజనాలపై వివాదమే హత్యకు కారణం**

**నేరాన్ని అంగీకరించిన నిందితురాలు.. హత్యాయుధాలు స్వాధీనం**

**ప్రజా వాయిస్, హుస్నాబాద్:**
పాత కక్షలు, కుటుంబ వివాదాలతో భర్తను కిరాతకంగా హత్య చేసిన భార్యను హుస్నాబాద్ పోలీసులు అరెస్ట్ చేశారు. కోటి వెంకటేశ్వర్లు హత్య కేసులో నిందితురాలైన కోటి రాజమణిని మంగళవారం అదుపులోకి తీసుకుని విచారించగా హత్యకు సంబంధించిన పలు విషయాలు వెలుగులోకి వచ్చినట్లు సీఐ కె. శ్రీధర్, ఎస్ఐ లక్ష్మారెడ్డి తెలిపారు. పోలీసుల విచారణలో రాజమణి నేరాన్ని అంగీకరించినట్లు వెల్లడించారు.సుమారు 35 ఏళ్ల క్రితం వెంకటేశ్వర్లుతో తనకు వివాహం జరిగిందని, ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారని రాజమణి పోలీసులకు తెలిపింది. అయితే సుమారు 15 ఏళ్ల క్రితం వెంకటేశ్వర్లు తనను, పిల్లలను వదిలి మరో మహిళను వివాహం చేసుకుని ఆమెతో నివసిస్తున్నాడని పేర్కొంది. ఇటీవల వెంకటేశ్వర్లు పదవీ విరమణ పొందడంతో వచ్చిన రిటైర్మెంట్ ప్రయోజనాలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలను రెండో భార్యకే అందేలా నిర్ణయించుకోవడంతో తనలో కక్ష పెరిగిందని పోలీసుల విచారణలో వెల్లడించినట్లు అధికారులు తెలిపారు. తమను ఇన్నాళ్లు నిర్లక్ష్యం



చేయడమే కాకుండా ఆర్థిక ప్రయోజనాలు కూడా దక్కకుండా చేస్తున్నాడనే ఆగ్రహంతోనే హత్యకు పథకం వేసినట్లు రాజమణి అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.ఈ నెల 16న అవకాశం చూసుకుని వెంకటేశ్వర్లుపై రోలు, రోకలి బండతో దాడి చేసి హత్య చేసినట్లు పోలీసుల విచారణలో తేలింది. నిందితురాలు ఇచ్చిన సమాచారం మేరకు హత్యకు ఉపయోగించిన రోలు, రోకలి బండను పోలీసులు పంచనామా నిర్వహించి స్వాధీనం చేసుకున్నారు. అనంతరం రాజమణిని గౌరవనీయ మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచినట్లు సీఐ కె. శ్రీధర్ తెలిపారు.

# గుంతలమయంగా రోడ్లు..

**ఈ రోడ్డు వెంట ప్రయాణం నరకయాతన...**

**వెంటనే బీటీ రోడ్డు నిర్మించాలి**

**ప్రజావాయిస్ బీబీపేట, ఆగస్టు 18**
బీబీపేట మండల పరిధిలోని రోడ్లు అధ్వానంగా మారి ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయని, వెంటనే ప్రభుత్వం స్పందించి నూతన బీటీ రోడ్లను నిర్మించాలని మాజీ ఎంపీటీసీ కొరివి నర్సింహులు డిమాండ్ చేశారు. బీబీపేట నుంచి ఉప్పరపల్లి మీదుగా రామాయంపేట వైపు వెళ్లే ప్రధాన రహదారిపై పెద్దఎత్తున గుంతలు ఏర్పడి వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు.సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో కొరివి నర్సింహులు మాట్లాడుతూ.. వర్షాకాలం కావడంతో రహదారిపై ఏర్పడిన గుంతల్లో నీరు నిలిచి ప్రమాదకరంగా మారిందన్నారు. ముఖ్యంగా కామారెడ్డి సెగ్మెంట్ లోని పెద్ద చెరువు అయినా బిబిపేట చెరువు కట్ట కింది నుంచి ఉప్పరపల్లి మీదుగా రామాయంపేట వరకు ఉన్న రహదారి పరిస్థితి మరింత దారుణంగా ఉందని తెలిపారు. గుంతలు కనిపించక



వాహనదారులు ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని, అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కాదనీ ముందే చర్యలు తీసుకోవాలన్నారు.రోడ్లపై గుంతలు ఏర్పడిన విషయం అధికారుల దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ప్రమాదాలు జరిగిన తర్వాత స్పందించడం కంటే ముందుగానే రహదారి మరమ్మతులు చేపట్టి ప్రజల ప్రాణాలను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వ, సంబంధిత అధికారులపై ఉందన్నారు. తాత్కాలికంగా గుంతలను పూడ్చడంతో సమస్య పరిష్కారం కాదని, నాణ్యమైన బీటీ రోడ్డును నిర్మించాలని డిమాండ్ చేశారు.



# కాకతీయ వైద్య కళాశాలలో ఘనంగా మెగా ప్లాంటేషన్ వన మహోత్సవం...

## విద్యార్థులు ఒక్కొక్కరు ఒక మొక్కను దత్తత తీసుకుని సంరక్షించాలి

### ఎమ్మెల్యే నాయిని. జిల్లా కలెక్టర్

**ప్రజా వాయిస్ హన్మకొండ జిల్లా ప్రతినిధి**

కాకతీయ వైద్య కళాశాల, వరంగల్ పూర్వ విద్యార్థుల సంఘం ఆధ్వర్యంలో, కళాశాల యాజమాన్యం సహకారంతో కాకతీయ వైద్య కళాశాల ప్రాంగణంలో మెగా ప్లాంటేషన్ వన మహోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డా. కస్తూరి శ్రీధర్ నేతృత్వంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి, గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కమిషనర్ వెంకన్న, అటవీ శాఖ అధికారులు, కాకతీయ వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డా. మోహన్ దాస్, ప్రొఫెసర్లు, సీనియర్ వైద్యులు, పూర్వ విద్యార్థులు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రాంగణంలో వెయ్యికి పైగా మొక్కలను నాటారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ, పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. వృక్షో రక్షతి రక్షితః అనే భావనతో మొక్కలను కాపాడితే అవే మనలను కాపాడతాయని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర బాధ్యతగా భావించాలని సూచించారు. వైద్య విద్యార్థులు ప్రతి




ఒక్కరూ కనీసం ఒక మొక్కను దత్తత తీసుకుని, దానికి క్రమం తప్పకుండా నీరు పోసి సంరక్షించాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. తాము వైద్య కళాశాలలో ఐదేళ్ల చదువు పూర్తి చేసే సమయానికి, తాము దత్తత తీసుకున్న మొక్క కూడా ఐదేళ్ల పాటు పెరిగి పెద్దదిగా మారేలా బాధ్యత తీసుకోవాలని అన్నారు. పర్యావరణాన్ని పరిరక్షించడం ద్వారా ఆరోగ్యకరమైన వాతావరణాన్ని నిర్మించడంతో పాటు అనేక వ్యాధులను నివారించేందుకు కూడా దోహదపడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అటవీ శాఖ అధికారులు, ముఖ్యంగా ముకుందరెడ్డి, పుల్లశెట్టి, లక్ష్మారెడ్డి తదితరులకు ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. పెద్ద సంఖ్యలో మొక్కలను ఉచితంగా అందించి కార్యక్రమానికి సహకరించిన అటవీ శాఖను అభినందించారు. పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షులు డా. కస్తూరి శ్రీధర్ మాట్లాడుతూ, కాకతీయ వైద్య కళాశాలతో పూర్వ విద్యార్థులకు ఉన్న అనుబంధం, కళాశాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందించాలనే బాధ్యతను ఈ కార్యక్రమం ద్వారా చాటుతున్నామని తెలిపారు. అటవీ శాఖ అధికారులు అందించిన సహకారానికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఉచితంగా పెద్ద సంఖ్యలో మొక్కలను అందించిన అటవీ శాఖ అధికారులకు అభినందనలు తెలియజేశారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి మాట్లాడుతూ, కాకతీయ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం కళాశాలతో ఇంత బలమైన అనుబంధాన్ని కొనసాగిస్తూ, కళాశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. నగరంలో భవిష్యత్తులో బహిరంగ ప్రదేశాలు తగ్గిపోయే పరిస్థితుల్లో కళాశాల ప్రాంగణం నగరానికి కీలకమైన గ్రీన్ లంగ్ స్పేస్‌గా ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. మొక్కలు నాటడం ఎంత ముఖ్యమో, వాటిని సంరక్షించి బతికించడం అంతకంటే ముఖ్యమని కలెక్టర్ అన్నారు. ప్రస్తుతం నాటిన మొక్కలను కనీసం వచ్చే ఏడాది వరకు జాగ్రత్తగా సంరక్షిస్తే వాటి మనుగడ శాతం గణనీయంగా పెరుగుతుందని తెలిపారు. మొక్కలకు క్రమం తప్పకుండా నీరు అందించేందుకు అవసరమైన సహకారాన్ని అందించేందుకు సంబంధిత శాఖలు సిద్ధంగా ఉన్నాయని చెప్పారు. కాకతీయ వైద్య కళాశాల వంటి విద్యాసంస్థల్లో పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలను నిరంతరం కొనసాగించాలని, నాటిన ప్రతి మొక్కను సంరక్షించే బాధ్యతను విద్యార్థులు, కళాశాల యాజమాన్యం తీసుకోవాలని అధికారులు సూచించారు.

# వీర జవాన్లకు ఘన నివాళి



**ప్రజా వాయిస్, కోరుట్ల:**

కార్గిల్ యుద్ధంలో ప్రాణాలను పణంగా పెట్టి దేశాన్ని రక్షించిన వీర జవాన్ల త్యాగాలు చిరస్మరణీయమని బీజేపీ నాయకులు కొనియాడారు. శుక్రవారం కోరుట్ల పట్టణ శాఖ ఆధ్వర్యంలో 'కార్గిల్ విజయ్ దివస్'ను పురస్కరించుకుని అమరవీరులకు కొవ్వొత్తులతో నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 1999లో పాక్ సైన్యాన్ని తరిమికొట్టిన భారత సైనికుల ధైర్యసాహసాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు సుధవేని మహేష్, ప్రధాన కార్యదర్శులు చెట్లపెల్లి సాగర్, ఎర్ర రాజేందర్, మాజీ కౌన్సిలర్లు నరేష్, గణేష్, సీనియర్ నాయకులు శ్రీనివాసరావు, శ్రీకాంత్, బ్రహ్మం, ఉదయ్, మహేష్ గౌడ్, నారాయణరెడ్డి, రమేష్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.



# పాపన్న గౌడ్ ఆశయాలు యువతకు ఆదర్శం

### మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి.

**ప్రజా వాయిస్,మిర్యాలగూడ:**

సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మహారాజ్ 376వ జయంతి సందర్భంగా మిర్యాలగూడ పట్టణంలోని గౌడ సంఘం భవనంలో ఘనంగా నివాళులు అర్పించారు. గౌడ సంఘం సభ్యులతో కలిసి మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి పాపన్న గౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ బడుగు, బలహీన వర్గాల హక్కుల కోసం పోరాడిన గొప్ప వీరుడని కొనియాడారు. అణగారిన వర్గాలకు ఆత్మగౌరవం, సమానత్వం కోసం ఆయన సాగించిన పోరాటం చిరస్మరణీయమన్నారు. పాపన్న గౌడ్ ఆశయాలు, స్ఫూర్తిని నేటి యువత ఆదర్శంగా తీసుకుని సమాజ అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు, సభ్యులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# రైతులకు న్యాయం చేయాలని కలెక్టర్‌కు విజ్ఞప్తి



**శంషాబాద్ । ప్రజా వాయిస్**

చిన్న గోల్కొండ గ్రామంలోని కో-ఆపరేటివ్ సొసైటీలో జరిగిన అక్రమాలపై బీజేపీ ఆధ్వర్యంలో రాజేంద్రనగర్ నియోజకవర్గ నాయకులు శ్రీ తొకల శ్రీనివాస్ రెడ్డి అన్నా గారి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. స్పందించిన ఆయన రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా రంగారెడ్డి జిల్లా కలెక్టర్‌ను కలిసి కో-ఆపరేటివ్ సొసైటీలో జరిగిన అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవడంతో పాటు రైతులకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు.

# స్మార్ట్ రేషన్ కార్డులో మోదీ ఫొటో ఏదీ?

### కేంద్రం సొమ్ముతో రాష్ట్రం సోకులు సరికాదు.

### మిర్యాలగూడ ఆర్డీఓ రమణారెడ్డి కి వినతిపత్రం అందజేసిన బీజేపీ శ్రేణులు



**ప్రజా వాయిస్,మిర్యాలగూడ..**

తెలంగాణ ప్రభుత్వం కొత్తగా మంజూరు చేస్తున్న స్మార్ట్ రేషన్ కార్డులపై ప్రధాని నరేంద్ర మోదీ ఫొటో లేకపోవడంపై మిర్యాలగూడ బీజేపీ నాయకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రధానమంత్రి గరీబ్ కళ్యాణ్ అన్న యోజన ద్వారా తెలంగాణలో కోట్లాది మంది లబ్ధిదారులకు ఉచితంగా 5 కిలోల బియ్యం అందిస్తున్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం పాత్రను విస్మరిస్తోందని ఆరోపించారు. కేంద్రం అందిస్తున్న ఉచిత బియ్యంతో పాటు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న బియ్యం విషయంలోనూ ప్రజలకు వాస్తవాలను స్పష్టంగా తెలియజేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర నిధులతోనే అభివృద్ధి పనులు చేపడుతూ, వాటిని రాష్ట్ర ప్రభుత్వ ఘనతగా ప్రచారం చేసుకోవడం సరికాదని బీజేపీ నాయకులు విమర్శించారు. కేంద్రం నుంచి వస్తున్న నిధులు, సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని, స్మార్ట్ రేషన్ కార్డుల విషయంలోనూ కేంద్ర ప్రభుత్వ పాత్రను గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా బీజేపీ పట్టణ అధ్యక్షుడు బంటు గిరి, కార్యదర్శి కొంగరి వెంకటరమణ, మూల రాజిరెడ్డి, చిలుకూరి శ్యామ్, జిల్లా కార్యదర్శి చిల్లంచర్ల అభి, సీనియర్ నాయకులు బంటు సైదులు, కన్మంత్ రెడ్డి, అశోక్ రెడ్డి, కొండేటి సరిత, జనాభాయ్, మొదాల అశోక్, గొనె కవిత, మండల సోములు, మున్సిపల్ కౌన్సిలర్ వెలుగు ఇందిరా నాగరాజు, ఉబ్బపల్లి నంద, జిల్లా కార్యవర్గ సభ్యులు లక్ష్మారెడ్డి, మంద శివ, చిలుకూరి వెంకటేశ్వర్లు, దైవసోములు, మునగాల శివ, వెల్లిజాల ఏడుకొండలు, యాదగిరి, వేణు, శివయ్య, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

# హామీలు అమలు చేయడంలో కాంగ్రెస్ విఫలం: బీఆర్ఎస్ నేతలు ఫైర్





**ప్రజా వాయిస్, హుజూర్ నగర్, ఆగస్టు 18**

ఎన్నికల ముందు యువతకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. మంగళవారం హుజూర్‌నగర్‌లోని శ్రీ లక్ష్మీ ఫంక్షన్ హాల్‌లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో యూత్ డిక్లరేషన్‌పై నిర్వహించిన నిరుద్యోగ సదస్సులో రాష్ట్ర నాయకులు, ఎమ్మెల్సీ కాంటెస్టెంట్ ఏనుగుల రాకేష్ రెడ్డి, నియోజకవర్గ నాయకుడు పిల్లుట్ల రఘు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లుట్ల రఘు మాట్లాడుతూ.. 35 లక్షలకుపైగా ఉన్న నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. రెండు లక్షల ఉద్యోగాలకు నోటిఫికేషన్లు, నిరుద్యోగ భృతి, యువతకు స్కూటీలు వంటి హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. హుజూర్‌నగర్ నియోజకవర్గంలో ఉన్న సిమెంట్ పరిశ్రమల్లో స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఏనుగుల రాకేష్ రెడ్డి మాట్లాడుతూ యువత దేశ, సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విషయంలో నిర్లక్ష్యం చేస్తోందని విమర్శించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఉద్యోగాలు, కోచింగ్ అవకాశాలు కల్పించామని పేర్కొన్నారు. యువత సమస్యలపై ప్రభుత్వం స్పందించకపోతే నిరుద్యోగుల్లో ఆగ్రహం పెరుగుతుందని హెచ్చరించారు. కార్యకర్తలు, యువత పెద్ద సంఖ్యలో హాజరైన ఈ సదస్సులో రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై బీఆర్ఎస్ నేతలు తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు.

# సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలు...

### - సుల్తానాబాద్ లో గౌడ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ



**ప్రజా వాయిస్, సుల్తానాబాద్ :** తెలంగాణ వీరత్వానికి, బహుజన పోరాట స్ఫూర్తికి ప్రతీకగా నిలిచిన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 376వ జయంతి వేడుకలను సుల్తానాబాద్ మండల కేంద్రంలోని సర్వాయి పాపన్న విగ్రహం వద్ద గౌడ సంఘం ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పెద్దపల్లి జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతటి అన్నయ్య గౌడ్, మున్సిపల్ కమిషనర్ తిప్పరాజు రమేష్, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ అంతటి పుష్పలత, 14వ వార్డు కౌన్సిలర్ పద్మ అబ్బయ్య గౌడ్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ ముత్యం సునీత, పెద్దపల్లి బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి మనోజ్ పాల్గొని, కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పాపన్న గౌడ్ ఆశయాలు, ఆయన పోరాట స్ఫూర్తిని స్మరించుకున్నారు. బహుజనుల ఆత్మగౌరవం కోసం పాపన్న చేసిన పోరాటం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గౌడ అడక్ కమిటీ అధ్యక్షుడు పొన్నం తిరుపతి, ఉపాధ్యక్షుడు కొయ్యడ శ్రీనివాస్, గౌడ సంఘం నాయకులు పోడేటి వెంకటేష్ గౌడ్, గడ్డం సత్యనారాయణ గౌడ్, అంతటి లచ్చయ్య గౌడ్, అంతటి సాగర్ గౌడ్, గోదావరి అర్బన్ బ్యాంక్ మేనేజర్ అంతటి చిరంజీవి గౌడ్, బండి సంపత్ గౌడ్, చేపూరి రవీందర్ గౌడ్, మంద కిషన్ గౌడ్, బత్తిని కృష్ణ గౌడ్, మంద శివ గౌడ్, పెరమండ్ల రమేష్ గౌడ్, వీరయ్య గౌడ్‌తో పాటు గౌడ సంఘం సభ్యులు, పాపన్న అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్ పర్సన్ గా రాజేంద్రప్రసాద్ యాదవ్

### బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపిన రాజేంద్రప్రసాద్ యాదవ్



ALL INDIA CONGRESS COMMITTEE

K.C. Venugopal, M.P.
General Secretary

24, AKBAR ROAD, NEW DELHI-110011

August 18, 2026

PRESS RELEASE

Hon'ble Congress President has approved the proposal for the appointment of State Chairpersons of the RGPRS for the respective states, as follows, with immediate effect.

1. Shri Manoj Singh Patel - Uttar Pradesh
2. Shri Avinash Jagannath Umarkar - Maharashtra
3. Shri Marka Rajendra Prasad Yadav - Telangana
4. Shri Arjun Radhkrishnan - Kerala

(K. C. Venugopal)



**శ్రీరంగాపూర్ ప్రజా వాయిస్**

తెలంగాణ రాష్ట్ర రాజీవ్ గాంధీ పంచాయతీరాజ్ సంఘటన్ చైర్ పర్సన్ గా రాజేంద్రప్రసాద్ యాదవ్ నియమితులయ్యారు. ఈ నియామకాన్ని ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించారు. ఈ సందర్భంగా రాజేందర్ ప్రసాద్ యాదవ్ మాట్లాడుతూ, తెలంగాణలో పంచాయతీరాజ్ వ్యవస్థ మరింత బలపడడానికి నా వంతు కృషి చేస్తానని ఆయన పేర్కొన్నారు. నాపై నమ్మకం ఉంచి ఈ పదవి బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలని తెలిపారు. ఈ పదవి రావడంతో మండల ప్రజలు ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.